శ్రీ రాజేశ్వరి ప్రెస్
రాజమహేంద్రవరం

తారాపథం

— పురుషులు —

1. అభిమన్యుఁడు — కథానాయకుఁడు
2. ధర్మరాజు
3. భీముఁడు
4. అర్జునుఁడు
5. నకులుఁడు
6. సహదేవుఁడు

(2–6) — పాండవులు

7. దుర్యోధనుఁడు — కురురాజు
8. దుశ్శాసనుఁడు — ,, తమ్ముఁడు
9. కర్ణుడు — ,, స్నేహితుఁడు
10. శకుని — ,, మేనమామ
11. భీష్ముఁడు — ,, తాత
12. సైంధవుఁడు — ,, బావమఱఁది
13. ద్రోణుఁడు — ,, ధనుర్విద్యాచార్యుఁడు
14. అశ్వత్థామ — ద్రోణుని కుమారుఁడు
15. సుధర్ముఁడు — అభిమన్యుని సారథి
16. కృష్ణుఁడు — పాండవుల బావమఱఁది
17. ఘటోత్కచుఁడు — భీముని కుమారుఁడు
18. గూఢచారి
19. సేవకుఁడు
20. నారదుఁడు — దేవముని
21. సంజయుఁడు — కురుహిత చింతకుఁడు

— స్త్రీలు —

1. దివ్యాంగనలు
2. సుభద్ర —కథానాయకుని తల్లి
3. ఉత్తర —కథానాయిక
4. మందారిక
5. భ్రమర
6. వకుళమాల

(4–6) ,, చెలులు

7. ద్రౌపది —పాండవపత్ని
8. దుస్సల —సైంధవుని భార్య
9. భరతమాత.

వీరాభిమన్యు

ప్రార్థన

[నారదుఁడును, అఱుగురు దివ్యాంగనలును ప్రవేశము]

(అనుబంధము 1)

:—— (అనుబంధము 2)

సీ॥ శ్రీమంత పాంచాల ♦ కోమలదేశంబు
సదమల సుందరా ♦ స్యంబు గాఁగ
సుమహితోన్నతమైన ♦ హిమవన్నగాగ్రము
జ్వలితకిరీట రా ♦ జంబు గాఁగ
మందాకినీ సొంపు ♦ సింధూస్రవంతులు
రాజితరత్న హా ♦ రములు గాఁగ
పాదాంచలంబున ♦ భాసిల్లు సింహళ
మంబుజాతసుభాస ♦ నంబు గాఁగ

సారఘూర్జర మభయహ ♦ స్తంబు గాఁగ
ప్రథిత నేపాళ మే కేశ ♦ రాశి గాఁగ
కర్మవీరులఁ గనుపారఁ ♦ గన్న తల్లి
భరతమాతకు జయమస్తు ♦ భద్రమస్తు.

భరతమాతకు జయము! హైందవ స్వారాజ్యమాతకు జయము!
ఆసేతుహిమాచల పర్యంతార్యావర్త భూజనులకు జయము!
తమ సామ్రాజ్యమును బరరాజు లాక్రమించినప్పుడు, నిజ
రాష్ట్రమాతను నీచులు భంగపరచినప్పుడు, శాంతములపై సత్య
శీలముపై నాధారపడి, సస్యశ్యామలమై, రత్నగర్భయగు
హిందూ సుందరిని దుశ్శాసనులు కొప్పుఁబట్టి యీడ్చి, కటి
వస్త్రంబూడ్చి యవమానింప సముద్యోగించునప్పుడు, మొక్క
వోవని శౌర్యమున కిరవగు భరతమాతకడుపునఁ బిఱికిపందలు,
సన్న్యాసులు, మాతృద్రోహులు నగు తులువలు వేనవేలుగా
బుట్టి—పుట్టినభూమి కవమానముఁ దెచ్చునపుడు తన విద్యుక్త
ధర్మము నెఱింగిన బాలభారత వీరాభిమన్యుని యాత్మకు
ధన్యవాద సహస్రములు—హిందూదేశ చరిత్రమున వీరుండని
చెప్పఁదగిన దివ్య వీరరసావతారమూర్తి—వీరాభిమన్యునకు,
ధన్యవాదములు!!!—తల్లీ! భారతమాతా! నీ గర్భమున
నిరంతర మభిమన్యుసమ వీరసహస్రము జనియించుఁగాక! జయ్
వీరాభిమన్యునకు జయ్!

చ. చెనఁటులు దుష్క్రియాపరతఁ ♦ జేసి స్వారాజ్యము నాక్రమించి, వం
చనమున ముక్తకేశ యగు ♦ నట్లొనరించిన యాజ్ఞసేని రో
దనజలధారకై ప్రథన ♦ దారుణరంగమునందు శోణవా
హినిఁ బ్రవహింపఁజేసిన య ♦ హీనబలాఢ్యుల కాత్మశాంతియౌ.

అందఱు—(అనుబంధము 3)

(అందఱు—ప్రస్థానము)

వీరాభిమన్య

ప్రథమాంకము

దృశ్యము - ౧

ప్రదేశము—ఉద్యానవనము

ప్రవేశము—ఉత్తర, భ్రమర, వకుళమాల

సమయము—సాయంకాలము.

ఉత్త :-చెలీ! భ్రమరా! సఖీ! వకుళమాలా! లోకాభిరామమైన యీ యారామమందున్నను నా మనం బేలాగోయున్నదిసుమా!

భ్రమ:-ఔనే. వకుళమాలా! పాపముత్తర చాలింతగదా! చాలింత బాలింత యగువఱకు—అన్నము రుచింపదు. నీళ్లు సహింపవు. తుదకుఁ బిల్లగాలి వచ్చు చల్లనితోట సయితము, సంతాప కారణమే యైనది.

వకు :- ఏదే! మొన్ననేకదా ఐదవనెల వెళ్లినది. అబ్బా! యింతలోననే యింత వేవిళ్ళఁటే!!—

భ్రమ:-పాపము! ఉత్తర మొన్నటిపిల్ల కాదఁటే! అరవేదపిల్ల—

ఉత్త :-చాలు. చాలు. చెలులారా! మీరు పలుకుట కేమిలెండు! ఈ పరిహాసములు మానుఁడు!!

(అనుబంధము 4)

వకు :- అక్కయమ్మా! ఇంతలో నింతకోప మెందులకమ్మా?

ఉత్త :-వకుళా! కోపమేమియును లేదు. నిన్నరాత్రి నాకేదో పాడు కల వచ్చినది. ఆ కారణమున, నా మనస్సు కలఁతపడి మఱిమఱి యదియే స్మృతికి వచ్చుచున్నది.

వకు :-పాడుకలయా! అట్లయిన, నదేదో వినవలసినదే!

ప్రభ:—దుస్స్వప్నములకై భూసుర సమారాధనాదులఁ గావించి శాంతిపరుపఁదగును.

ఉత్త :—వినుఁడు. క్రిందటిరాత్రి నిద్రఁజోవుటకుపూర్వ మార్యపుత్రుఁడు నాతోడ, మామగారు సైంధవుని కుమారునిఁ జంపినవార్తఁ జెప్పుచుండిరి. అట్టులే నిద్దురపట్టెను. ఒకింత కన్నుమూసితినో లేదో నా కంటికొక భయంకరాకారము కనుపించెను. అది నన్నుఁ జూచి కన్నుల నిప్పులు రాల్చుచు మానవభాషతోడ " ఓసీ రాకాసీ! నేను సైంధవుని పుత్రుండ! నీ మామ నన్నుఁ జంపినాఁడు: నాతండ్రి నీ మగని...అని యింకేవో చెప్పరాని మాటల నాడి యదృశ్యమైపోయెను. అది విని యడలుఁ జెందుచు నేను నిద్దుర లేచితిని. ఆర్యపుత్రుఁడు నన్నోదార్చెను. కాని నా మనస్సుమాత్రము కలఁతఁ దేఱ లేదు.

ప్రభ:—అమ్మా! విచారింపకుము; దురాలోక తేజోవిరాజితులగు మామగారికిని, ప్రపంచైకవీరులగు భర్తృదారకునకును, నేకీడును రాదు.

వకు :—అట్లు జరుగుట తప్పక స్వప్నవార్తయే.

(సేవకుఁడు ప్రవేశము)

సేవ :—దేవిగారికి జయము!

వకు :—ఏమిరా అది?

సేవ :—అమ్మా! ఎవరో మందారికయఁట! వకుళమాలికకుఁ జిన్ననాఁటి స్నేహితురాలఁట! లోపలకు రాఁదగునాయని యడుగుచున్నది.

భద్ర :—వకుళా! మందారిక యనిన నిప్పుడు కురునగరమున సైంధవునింట దాసిగానున్నదేకదా!

వకు :—ఔను. అది నాకు చిన్ననాఁటి చెలికత్తె—

భ్రమ:—వకుళా! అయినమాత్రమేమి? శత్రుసింహాసనమునుండి దాసి వచ్చు టన్న ......

(మందారిక ప్రవేశము)

మందా:—చెలీ! వకుళా! నీ విచ్చట విలాసముగఁ బ్రొద్దులుఁ బుచ్చుచుంటివి కావలయును. అనుజ్ఞ లేకయే లోపలకు వచ్చినందులకు మన్నింపవలయును.

ఉత్త:—సేవకా! నీ సంకోచమేమమ్మా. మందారికా! నీవు—మా శత్రువుల యింటి దాసివైనను, నా చెలియగు వకుళమాలకుఁ బరిచితురాల వగుటచేత—అవశ్యము సన్మానింపదగినదానవు. కూర్చుండుము.

వకు:—చెలీ! రమ్మా. మా చిన్న దేవిగారినిఁ జూచితివా! ఇదిగో కూర్చుండుము ...... ఈమెకిప్పుడు నెల తప్పియున్నది.

మందా:—ఓహో! అభిమన్యుని భార్య ఉత్తరాదేవిగారా! అబ్బా! యీమె యేనా! హాహాహాహాహాహా—

భ్రమ:—మందారికా! అటు లంటివేమే!

వకు:—ఎన్నఁడును దానీమెను చూడలేదని యట్లన్నదేమో—మందారిక వట్టి వెట్టిబాగులది—మందారికా! అంతేకాదా! రాక రాక వచ్చితివి; కూర్చుండుము.

భ్రమ:—అబ్బ!—నీవును వెట్టిబాగులదానవే! ఆవిడ వెట్టిబాగులది. నీవును వెట్టిబాగులదానవే—అమ్మా! ఉత్తరాదేవీ! లేచి రమ్మా. ఈవిడ తన చెలితో సావకాశముగ మాటలాడుకొని యింటికి వచ్చును లెమ్మా.

వకు:—భ్రమరా! ఎందులకే అంతకోపము?

భ్రమ:—కోపములేదు. తాపములేదు—రావమ్మా! ఉత్తరాదేవి!

మందా:—వకుళా! పోనిమ్మా. ఎవరిని బెదరించును?

ఉత్త:-భ్రమరా! మందారిక యేమన్నదని?—మందారికా! కోప
పడకు! మా భ్రమరకు ముక్కుమీఁది కోపము.

వకు :-అమ్మా! నా చెలి శత్రుపక్షమునుండి వచ్చినదన్న సంకోచము కలిగినచో మర్యాదగనే పంపవచ్చునుగాని, వచ్చినదాని నవమానించుట భ్రమరకుఁ దగినపనియే గా!

భ్రమ:-వచ్చిన దానికేమి విషముపోసితిమా? దేవిగారు కూర్చుండుమనఁ దన మర్యాదను దక్కించుకొనసక్కఱలేదా? దేనినిఁ గాంచి పరిహాసము లేల?

వకు :-ఏమి పరియాచకము లాడితిని?

భ్రమ:-ఏమి పరియాచకములా!—ఏమి పరియాచకములో దేవి వినుచుండుట లేదా? ఇట్టి పొగరుఁబోతుదాని నేమి చేయవలెను?

ఉత్త :-ఆఁ! ఆఁ!! భ్రమరా! అంతమాటలేల యాడవలెను?

(అనుబంధము 5)

మందా:-భ్రమరా! తెగసాగకు. నీవు గొప్పదానివైన, నీ దేవి గొప్పదైన—మీ గొప్పతనము మీకడ నుంచుకొనవలెను. పనులపై జూపిన సహింపరు! జాగ్రత్త! మీ ప్రదేశమగుటచే బ్రతికిపోయితివి! కానిచో—

భ్రమ:-కానిచో?—నన్నేమి చేసెదవే తొత్తా!

వకు :-ఆహాహా! అది తొత్తు—నీవు యజమానురాలవు.

మం :-ఏమి చేసెదనో యెఱుఁగవా? అర్జునుఁడు తన కుమారునిఁ జంపినాఁడని మా దేవి దుస్సల యీవఱకే కడుపు మసలియున్నది. ఇప్పుడామెచే నామె మగనికిఁ జెప్పింపఁజేసి—అభిమన్యుని గొంతుఁగోయింపకున్న నాపేరు మందారిక కాదు.

ఉత్త :-హా! పరమేశ్వరా! (మూర్ఛిల్లును)

భ్రమ:-అభిమన్యునిం జంపి యర్జునునకుఁ బుత్రశోకము గలిగించుట వట్టిదిగాని యీమాట మా సుభద్రాదేవి వినెనేని, మీ సేవికిఁ

పుత్రశోకముతోపాటు—భర్తృశోకమును గలుగక మానదు. వింటివా! ఇంక నిచ్చటనుండి కదలవేని నీ గొంతు కోయించుటయే నిజము!

మందా:-ఇంక నిచ్చట నుండుమన్న నుండువా రెవ్వరు? రావే! వకుళమాలా! ఈపాటి బ్రతుకు నీ వక్కడ బ్రతుకలేకపోదువా?

(అనుబంధము 6) (ఇద్దఱు ప్రస్థానము)

ప్రభమ:-ఆహా! పాపము! వకుళమాల మందారికతోఁ గూడి యకారణముగ నెంత కలహమును దెచ్చి పెట్టినది?—దేవీ! దేవీ!... ... ... సేనకా! దేవిగారు మూర్ఛిల్లి యున్నారు. ఈ వార్తను సుభద్రాదేవికి తెలియఁగింపుము.

(తెరలో) చిత్తము.

ప్రభమ:-ఆహా! ప్రపంచమున కపట మెచ్చటఁ గలదో—సత్య మెక్కడఁ గలదో—తెలియుంగుట కడు దుర్లభము గదా?

(అనుబంధము 7)

(ప్రవేశము—శీఘ్రముగ సుభద్ర)

సుభ:-ప్రభమరా! ఉత్తర యెక్కడ నున్నది?

ప్రభమ:-అమ్మా! ఈమె మూర్ఛ చెందుచున్నది.

సుభ:-భయములేదు. భర్తృహీనురాలైన యీ యుత్తర—పాపాత్మురాలగు మందారిక మాటలను విని, సహింపలేకపోయినది. చల్లని నీరు మొగముపై జల్లి లోనికిఁ గొనిపొమ్ము. వకుళమాల శత్రుపక్షములోనిదని, నేనిదివఱకే యెఱుఁగుదు. యుద్ధమారంభమగు దినములు సమీపించినవి. మందారిక మద్యాపనవనము లని, విహారవనములని బయలుదేరవలదు. లోపల కుండుము.

(అనుబంధము 8)

(అందఱు ప్రస్థానము)

ప్రదేశము—దుస్సలాంతఃపురము

ప్రవేశము—దుస్సల, మందారిక, వకుళమాల

సమయము—మధ్యాహ్నము

మందా
వకు } (అనుబంధము 9)

దుస్స :-(రోసముతో) అన్నన్నా! ఆ పాడుముండకు నాప్రస్తావనమేల? నా కొడుకును దనపొట్టనుఁ బెట్టుకొన్న పాడు పార్థునకు మాత్ర మింక బుత్రశోకముఁ గలుగఁజేయనా? సుభద్రయు నావలెఁ గొడుకుచచ్చి యేడ్వుఁగాక! ఉత్తర మగఁడుచచ్చి యేడ్చు గాక! మందారికా! భర్తగా రెక్కడ?

మం :-అమ్మా! ఇదుగో, ఇటులనే వచ్చుచున్నారు.

(సైంధవుఁడు ప్రవేశించును)

సైం :-దేవీ! ఏమిది? నీ వింక నిచ్చటనే యుంటివి! నీ విప్పుడే వత్తువో యింకనే వత్తువో యని కాచికాచి నేసారితిని. పాచికలను ముందుంచుకొని కునికిపాట్లు పడుచుంటిని. కాని, రానైతివి.

దుస్స:-ఛీ! ఏమిది? పాచికలును—కునుకిపాట్లును దప్ప మీకిప్పుడు నేఁటు ముఖ్యావసరము లేవియు గాన్పింపలేదా?

సైం :-ప్రేయసీ! రోషకషాయిత లోచనవై యటులంటివేమి? నే నీ యకాలమున, నీయందొనర్పవలసినదేమైన మిగిలిపోలేదుగదా?

దుస్స:-మిగిలిపోక మీరు చేసినకార్యమేమున్నది? పాండవమధ్యముఁడు కుమారుని చంపఁగాఁ జేతఁగానియట్లు నోరు మూసికొని యూరకుంటిమి. గర్వితులై మనలను వా రెంతటి పరిహాస మొనరించినను బందలవలె నూరకుంటిమి. ఇంతకన్నఁ జేసిన దేమున్నది? తాను తన మగనిచే నాకుఁబెట్టిన పుత్రశోకమును దలంచుకొని, కెవ్వునఁగేకపెట్టి యా సుభద్ర యొంటికాలి భరత

మాడుచుండఁగాఁ జేతఁగానిదానివలె నిట్టి పతి నొసంగిన పరమేశ్వరునిఁ దిట్టుచుఁ గంటికిఁ గడివెడునీరుఁ గార్చుటకన్న నేను చేయఁదగిన దేమున్నది ?

(అనుబంధము 10)

సైం :–సతీమణీ ! ఇప్పుడు సుభద్రగాని ఉత్తరగాని నిన్నవమానింప లేదుగదా !

దుస్స:–అవమానములతోఁ దీరినదా ? ఆ దురాత్ము్రాలు భ్రమర మన మందారికను జూచి మీ దేవికిఁ బుత్రశోకముతోఁబాటు భర్తృ శోకమును గల్గించెదనని పలికి త్రుళ్ళిపడినదఁట ! ఇఁక నేను ముందు బ్రతికి యేమి ప్రయోజనము ? (దుఃఖించుచున్నది)

సైం :–ఆఁ ! ఏమీ ! దురాత్మురా లెంతమాటాడినది ?

క. దేవి ! యభిమన్యురక్త
స్రావముతో నాసుభద్ర ♦ సంతతబాష్ప
స్రావముతోఁ గనుకొలకులఁ
దావక సమ్మోద వారి ♦ ధారలురాలున్.

నా కుమారునిఁ జంపినవాని కుమారు నేకాదు. వానినే యుద్ధభూమికి బలియిచ్చెదను. దేవీ ! దుఃఖింపకుము. అభిమన్యుని శరీరమును యుద్ధమున వేయి చిల్లులుగాఁబొడిచి యా రక్తము నీకుఁజూపెద. పరిపంథిగర్వనిర్వాపణధూర్వహము గు నా కరవాలమున కెదురు లేదని కురుపాండవుల కెఱిఁగించెద; సుభద్రకుఁ బుత్రశోకంబును, నుత్తరకు భర్తృశోకంబును నేకకాలంబునఁ గలిగించెద.

(అనుబంధము 11)

(అందఱు ప్రస్థానము)

ఇది ప్రథమాంకము.

వీరాభిమన్యు

ద్వితీయాంకము

దృశ్యము—౧ ; ప్రదేశము—యుద్ధభూమి

సమయము—ఉదయము.

(అనుబంధములు 12-13)

అర్జు :-పరమాత్మా! శ్రీకృష్ణభగవాన్ ! నీ వెంతిగా నుపదేశించినను నా కిది యెంతమాత్రమును ధర్మమని తోఁచుటలేదు. నేను ధైర్యహీనుఁడననియు, వాక్శూరుఁడ ననియు నీవు తలంచినను సరియే ! ఈ యుపదేశమును మాత్ర మొనరింపకుము. ఇది దౌర్జన్యము ! పాపకార్యము ! రాక్షసవృత్తి ! దయారహితము! క్రౌర్యసహితము ! బావా ! నీ కిదే ప్రణుతి గావింతును ! నన్ను వదలుము; ఇవే ధనుర్బాణములు వదలుచున్నాను. రక్తపాన సాధనములును, ప్రాణాపహరణకారణములును నగు నీయాయుధములచే నా కరయుగళమును కళంకమును గావింప నోపను.

(ధనుర్బాణములను వదలును)

కృష్ణు:-(చిఱునవ్వుతో) బావా! అర్జునా! ఈ చిత్రసన్యాసము, నీ యాత్మనిర్వేదము నివాతకవచకాలకేయసంహార సమయమునం దేమయ్యెను? ఘోషయాత్రాది విషయకాలములం దేమయ్యెను? గోగ్రహణయుద్ధమునం దేమయ్యెను? గాండీవమే నీ కర మలంకరింపదో - అప్పుడో కమూఁగు కళంకస్థమైన కరంబులకు మఱల కళంక మేమి? ఈ నడుమ నీ కరములు క్రొత్తగా పవిత్ర మగుటను నేను వినియుండలేదే! సుక్షత్రియునకు బాణసన్యాస మనిన నవమానకరము-నిందాస్పదము-లజ్జాహేతువు-పరిహాసమూలము-శత్రుంజయుడవు. విజయనామధేయుఁడవు. శంకర

దత్తి పాశుపతాస్త్ర మహామహితుండవు. నీ శౌర్యమును నమ్మి కొని రణమున బ్రవేశించిన యుధిష్ఠిరుని యాశలు మంటఁగలియు నిప్పుడీ పనియేమి?

అర్జు:-బావా! నీవింక నాకేమియు నుపదేశింపకుము. నా మానంబు చెడినది. అహా! నాకేటి రణము దాఁపురించె! ఒక వంక పుత్రులు, నొకవంక మిత్రులు, నొకవంక తాతలు, నొకవంక భ్రాతలుఁగల సకలబాంధవ సహిత సేనా సాగర మధ్యంబున బంధునాశకుండనై - పాపాత్ముండనై - శత్రువులకుఁ గాని పిల్లల రోదనలను, సతులం బాసిన విధవల యాక్రందనములను హా హా! నేను వినఁజాలను. ఈ నెత్తురుకూడు తినఁజాలను. ఘోరము గనఁజాలను. భూమిపై మనఁజాలను.

కృష్ణు:-పార్థా! ఇట్టి అధైర్యశాలివి రణమున కేల వచ్చితివి?

అర్జు:-వచ్చిన నిప్పుడేమైనది?

కృష్ణు:-ఏమయినదా! సేనాసముద్ర ముప్పొంగి ఘూర్ణిల్ల సిద్ధమైనది. దివ్యభారతమహాయుద్ధ ముహూర్తము సిద్ధమైనది. భయంకర వీరరణోత్సాహపూరితరణభేరీభాంకారము దిశాంతరములఁ బ్రతిధ్వనిత మయినది. పాండవ విజయ కాలము సమీపమయినది. ఇంత యయినప్పు డిట్లు గావించితివి. కావున పాండవులు ధర్మజునాజ్ఞకు బద్ధులు కారని వెల్లడి యయినది.

అర్జు:-ఆఁ! అట్లెవ్వరు చెప్పినారు?

కృష్ణు:-ఎవ్వరు చెప్పవలయును? నీ కార్యములం దంతకన్న నర్థ మేమున్నది?

అర్జు:-అదేమో నీవే చెప్పుము.

కృష్ణు:-మాయాదురోదరంబున నోడినదాది యనేక కష్టము లనుభవించి, పడరానిపాట్లఁబడి పండ్రెండేండ్ల వనవాసము, నొకయే డజ్ఞాతవాసమునకైన సహించి, యెప్పుడు కౌరవయుద్ధము,

యెప్పుడు కౌరవనాశము, యెప్పుడు క్షాత్రిన ప్రతీకారమని దినములు లెక్కించుచున్న నీయన్న యుధిష్ఠిరుని యాజ్ఞను బాలించువాఁడవైనచో నీ విట్లాడుదువా ?

అర్జు :–ఇందు నా యవిధేయత మేమున్నది ?

కృష్ణు:–కేవల మవిధేయత ! ఒక్క యవిధేయతయే కాదు. ప్రత్యక్ష విరోధము. ఇప్పుడు యుద్ధమును మానుదువేని నీవు గావించి నంత కీడు నీ యన్నకు దుర్యోధనుఁడైనఁ గావింపఁగలఁడా ?

అర్జు :–నే నాయన కొనరించిన విరోధ మేమున్నది ? చుట్టములం జంపు కొనుటకుఁ జేయాడదనిన విరోధమగునా ? ఈ కార్యము నిష్ఠుర మని యాతఁడు మాత్ర మెఱుంగఁడా ! ఆతఁడు నాకన్న దయాసాంద్రుఁడే ! బంధునాశనమునఁ బరమానందముగాఁ దలంచునా బావా !

సీ॥ శూరపుత్రులఁ బాయు ♦ వీరమాతల శ్రవ
ణాలభీల శోకార ♦ వాలితోడఁ
బతులఁ బాసిన పాత ♦ భాగినీ భారత
సతులతోఁ గాలెడు ♦ చితులతోడ
హతవీరులకు బంధు ♦ తతులవిడువఁ బ్రవ
హించు నిలింపవా ♦ హినులతోడ
గఱుఁడుఁ గట్టిన నల్లఁ ♦ గడుపారఁ దిని కేరు
గగనబలాక సం ♦ ఘములతోడ

గీ॥ నాశలను రాసులైన శ ♦ ల్యములతోడఁ
నడరు వృద్ధుల శాపవా ♦ క్యములతోడఁ
బ్రేతభూతుల్యమైన యీ ♦ పృథివిఁ దాల్పఁ
కుడువఁగాఁజాల నెత్తురు ♦ కూడు కృష్ణ !

(అనుబంధము 14)

కృష్ణు:–వెఱ్ఱివాఁడా ! కౌరవు లిపుడు నీకు బంధువులైరా ! ద్రౌపదీ కేశాంబరములను మహాసభామధ్యమున నొలిచి, కులటా యని

పిలిచి దుర్యోధనుఁడు తోడఁ జూపించుట మఱచితివో! మాయజూదమున శకుని మిమ్ములను వంచించి కట్టుబట్టలతోడఁ గానల కంపుట నెఱుంగవో? వారణాశీపురంబున మిమ్ములను లాక్షామందిర మధ్యంబున నగ్నిజ్వాలలయందుఁ గాల్చుటైన స్మృతికిరాదో! వారొనరించిన యీ ఘోరకార్యములం దిది యెన్నవవంతు? సుక్షత్రియ వంశమున జననమంది మీకు న్యాయముగా రావలసిన రాజ్యముకొఱకై యుద్ధముఁ జేయుట ధర్మరహితమని నీకుఁ దోఁచెనా? బావా! పౌరుష శౌర్య సాహసంబులు రాజుల కుచితంబుగాని యిట్టి పిఱికితనము తగునే?

సీ॥ క్రీడామిషంబున ♦ గిఱుతించి కౌరవుల్
　　　　　　విషయంబులను మిమ్ముఁ ♦ ద్రోయునాఁడు
　　వారణాశిని జేర్చి ♦ వైరంబుఁ బేర్చి లా
　　　　　　క్షాగృహంబున మిమ్ముఁ ♦ గాల్చునాఁడు
　　మహితపాంచాలకు ♦ మారికానూన వ
　　　　　　స్త్రాపహారంబును ♦ సల్పునాఁడు
　　మాయజూదంబున ♦ మాయించి మీ సిరి
　　　　　　యడవుల కొంటిమై ♦ యంపునాఁడు

గీ॥ మీర లందిన బీరమే ♦ నీరుఁ జేరె
　　నగణితము లౌ ప్రతిజ్ఞ లెం ♦ దెగిరిపోయె
　　రాచబిడ్డవు భయమంద ♦ రణమునంద
　　ఫల్గునా! నవ్వెదరు! చాలు ♦ పౌరుషంబు

అర్జు: ఇది పిఱికితనము గాదు గతించిన వానిఁ ద్రవ్వి నాకుఁ బౌరుష మెక్కింపవలదు. బంధువుల నందఱి హతముఁ జేసికొని దిక్కులేక శ్మశానమువలె నున్న యీ రాజ్యమును మా తలఁ గట్టుకొని మేమేమి సుఖింతుము? క్షత్రియుఁడైన నేమి? సామాన్యుఁడైన నేమి! దైవదృష్టి కందఱును సమానులే! దయారహితుండగు

క్షత్రియుని సహితము దైవము క్షమింపఁడు. దయాహీనుఁడగు రాజు రాక్షససమానుఁడు. అట్టివాని శరీర మంత్యకాలమునఁ బురుగులుబడి కుళ్ళి దుర్గంధబంధురమై, చూడదిక్కు లేకఁ గాకులు మున్నగువాని కాహారము కావలసినదే. అంతకన్న దయారహితుఁడయ్యును శౌర్యహీనుఁ డుత్తమోత్తముఁడు.

కృష్ణు : అర్జునా! ఈ వాదము భ్రాంతిమూలము! ఊహాసహితము. అనుభవరహితము.

అర్జు : కృష్ణా! ఏమి!

కృష్ణు: దుష్టులకు నాశనములేనిచోఁ బ్రపంచము జరుగదు. నీవు శాంతించినను నీయన్న భీమసేనుఁడీ కౌరవసేనలను తనగదతో బాంధవులని కనికరింపక, అన్నలని వెనుఁదీయక, తమ్ములని దయఁదలంపక, ఫక్కున శిరములు బ్రద్దలు చేయకుండునా?

అర్జు : ఏల రణముచేయకుండును! అది యేటిఘనము? కిరాతకార్యము రాజధర్మమా! అదిగాక దుష్టనాశనమని పలికితివి. అందులకు మనము కర్తలమా? దుష్టులను సంహరింపఁ బరాత్పరుఁడు తగునుగాక! మన మస్త్రలమగుదుమా! అతఁడే వారి పాపంబులకుఁ బ్రతిక్రియఁ గావింపఁదగును.

కృష్ణు: సెబాస్! అర్జునా! సెబాస్. విజ్ఞానమూర్తివి. ఇంద్రనందనుఁడవు సామాన్యుఁడవా నీవు? నీవు పలికిన ధర్మోపదేశము సమంజసము. అందువలననే నీవు రణమొనర్పఁ దగుదువు. లెమ్ము. ఇదిగో బాణము—ఇదిగో తూణము—

క॥ లెమ్మా! శరజాలముఁ గై
కొమ్మా! రిపులం జయించి ♦ గురువిజయముఁ గై
కొమ్మా! కౌరవనాథుల
కొమ్మలమునను దొలంగఁ ♦ గుంఠితగతిమై.

అర్జు : మఱల నిదియేమి బావా!

కృష్ణు: మఱేమియును లేదు. దుష్టనాశనమునకు మనము కర్తలము గామంటివి! నిజమే! పరమేశ్వరుఁడు దుష్టుల కొనరప్పదలఁచిన శిక్షలకు మనము నిమిత్తమాత్రులము. అందు మన స్వయం శక్తి పీసమైనలేదు. నీవు నీ బంధువులను జంపున దేమి? నీ వెవ్వఁడవు? అద్వైతంబున జీవాత్మ పరమాత్మలకు భేదము లేదు. కాలశక్తియే భయంకర రూపముఁగొడ నీ కౌరవసేన నాహార మొనర్చుచున్నది. చూచుము భారత మహాసంహార మారణకాలశక్తిని.

(కన్నులు తుడువఁగా నర్జుననకుఁ గాలశక్తి కనఁబడును)

15 అనుబంధము. (తెర వాలును)

దృశ్యము ౨

ప్రదేశము :- యుద్ధభూమి.

(ప్రవేశము :-శరచాపధరుఁడై సేనలను బురిఁగొల్పుచు భీష్ముఁడు)

(16 అనుబంధము)

భీష్ము: ఓహో! సైనికులారా! చిరకాలమునకు మహాయుద్ధ మాసన్న మైనది. రారాజగు కౌరవేశ్వరుని యన్నముఁదిను మీరందఱు నిప్పుడాతని పక్షమై ప్రాణములర్పింప సిద్ధముఁగండు. వెఱవ వలదు. వెనుఁదీయవలదు. పాండవపక్షంబులను మీ ధైర్యంబున నెదుర్కొని ముందునకు రానీయక నిలుపవలయును. కురుకుల సేనాంభోనిధిని బడబాగ్నిగతి వెలుంగు మీ శౌర్యాగ్నిచే శత్రువుల భస్మంబొనర్పుఁడు. కాలరుద్రుఁ డెదుర్కొనినను గంపింపవలదు. మీ కేభయంబును లేదు. ఈ బాణంబులచేతనే మిమ్ము రక్షించి శాత్రవుల శిక్షించెద. ఈ భీష్ముఁడు వృద్ధుండని శంకింపఁబనిలేదు. ఈ వృద్ధుండు కురువృద్ధుండు గాని వ్యర్థుండు గాడు. పరశురాముని మున్ను భంగంబుఁ గావించినదీమునుసలి పీరుఁడేసుఁడీ! లెండు. సింహనాదములం జేయుఁడు ఆర్మ

సామ్రాజ్యసంరక్షణమునకై కంకణంబులు ధరింపుడు. కోలాహల పూరితంబుగా రణమున దూకుఁడు. జయ్ దుర్యోధన మహారాజునకు జయ్ !

(17 అనుబంధము)

(ప్రస్థానము)

దృశ్యము—3.

ప్రదేశము—యుద్ధభూమి.

(ప్రవేశము—కృష్ణార్జునులు)

అర్జు : (18 అనుబంధము).

చ. ముదుకఁడుగా డితండు రణ ♦ భూములఁ గేవలరుద్రమూర్తియై
పదమదమందఁ జేయు కల ♦ శాంబుధిఁ ద్రచ్చుచు మంగరంబనఁ
బదిదివసంబులయ్యె నొక ♦ పట్టున శాంతివహింపఁ డీతఁడే
బ్రదికిన నేఁడు, రేపుమన ♦ వారి జయంబు నభప్రసూనమే.

బావా ! కౌరవయుద్ధమారంభమై నేఁటికి పదిదినంబులయ్యెను. ఇసుకపాతరవ లెఁదరుఁగని సైన్యంబులతోడ వృద్ధుఁడగు గాంగేయుఁడు నదరుబెదరు లేక, చెక్కుచెదరక, శరీరమున నొక్క గాయమైనఁ గాకుండ మనశరములను దన చాతుర్యమునఁ దప్పించుకొనుచు మన కాయంబులు గాయంబులు సల్పుచున్నవాఁడే ! ఇందుల కేదిమార్గము? ఈ మహాత్ముని మనమెట్లు గెలువఁగలము ?

కృష్ణు: బావా ! ఏమిచేయుదుము ? రథికుండవగు నీ వెటులుంటివో కాని సారథినగు నాకీనాఁటి యుద్ధము గడచిన పదిదినంబులటుఁ గాక మిగుల దుర్భరముగాఁ గాన్పించుచున్నది. శాంతనవుఁడు నేఁడు మధ్యందిన మార్తాండునిగతి వెలుంగుచు బాలునికన్న నధికప్రతాపముం గనఁబఱచు చున్నవాఁడు. గోడపెట్టినట్లు బాణపరంపరలు కన్నులు గాన్పింపకుండఁ గప్పివేయు నిదిదారి, ఋధి తెన్నని నిర్ణయింప నలవిగాకయున్నది. శరీరమంతయు

రక్తముచే ప్రవాహమైనది. యుద్ధారంభమున నీ కోరిక ననుసరించి యాయుధముఁబట్టనని ప్రతినచేయుటచే శాంతింపవలసి వచ్చెఁగాని, కానిచో నీ భీష్ముని దురాగతంబునకుఁదునాతునకలు గావించియుండనే?

అర్జు : బావా! శాంతింపుము. నీవే చక్రంబుఁ దాల్చిననాఁడు పదునాలుగు లోకంబులు నిలువఁగలవే! విజయునికీర్తి నిలువఁబెట్టుట నీ యాశయముఁగాని నీవే చక్రంబు ధరించిన నీ నాటకములతో నిమిత్తమేమి?

కృష్ణు: అర్జునా! అట్లయిన నేనాగ్రహంబును దిగమ్రింగితిని. నీయిష్టము వచ్చినట్లు రణమొనర్పుము. ఇదే రథము తోలుచున్నాను.

అర్జు : బావా! అదికాదు. ఒక్కక్షణము రథము నిలుపుము.

కృష్ణు: నిలిపితిని. ఏమి?

అర్జు : నా యిష్టము వచ్చినట్లు నేను రణమొనరింప వలయునన్న నీ యాదేశమేమి? నీ యిష్టమువచ్చినట్లే రణమొనర్పఁ జేయుదు వనియే నమ్మియుంటిని. భీష్ముని మృతికి మార్గమేది?

కృష్ణు: అతని మృతికొక్కటియే మార్గమున్నది. పేడిమొగము చూడ నని భీష్మునకు వ్రతముగలదు. పేడియగు శిఖండిని మనయెదుట నిల్పి చాటుననుండి బాణములను వదలినచో నాతఁడు సూక్ష్మముగా జయింపబడును.

అర్జు : అట్లయిన శిఖండి యెక్కడ?

శిఖ : (ప్రవేశించి) పార్థా! ఏమి సెలవు?

అర్జు : శిఖండీ! భీష్ముఁ డిందు రాకమున్నే నీ కొకటి చెప్పవలయును- మేము తలంచినప్పుడు వచ్చి భీష్మునియెదుట నిలువవలయును.

శిఖ : భాగ్యము. (ప్రస్థానము)

భీష్మ: (ప్రవేశించి) (19 అనుబంధము)

అర్జునా! నిలువుము. కృష్ణా! కాచుకొమ్ము. కౌరవసేనాధిపతియగు నీ భీష్ముఁడు జీవించియుండ మీరు యుద్ధమున నధిక

దూర మరుగఁజాలరు. వీనిని గెలిచిన పిదప సైనికులను వెదకి
కొండు. మీ పడుచుదనము నా ముసలితనమును నేఁడు వెల్లడి
యగును.

అర్జు : పితామహా! తమ యాశీర్వచనంబుఁ గలదేని యీ కురుసేన
లెక్క యేమి? మున్నొకమారు శంకరునే యెదిరించిన బాహు
బలుండనని తమ రెఱుంగరే మహాత్మా!

భీష్మ: ఓరికుఱ్ఱా! అందుకా యింతగర్వించెదవు? భక్తసులభుఁడై
నీకు కీర్తి నొసంగఁదలఁచి పోరాడిన శంకరుని నాతో సమా
నముఁ జేయుచుంటివా? ప్రళయకాలఫాలాక్షులు వేవురైన నీ
భీష్మునితో నేఁడు సమానులు గారని తలంపుము.

అర్జు : దానికేమి! బలాబలంబులు, జయాపజయంబులు, వేళా విశే
షంబులు గాని, మానవనిర్ణేతములు గావు. దేవా! తమరు
పూజ్యులు, కులవృద్ధులు, పితామహులు, మాననీయులగు
మీపై బాలుండనగు నేను బాణంబులను విడుచుట యుక్తము
గాదు. కావున నన్ను క్షమించి తొలంగిపొండు. మీచే నేను
వధింపఁబడినను మీకే యప్రతిష్ఠ! నాచే మీరు కూలినను
మీకే యప్రతిష్ఠ!

భీష్మ: పార్థా! అప్రతిష్ఠయేమి? బాలుండవైనంతనే సమయుద్ధమున
కర్హుఁడవు కాకపోవుదువా! శౌర్యము ప్రధానముగాని వయ
స్సుతో నేమి? శంకరుని గెల్చిన నిన్ను గెల్చినను నాకే ప్రతిష్ఠ.
నాయంతవాఁడవగు పౌత్రుఁడవు నీచేఁగూలినను నాకే ప్రతిష్ఠ,
ఏమందువేని అర్జునా! కాలము చెల్లినవారందఱికొఱకు భారత
యుద్ధమొక కారణముగా సంఘటిల్లెను. ఎట్లును మాకందఱకును
మరణము తప్పదు. ఏ పిఱికిపందచేతనో పడుటకన్న భారత
యుద్ధ నాయకుఁడవగు నీచే మరణించుటకు నాకు ధన్యతగాదా?
రమ్ము. యుద్ధమునకు రమ్ము. నాకు రణభిక్షనిమ్ము.

అర్జు : అట్లయిన నా యత్నము లేదు. మహాత్మా! ఇదిగో నేను ధనుర్బాణములను ధరించితిని.

భీష్మ: నేను సంసిద్ధుఁడనైతిని. కృష్ణా! శత్రుపక్షమునందున్న నీకు నమస్కరింపఁ గూడమికి మన్నింపుము. రణమున కనుజ్ఞనిమ్ము.

కృష్ణు: పితామహా! కానిమ్ము. సంశయ మేమి?

(భీష్మార్జునులు యుద్ధము చేయుచుండ)

కృష్ణు: అర్జునా! అర్జునా! శరపరంపరలచే దిశలు తెలియుటలేదు. రథాశ్వములు చీకాకుపడుచున్నవి. నా శరీర మెల్ల రక్తసంయుక్తమైనది. భరింపఁజాల. భరింపఁజాల. బావా! ఇఁక శాంతింపలేను! పదిదినంబులు యుద్ధ మొనరించియు నలయక చుఱుకు చుఱుకున బాణంబులు వదలి చీకాకుచేయు నీ ముసలిని నా చక్రంబుచే హతమార్చెద. ఇఁక ధర్మము లేదు, అధర్మము లేదు. ప్రతిజ్ఞలేదు-గితిజ్ఞ లేదు.

(అనుబంధము 20) (చక్రముఁగైకొని లేచును.)

అర్జు : (అనుబంధము 21)

శా. బావా! పావనభంగి సల్పెదగు శం ♦ భ గోధసంహారముల్
నీవారి న్మముఁ బాండునందనసుతా ♦ నీ కంబుఁగాపాడి మా
ప్రావీణ్యంబు యశంబు ధాత్రి వికసిం ♦ పంగో రదే నాఁగుమా
యీవే చక్రముఁదాల్ప నిల్వఁగలనే ♦ యీ రేడులోకంబులుల్

బావా! శాంతింపుము. లోకంబులను బాలింప నవతరించిన నీవు మారణం బొనరింప సిద్ధమైన లోకాంతము ఘటిల్లదే. మహానుభావా! సంగ్రామారంభమున నిన్ను సారథిగా, నేను రథికునిగా వేడుకొనుటందులకుఁ గాదే! బావా! నీవే చక్రహస్తుండవైన పాండవుల శౌర్యంబు లోకంబున కెఱుంగనగునే? ఒక్క కౌరవనాశనం బననేమి? సర్వనాశనంబుఁ గావింపనేఁటివే? సర్వలోక నాయకా!

కృష్ణు: అర్జునా! నన్ను వదలుము – వారింపవలదు. ఇంక శాంతంబు వహింపలేను. నా శరీర మీ వృద్ధుని తీవ్రసాయకములచేఁ జిల్లులు వడినది. గాయంబులనుండి రక్తప్రవాహంబు గారుచున్నది. మహాబాహుబలశాలియగు నీ వృద్ధుని వధింప మీ తరంబుగాదు. ఇదిగో? శత్రుకంఠ విదారణ దారుణంబగు చక్రము, ఇదిగో! మహాధనుర్ధరుండగు భీష్మునికంఠము వధింపక మానను.

అర్జు: బావా! శాంతింపుము.

భీష్మ: పార్థా! రానిమ్ము, ఆ పరమాత్ముని నాపై కెత్తి రానిమ్ము. నా కంఠము లుంఠనముఁ గావింపనిమ్ము. హేకృష్ణా! లోకైక నాథా! దీనదయాపరా! దాసజనావనకృపాకరా! దుష్టదానవ సంహారా! చక్రధరా! వల్లెవాటుగాఁ బైనఁబడ్డయుత్తరీయము పవనసంచలితంబయి జీరాడుచుండ, శింశుమార చక్రంబు తెరంగునఁ జక్రంబు కరంబలంకరింప, శ్రీవత్స కౌస్తుభ చిహ్నంబు సుందరశరీరంబునకు వింతచందంబు నొసంగ, గోపీచందన సందీపిత ఫాలభాగంబు ముద్దులుమూటఁగట్టుచుండ, శిరోపరిభాగంబున వైరముడిపై సుందరముగా నిడ్డ బర్హి బర్హంబు లల్లలనాడుచుండ, వక్షోభాగంబు నాలింగనముఁ గావించి ధన్యతనందిన వనమాల యిరువంకల నందముగాఁ గ్రందుకొనియుండఁ గోమలశ్యామలమైన జగన్మోహన వదనంబునఁ గ్రోధవశమునఁ గల్గిన యీ షద్రక్తకాంతి యలముకొన-నారాయణా! నన్ను సంహరింప రమ్ము-నీ చక్రాయుధ జ్వాలల కాహుతియగు నా భాగ్య మేమందును? కృష్ణా! కృష్ణా! కృష్ణా! రమ్ము.

సీ. అంభోధిరశ్యామ ♦ గంభీరకాంతి ది
శాంతరంబులకుఁ దే ♦ జంబు నొసఁగ
వనమాల లిరువంక ♦ ఘనవక్షదేశమం
దతిలోకమోహనా ♦ కృతి నొసంగఁ
బదునాల్గుజగముల ♦ భరియించు చిరుబొజ్జ
యదరుపాటున సుంత ♦ కదలియాడ
సంభ్రమంబున భుజ ♦ స్కంధంబునందుండి
యందమూ నుత్తరీ ♦ యంబుజార
గీ. క్రీడినదలంచి చక్రంబుఁ ♦ గేలఁదాల్చి
నేఁడు గాంగేయు వధియించి ♦ నిన్నుఁగాతు
ననుచు నభిముఖుఁడైవచ్చు ♦ నప్రమేయ
దివ్యతేజఃప్రపుంజంబు ♦ దక్కునాకు.

[అనుబంధము 22.]

కృష్ణు: (శాంతించి) దేవవ్రతా! భక్తిపాశములచే నను బంధించితివి. ఇఁక నిన్ను నేను సంహారింపలేను. చక్రంబు నుపసంహారించితిని. (అప) పార్థా! ఈతని మృతి శిఖండిచేఁగాని కాఁజాలదు. అట్లుఁ గావింతము.

అరు: శిఖండి భీష్మమారణంబునకుఁ బ్రత్యక్షమగుఁగాక!


[శిఖండి ప్రత్యక్షమగును.]

భీష్మ: హా! హా! శిఖండీ! మోసగింపఁబడితిని. భంగపడితిని. రణసన్న్యాసం బొనరింపవలసె. (శరచాపంబులు పారవైచి కన్నులుమూసికొని) ఈ పేడిమొగంబుఁ జూడను. కృష్ణా!

దీనదయాపరా! కాలము వక్రత్వముఁ దాల్చినది. విధి విరోధంబు వహించినది. భీష్మున కస్తమయ సమయంబు ప్రాప్తించినది. కరంబుల జోడించితిని. రక్షింపుము. అర్జునా! బాణంబులను వదలుము. ఇఁక భూపతనమేగతి. నన్ను బాణ శయ్యపైఁ బడవేయుము. భూమిపైఁ బడనీయకుము. కృష్ణా! నీ దయారసముచేఁ బాండవులే జయింతురు. కౌరవులే యోడుదురు. ఇదియంతయు నొక విచిత్రనాటకము. ఇంతను మమ్ముఁ బాత్రలం జేసితివి. ఇప్పుడు నాకు విశ్రాంతి కలిగె. కాని యిది పుణ్యసమయంబుగాదు. ప్రాణంబులను బాయఁ జాలను. నాకు స్వేచ్ఛామరణంబుఁ గలుగునట్లు నా జనకు నను గ్రహంబున వరంబుగలదు. ఉత్తరాయణ పుణ్యకాల పర్యంత మీ యంపశయ్యపైనుండి తదనంతరంబు జీవంబులుఁ బాసెదను. కృష్ణా! నమస్కారము. పార్థా! ఇంక నీ ఇష్టము.

[అర్జునుడు బాణములను విడువఁగా భీష్ముం డంపశయ్యపైఁ బడును]

ఇది ద్వితీయాంకము.



పీఠాభిషేక్తు

తృతీయాంకము

దృశ్యం ౧.

[దుర్యోధన - కర్ణ - అశ్వత్థామ - దుశ్శాసనులు ప్రవేశింతురు]

[అందఱు అనుబంధము 23.]

దుర్యో: మిత్రమా ! కర్ణా ! మహావీరుండును, కులవృద్ధుండునునగు మన పితామహుండు భీష్ముండు దంపశరతల్పగతుండైన యనంతరమున ద్రోణాచార్యుని సేనానాయకునిఁ గావించితిమిగదా ? నేఁడింకను నా మహాత్ముని దర్శనముగాలేదు. నా మనసంబంతయు నాందోళనాయత్తమై యున్నది.

కర్ణ : మిత్రమా ! దుర్యోధనా ! ఏమిభ్రాంతి ? కులవృద్ధులఁ గుల వృద్ధులని నమ్ముకొనినందువలననే మన గొంతుకలను మొదలంటఁ దెగఁగోయుచుండిరి. భీష్మునిపై నాసలన్నింటిని నిలిపి యుంటివి. వేయిపూజ లొకఅంకుతో నంతమందునట్లు పది దినము లఖండ సంగ్రామ మాచరించిన మహావీరుఁడేమి ! ఒక పేడినిఁగాంచి—గడగడ వణఁకి శరచాపసన్న్యాసం బొనరించు టేమి ? అజ్ఞానకృత్యము. చిరకాలము ద్రాచుఁబాముఁ బాలుఁబోసి పెంచిన విధంబునఁ బెంచినందులకుఁ దుదకుఁ బాండవ పక్షపాతంబున గార్యనాశనంబుఁ గావించిన భీష్మ ద్రోణాదుల సహాయం బపేక్షించిన నిన్ననవలెఁగాని యెవ్వరి ననిన లాభమేమి ?

మ. వ్యామోహంబునఁ బాండురాట్సుల న ♦ త్యంతంబుఁ గీర్తించుచున్
సిమం బింతయు లేక నాత్మకులహా ♦ నిన్ సుంతనూహింపకే
ప్రాముఖ్యత్వమునిచ్చి యాశపడు ని ♦ న్బాటింపఁడా భీష్ముఁడే
స్వామిద్రోహము సేయఁడే నతనిఁగూ ♦ ల్పన్ శక్యమే క్రీడికిన్.

అశ్వ : అంగరాజ్యలాభ గర్వోన్మత్త వ్యర్థప్రలాపా ! కర్ణా ! నోటికి వచ్చినంత వదరిన లాభములేదు. ఒక్కమారు కన్నులు తెరచి వెనుకముందు లరసికొమ్ము. కౌరవేశ్వరునకు హితంబుఁ గావించువాఁ డెవ్వఁడో తెలియఁజాలక కులమర్యాదల ననుస రించి, వందిపాఠంబులతో రారాజు మెప్పువడసి పెద్దల దూషిం చిన లాభములేదు. గురుధిక్కారంబు నరకకారణము—
ఈ ప్రలాపములకు నిన్ను రారాజు మొగంబుఁజూచి యూరకుండవలసివచ్చెఁగాని—

కర్ణ : కానిచో—నేమిచేయ నెంచితివి ? కడుపునిండ బ్రాహ్మణార్థము చేయనెంచితివా ? గారెలు, పరమాన్నముమెక్కి జన్నిదముఁ దెన్పఁదలచితివా ! ఛీ ! బ్రాహ్మణాధమా ! యుద్ధసమయము ననియు, నంతఃకలహములు కూడదనియు నిన్ను సైరింప వలసివచ్చెఁగాని——

అశ్వ : ఆ ! ఏమంటివిరా నీచవంశజాతా ! దయతో నన్నుఁ జంపక వదలెద నంటివా ? వింటిరా ! సభాసదులారా ! ఈ తుచ్ఛుని గర్వాలాపములను ? కురుకుల క్షేమంకరులై, సకలలోక పూజితులై, మాన్యులైన భీష్మాదులను విశ్వాసఘాతుకులని యీ తులువ నిందించినది చాలక—నన్నుఁ బగిసటి కేద నను చున్నవాఁడు. ఓ దుర్యోధనా ! అంగరాజ్యంబిచ్చి యీ చండాలుని నెత్తిపై కెక్కించుకొన్నందువలనఁ గలిగినఫల మనుభవింపుము. వీనిని నీవు దండింపుము—లేనిచో వీనిని మేము సదమదింతుము.

[అనుబంధము 24.]

దుర్యో: గురుపుత్రా ! శాంతింపుము. మిత్రమా ! ఆగ్రహమేల ?

కర్ణ : ఓరీ ద్రోణనందనా ! తిన్న యింటివాసంబులు లెక్కించినట్లు పాండవపక్షపాతంబున సుయోధనున కపకారంబొనరించినది చాలక మొగముపెట్టుకొని చుంటివఁటరా ! రారాజువద్ద

కెందులకు ? రమ్ము. శౌర్యముఁగలవాఁడవేని రమ్ము. నన్ను వధింపరమ్ము—బ్రాహ్మణనామంబింక నీమరణంబున కాటంకముఁ గాఁజాలదు—రమ్ము.

అశ్వ : ఛీ! ప్రేలరీ! అట్లయిన నిన్నిఁక మన్నింపను. రమ్ము.

[అనుబంధము 25.]

శా. బ్రహ్మత్వంబునఁ గైతవాకృతిని సం ♦ పాదించి శాస్త్రంబు సు
బ్రహ్మణ్యుండగు నాకుతండ్రికడ న ♦ భ్యాసంబుఁ గావించియుం
బ్రహ్మణ్యప్రతిభాషలక్షలుపు పా ♦ పంబెట్లు గావింతువో
బ్రహ్మద్వేషము దారుణానలమురా ♦ పాపాత్మ ! నీ బోంట్లకున్.

దుర్యో: మిత్రులారా ! శాంతింపుఁడు. ఇది యుద్ధసమయము—మన మందర మొకటియై శత్రుహస్తగతముఁగాకుండ—స్వారాజ్యమును సంరక్షించుకొనవలసిన సమయము. ఇట్టివేళ మీ రొకరిమాట యొకరికి సరిపడక విరోధింపఁదగునా ! శాంతింపుఁడు.

(కూర్చుండఁబెట్టును.)

(తెరలో) సేనాధినాథ ద్రోణాచార్యునకు జయ—

దుర్యో: గురువరు లిదె వచ్చుచున్నారు. మీరింక విరోధంబు వహింపవలదు.

ద్రోణు: (ప్ర) సుయోధనా ! పరాకు ! యోధులారా ! మీరందరును సిద్ధముగా నుంటిరిగదా ? (పరికించి) ఓహో ! ఏమిది ? మన కర్ణుని మొగము ధుమధుమ లాడుచున్నది. (అశ్వత్థామను జూచి) సరిసరి ఇంకనేమి ? మాయబ్బాయియును, నంగరాజును రారాజునకేవో వినోదముఁ గల్పించుచునే యున్నవారు.

దుర్యో: గురువర్యా ! ఈ వినోదములు మన కొకనాటితోఁ దీరునవి కావు. దానికేమి ? తమ జాప్యమునకేదియో కారణముండు నని విన నాసతో నున్నారము.

ద్రోణు: అట్లయినఁ దెలియజేయుచున్నాము. కృష్ణార్జునులు సుశర్మ పంపున సంశప్తకులను వధింప మహారణంబున కరిగియున్నవారు.

పద్మవ్యూహము భేదించు మార్గము పాండవసేనలో నొక్క-పార్థునకుఁదప్ప మఱియొకరికిఁ దెలియదు. ఈ జాడ నెఱింగి నేను పద్మవ్యూహంబు నొకదానిని నిర్మించితిని. దానిని భేదించువారు లేనందున పాండవసైన్యమెల్ల నేఁటితో హత మయి తీఱును. ప్రొద్దుగ్రుంకకమున్నె ధర్మజునిఁ బ్రాణములతోఁ గట్టితెచ్చి నీ పాదంబులకడ నుంచెదను. ఇదియే నా ప్రతిజ్ఞ. పద్మవ్యూహంబున నాలుగు మూలల దుశ్శాసన కర్ణాశ్వత్థామలును నీవును నుండుఁడు. నేను మధ్యంబున నుండెదను. నీ యధికార చిహ్నమునకై వచ్చితిని. ఇంక మన మేమాత్రమును జాగుసేయఁ జనదు.

సీ. దళసమూహము పద్మ ♦ దళ సమూహంబుగ
నిఖిలదిక్కులయందు ♦ నిలచియుంచు
ధీరులైనట్టి మ ♦ హారథుల్ వ్యూహాంచ
తుష్కస్థలంబులం ♦ దున వసింప
సూచీముఖంబైనఁ ♦ జొరనిరీతిని మహ
శారపతాకిను ♦ ల్బలసియుండ
దారుణసింహ నా ♦ దార్భటుల్గలంచి బ్ర
హ్మాండకటాహంబు ♦ నావరింప

గీ. నచలదీప్తి నేఁడు ♦ రచియింతుఁ దమ్మిమొ
గ్గరము దానిఁ జీల్పఁ ♦ గలుగ రెవరు
కౌరవేశ పాద ♦ కమలంబులను ధర్మ
సుతుని నుంతు రిపుల ♦ ధృతితొలంగ.

దుర్యో: గురువర్యా! మా కత్యంత హితము పాటించి పద్మవ్యూహ నిర్మాణ మొనరించిన మీ శక్తి నిరుపమానము. మీరు విజయులై వత్తురుగాక! ఈ పుష్పమాలయే యధికార చిహ్నము. (పూలదండ వేయును.)

అందరు : జయ—సేనాధినాధ ద్రోణాచార్యునకు జయ—
[అనుబంధము 26.]
[మెల్లగా తెర వ్రాలును]

దృశ్యం ౨.

ప్రదేశము — సేనానివేశము.

[ద్రోణుఁడు - అశ్వత్థామ ప్రవేశము]

అశ్వ : నాయనగారూ! మీరు వినలేదుగాని వాఁడు భీష్మాదులను, మిమ్ముల నాడినమాటలు కోట్లసంఖ్యకు దాటినవి. అధమ సూతపుత్రుఁడే! వానికింత యాగడమా! రారాజు వారించుట చేత నోరుమూసికొని యుండవలసి వచ్చెఁగాని—వాని నీ కర వాలంబున నిరుఖండంబు లొనర్పకుందునా! పూజ్యులమని; బ్రాహ్మణులమని వానికింతైనఁ దోఁపకపోయెఁగా! తండ్రీ! నాకింకను శాంతము శాంతమని యేల బోధించి వేధించెదరు?

ద్రోణు: నాయనా! పడుచుఁదనంపు మాట లేల? ఈ నీ పలుకులను రారాజువినినఁ దనమనంబున నెంతయేని వంతనొందక మానఁడు.

అశ్వ : తండ్రీ! అటులయిన నీ బ్రహ్మద్వేషిని క్షమింపుమందురా?

ద్రోణు: ఛీ! ఛీ! నీవాదము నాకుఁ బరమాసహ్యముగనున్నది. నింద్య మగు నీ బ్రాహ్మణా బ్రాహ్మణవైరమును కర్ణాశ్వత్థామలు భారతయుద్ధ కాలమునం బ్రతిష్ఠించిరను దుష్కీర్తి నందఁ దలఁచితిరా! పనివచ్చినప్పుడు సర్వవిషయంబులను మఱచి పదుగురొక్కటియయి పనిచేయనలయునుగాని, బుద్ధిహీనుల వలెఁ గక్షలు పెంచుకొని కార్యవినాశమున కొడిఁగట్టుదురా? బ్రాహ్మణా బ్రాహ్మణవైర మెప్పుడును తగనిది. సమందు వేని—బ్రాహ్మణత్వము జన్మమువలనఁగాక బుద్ధివలనఁ గలుగును. దీని నెఱింగినవాడే ప్రాజ్ఞుడు. బుద్ధిహీనుఁడగు బ్రాహ్మణుఁడు చండాలతుల్యుఁడు. బుద్ధిమంతుఁడగు చండా లుఁడే బ్రాహ్మణుఁడు.

అశ్వ: తండ్రీ! అట్లయిన దురాత్ముఁడగు కర్ణుఁడు మనలను తృణప్రాయముగఁ జూచుచుండుట చక్రవర్తికడఁ దనకుఁగల చనవునుబట్టియే కదా! ఇందుల కాతని నేమైన రారాజు నుందలింపఁగలిగెనా?

ద్రోణు: కుమారా! ఇట్టే కొందఱు దుష్టులు రాజాన్నముఁదిని జీవించుచు సజ్జనుండగు రాజుహృదయమును గ్రహింపఁ జాలక తాను సేవకుఁడగుట మఱచి యీతఁడు నట్టి శలివితక్కువ పెద్దమనుష్యుడనియుఁ దమ సహాయముననే రాజ్యతంత్రము జరుగుచున్నదనియుఁ దాముమానిన, రాజు బ్రతుకలేఁడనియు, నోడలుమఱచి తన సాటివారందఱిపై సవారి యగుచుందురు. కొందఱి లేరు. అట్లు గర్వపడిన వానికిని, వాని శృంగభంగముఁ జేయుటి ప్రభువునకును గొంతుకోత తప్పదు. నీవింక శాంతింపుము.

అశ్వ: తండ్రీ! ఎంత శాంతింపఁ దలఁచినను నామనం బూరట నందదు. ఫల్గుణ్యుఁడగు భీష్ముఁడు చచ్చువరకు బాణంబు ముట్టనని పలికి భీష్ముని చావుఁజూచిన యీపాపాత్ముఁడగు కర్ణుఁడు చచ్చువఱకును నేను శస్త్రంబును ముట్టను. (కన్నీరు కారనైచును.) మీ బలనంతంబున నింతవరకువచ్చితి. ఇంక నాకు సెలవిండు. పద్మవ్యూహమున మీకు జయమగుఁగాక!

(ప్రస్థానము.)

ద్రోణు: ఆహా! పడుచుఁదన మెంత ప్రాజ్ఞునకైనను నోడలుఁ జెఱియు నీయదుగదా! కుఱ్ఱవాని నెంత మందలించినను వినక నిరుపమానమైన తనశౌర్యమునెల్ల నిరుపయోగం బొనరించెను. బాల్యంబునఁ దానోనరించు నజ్ఞకార్యములన్నిఁటి రారాజు నా మొగంబుఁ గాంచిగదా క్షమించుచుండును?

[తె ర లో]

సేనాధిపా! ద్రోణాచార్య! రారాజుగారు తమరాకకు వేచియున్నారు.

ద్రోణు:(విని) ఓహో ! ఆలోచనలోఁబడి ప్రస్తుతంబు విస్మరించితి. సేవకా ! ఇదేవచ్చితి. (ప్రస్థానము.)

దృశ్యము—3; ప్రదేశము:—సేనానివేశము.

(ప్రవేశము;—నారదుఁడు, కృష్ణుఁడు)

కృష్ణు: నారదమునీంద్రా ! నమస్కారము.

నారద : చిరాయురస్తు. శ్రీకృష్ణా ! తలఁచినంతనే దాసులకు దర్శన మిచ్చు నీవాత్సల్య మసమానముగదా!

కృష్ణు: నారదమునీంద్రా ! యుద్ధవేషముఁదీసివేసి యొక్కింత విశ్ర మింతమని చల్లగాలిలోఁ దిరుగుచుంటిని. ఇంతలో మెల్లనిపిల్ల గాలులతోఁగలసి మీ మహతీస్వనంబు నా వీనుల కానంద ప్రదముగా సోఁకినది. ఆహా ! నారదా ! మీగానంబున నేమిచిత్రముఁగలదో కాని మనస్సునంతను పెల్లగించి, యిను మును సూదంటురాయి లాగినట్లు లాగివైచునుగదా !

నారద : కృష్ణా ! నీవు గానలోలుఁడనగుదువు గాని నా పాటలలోనేమి రుచి యున్నది ? దానికేమిగాని శరచాపసన్యాసం బొనర్చిన పార్థునకు గీతల నుపదేశించి యుద్ధమునకు లాగితివి ? నీశక్తికి ముల్లోకంబు లబ్బురపడుచున్నవి. నేటివిశేషములేమి ?

కృష్ణు: ఏమున్నవి ? కౌరవబలంబులుచల్లాఱినవి. భీష్ముని చావున కేడ్చుచుఁ గౌరవు లెన్నఁడోచచ్చినట్లు మూలల నొదిగిరి—

నారద : కృష్ణా ! నన్నెంతని మోసపుచ్చెదవు ? నేనింతకుముందేకదా కౌరవస్కంధాగారము నుండి వచ్చుచుంటిని.

కృష్ణు: అయిన నేమైనది ?

నారద : కౌరవసేనలు మూలల నేడ్చుచున్నవా ?

కృ : మఱేమి చేయుచున్నవి ?

నారద : ద్రోణుఁడు పద్మవ్యూహంబుఁబన్నఁగా—

కృ : (నారదుని నోరుమూసి) నారదా ! నారదా ! కొంపఁదీసితివి గదా ! ఈవార్త నీకుఁదెలిసెనా ?

నార : కృష్ణా ! నానోరేల మూసెదవు ? నాకుఁదెలిసిననేమి ?

కృ : వలదు. పద్మవ్యూహవార్త నెత్తకుము. ఎవ్వరికి తెలుపవలదు. అందు ముఖ్యముగ పార్థునందు వినరాదు.

నార : ఏమి ?

కృ : ఏమోనన్ను నీ వడుగకుము. వలదంటిని వినుము.

నార : కృష్ణా! బాగుబాగు! ఇది చిత్రముగా నున్నదిగదా. రణవార్తలు భారతయుద్ధనాయకుని చెవి బడఁగూడదనినా ?

కృ : నారదా! నామాటలఁ బరిహాసములుగాఁగట్టి యల్లరిచేయకు. నా పన్నుగడ యంతయుఁబాడగును

నార : ఇందు నీ పన్నుగడ యేమి ? పాండవులు పరాజయమందుట నీయభిలాషయా ?

కృ : కాదు. నీ వింక పద్మవ్యూహము మాట నెత్తవలదు.

నార : చిత్రముగదా యిది కృష్ణా ! నల్లవాఁడవు-ఇందేదియోరహస్య తంత్రముం బన్నియుందువు. చెప్పవా ?

కృ : నారదా ! నీనోటనూవుగిందనానదుగదా ! ఇది దేవరహస్యము.

నార : దేవరహస్యము దేవముని వినఁగూడదా ?

కృ : కూడదు. నన్నడుగకుము. పోయినచ్చెదను.

నార : ముకుందా ! నిలువుము.

కృ : వలదు. నారదా ! నేఁబోవలయు. (కొంచెమునడచును)

నార : నిన్ను గానముచేఁగట్టివేయలేనా ?

సారంగ—దృపద్.

యశోదనంద ! ఆనందకర ! యశోపేత మోక్షదాత ॥య॥
పరమపద విలాసవేష ! పద్మబహ్మ పురుషోత్తమ
సురుచిరాంగ శుభాకార ! సురాధీశ సుమనవినుత ॥య॥

కృ : నారదా! కొంటెతనమునా నీకుఁ బెట్టినదిపేరుగదా? నా హృదయ మెఱింగి గానముచే నన్నుఁ గావించుకొంటివి. ఈ దేవ రహస్యము నీకొక్కనికే నెఱుంగునుగాని మఱియెవరికిఁ జెప్పవుగదా?

నార : జగదీశ్వరా! నీయానతియైన విడవ నోరు మెదల్తునా ?

కృ : సరే వినుము. ద్రోణుఁడు పద్మవ్యూహముఁ బన్నినవార్తను నే నెఱుంగుదును. అయినను పార్థుని నేదోమిషచే నటనుండి దప్పింపక తప్పదు.

నార : కృష్ణా ! ఇదేమిచిత్రము ! పద్మవ్యూహభేదనంబొక పార్థుఁడు తప్ప నెవ్వ రెఱుంగరే ! అతని నేల గొంపోదువు ?

కృ : అదియే విశేషము. పార్థనందనుఁడగు నభిమన్యునకుసయితము భేదించుట తెలియును. వెలువడుట తెలియదు. ఆతడు పద్మ వ్యూహంబునఁ జిక్కుటకువీలుఁగల్గింపవలయు.

నార : వెలువడు టెఱుంగనివాఁడు మృతినందుఁ గాని జీవించునా ?

కృ : నారదా ! అదియే నా యభిమతము.

నార : హరి హరీ ! శిశుమరణమే నీ యభిమతమా ? కృష్ణా ! అభి మన్యుఁడు నీకేమికీడు చేసె ? కన్నులు తెరువనిబాలుడే !

కృ : నారదా ! నేను వచింపననలేదా ! ఎందుల కీ యాందోళన !

నార : ఆందోళన మేమియును లేదు. ఇందేదియో మహారహస్య ముండును. దానిని సయితము వచింపుము, పోయెదను.

కృ : భూభారనివారణార్థము నేనుజనించితిని. భూభారము వాయుట కీదుష్టసేనలెల్ల నశింపవలయును. పార్థుఁడు వేదాంతియై వెను కంజ వేయుచున్నాఁడు. వానికి గణోత్సాహముఁ గల్పించు టకుఁ బుత్రశోకముఁగూర్చి రోష మెక్కించుటకన్న నాకు వేఱుమార్గము లేదు.

నార : కృష్ణా! మేనల్లుని జంపింపఁదలచిన నీహృదయమేమోయెఱుంగ

కృ : నారదా ! ఎంత వెఱ్ఱివాఁడవు ? సర్వక్రియాశక్తిస్వరూపుండగు నాకు బంధువుఁడెవ్వఁడు ? లయబ్రహ్మంబు నేను గానే ! నీ వెఱ్ఱిసందేహములు వదలుము.

నారద : మాధవ! అట్లయిన ... ...(తెరలో)
బావా! కేశవా ! సంశప్తక యుద్ధమున కింక బయలుదేరవేల ?

కృ : నారదా ! అర్జునుండు వచ్చుచున్నాఁడు. నీవు వేగమేకదలవలయు. నీవు తొలుతనే నారదుఁడవు. పద్మవ్యూహవార్తయే నిముసమాత్రని చెవినివేతువో ! పొమ్ము.

నారద : అయ్యయ్యో ! నీపై నొక్క భక్తిగీతముఁబాడి—

కృ : ఏమియు వలదు. నీవు తొలుత కదలుము.

నారద : ఒక్క గీతమే !

కృ : నారదా ! ఏమి యవిధేయత ? కదలెదవా లేదా ?

నారద . భాగ్యము. (ప్రస్థానము)

(అర్జునుఁడు ప్రవేశము)

అర్జు : బావా ! బాలునకు నేఁడు గాయము కొంచెము తిన్నగానున్నది. రణమునఁ గోలాహలమేమియును లేనట్లున్నది. బాబు స్వస్థుండగులోపలనే మనము సంశప్తకులపై నెగుగుదమంటివి కదా - రావేమి ? జాల మేమైనఁగలదా ?

. కృ : ఏమియును లేదు.

అర్జు : మఱికదలవేమి ? (ఇద్దఱు ప్రస్థానము)

దృశ్యము -౮

(ప్రవేశము:—శయ్యపై నభిమన్యుఁడు ఉత్తర)

ఉత్తర: (అనుబంధము 27)

నాథా ! శరీరమునఁగొంచెము స్వస్థతగానున్నదిగాదా ! కుడి చేతిమీఁదివ్రణము కొంచెము రేగినటులున్నది. మఱిరెండు

దినములవఱకును మీరు యుద్ధమున కరుగరాదని వైద్యులు చెప్పుచున్నారు.

అభి : వెఱ్ఱిదానా ! గృహదాహక మగుచున్నప్పుడు కోమలులతో సరసములాడుచు మైమఱచి యుండఁదగునా ? ప్రాణావసాన సమయమున ప్రణయ కలహములలో మునుఁగఁదగునా? వైద్యు లకేమి ? కురుపాండవుల మహాసంగ్రామ మెట్లయిన వైద్యుల కేమి కావలయును ? వైరాగ్నిరవుల్కొని మండుచుండఁగా వైద్యశాస్త్రము లాచరణమునకు రాఁదగునా ? ఈ శరీరమును ప్రాణమునకన్న నధికముగఁ గాపాడుకొనుచు, నాఁడు దానికన్న హేయముగ నూరుచుండుటశూరలక్షమా దేవీ ! ప్రాణావసా నముదనుక శరీరము చిల్లులుపడిపోయి ప్రాణము కంఠగత మైనను సంగ్రామమునువీడక రణశయనమలంకరించినవాఁడే శూరుఁడు.

మ. అరిసంఘంబులచే స్వరాజ్యసకలం ♦ బన్యాయమహానష్టి డా
సురకాద్యోద్ధతిఁజేర్చి సాధ్వులను నీ ♦ చు ల్బట్టి బాధించుచోఁ
బరమోత్కృష్టతరస్వధర్మము నొన ♦ ర్పం బోలునేగాని యీ
కరిణిన్ వ్యాధులునాధులంచుఁబలుకం ♦ గా నొప్పునేమూఢశన్

ఉత్త : నాధా ! సంశప్తకుల జయింపనేగిన మీ తండ్రిగారు మఱలి వచ్చునంతవఱకైన మీరు సంగ్రామగతులు కావలదు.

అభి : ఇందులకే ఆడువారు కడు పిఱికివారని చెప్పుదురు. నాపై వాత్సల్యమున నట్లు పలుకుదువేగాని తండ్రిగారుమఱలి వచ్చులోపల నింట నేదైనదారుణము జరిగిన నేనున్నందుల కాయన నన్నుఁగాంచియానందింతురనుకొంటివా ? రాఁగూడని యుద్ధము రానేవచ్చినది. ఇట్టిసంశయకాలములయందేనిము సమునకానిముసము ప్రాణవిముక్తికి సిద్ధముగా నుండవలసినదే కాని వ్రణములని, వైద్యులని, బాధయని, వేదనయని వ్యర్థ

భాషణము లాడుచు నింటనుండ వచ్చునా ? ఈ శరీరము
శాశ్వతమా ? ఏవేళ కెటుల జరుగ విధిలిఖించి యున్నదో ?

ఉ_త్త : నాథా ! కుడిచి కూర్చుండి యశుభములేల ?

(అనుబంధము 28)

అభి : దాని కేమిగాని ప్రాణేశ్వరీ ! నిండుగర్భవతివి. సవ్యగ్నుండనైన
నావలన నీకొక్కముచ్చటయు జరుగక పోయెనుగదా ?

చ. విరటుని ముద్దుబిడ్డ వర ♦ వింద దళేక్షణ ! నానిమిత్తమై
కరము సుఖానుభూతులను ♦ గాంచవు లేమిడిఁబూర్ణగర్భిణిం
బరగుసుశీల నిట్లు బోలు ♦ పారెడు వేడుకలేమి లేక నే
నరమరఁజేసినాఁడఁ బతి ♦ నై క్షితి నెంతటిపాపినై తినో.

ఉ_త్త : చాలులెండు. ఈమాటలనుమీరాదినమ్ కెన్నిసారులంటిరి ? ఇది
యెన్నవసారి ? అత్తగారు సుభద్రాదేవియు మొన్ననిటులే
యని కన్నులనీరునై తముఁ బెట్టుకొనిరి శుభదాయకమగు
మీదర్శనమునకన్న నితరవేడుకల నేమికోరితిని ?

అభి : పోనిమ్ము. ఉత్తరా ! నీకామాట కష్టముగానున్నచో నటు
లాడను. కాని నాదొక కోరికకలదు.

ఉ_త్త : నాథా ! అదేమి ?

అభి—క. అమృతంబు లురలు దొనయై
రమణీయత గండశర్క ♦ రలపలుకౌనీ
సుమధురమా నధరంబును
రమణీ! ననుఁగ్రోలనిమ్ము ♦ రమణాదరణన్

ఉ_త్త : అబ్బబ్బ ! ఈదినమున నెన్ని సారులు ?

అభి : అబ్బ ! ఎంతవిసుఁగుకొంటివి ! ఇంకొకమారైన నీ పెదవు
లరగిపోవునా ? కరగిపోవునా ?

ఉ_త్త : ఉండండి—అత్తగారు వచ్చుచున్నారు.

అభి : అబ్బ ! అత్తగారు లేరు, మామగారులేరు నేనిఁక తాళను.
(బలవంతముగా ముద్దిడుకొనును)

ఉత్త : సరిలెంవు. ఎంతపిఢ్ఛేయుత ? ఎవరైనఁజూచిన నేమందురు ?

(అనుబంధము. 29)

అభి : ఎవరేమనుకొనుటకు నేనేమి దొంగపనిచేసితినా ? ప్రేయసీ ? నేఁ డుదయమునుండియు నాకు నీపై భ్రాంతి యగ్గలముగా నున్నది. చూడు ? శూరుఁడగువానికి గృహమునఁ బ్రాణకాంతయు రణమున ముక్తికాంతయు నేకదా ప్రియపదార్ధములు !

ఉత్త : నాథా ! ఏమిది ? విజయలక్ష్మియని పలుకగూడదా ! కొదువ మాటయేల ! అయ్యో ! నాదురదృష్టమున కేమందును ? దక్షిణనేత్ర మేటి కిట్లదరుచున్నది ?

(తెరలో)—బాబూ ! అమ్మగారు సుభద్రాదేవిగారు వచ్చినారు.

అభి : పాంచాలికా? అమ్మగారిప్రవేశమున కాటంకమేమి? రానిమ్ము.

సుభ : (ప్రవేశించి) అబ్బాయీ ! శరీరముసందెట్లున్నది ?

అభి : అమ్మా ! కూర్చుండుము. ఎట్లుండ నేమున్నది ? నిన్న శల్యుని తోఁగావించిన యుద్ధమున భుజముపైఁ దగిలినగాయమునకే మీరందఱును పెద్దయార్భాటముచేసి నన్ను శయ్యఁజేర్చి వైద్యకారాబంధనముఁ గావించితిరి. కానిచో నీపాటికిదుర్యోధనుని ప్రాణములతోఁ గట్టితెచ్చి పెదనాయనగారి పాదముల కడ నుంపకుండియుందునా ?

సుభ : నాయనా ? ఆ పని నీకిప్పటికిఁదప్పలేదు. నిన్నటిదినమున మీ తండ్రిగారు సంశప్తకవిజయమునకై మామయ్యతోఁగలసి చనుటెఱింగి ద్రోణుఁడు, నీజనకుఁడు దక్క మిగిలినపాండవుల కెరుకలేని పద్మవ్యూహంబును దుర్భేద్యంబుగాఁబన్ని ప్రొద్దుగ్రుంకులోపల యుధిష్ఠిరునిఁ బట్టితెచ్చి దుర్యోధనుని పాదములకడ నుంచెదనని ప్రతినఁ బూనెనఁట.

అభి : (కోపముతో)

క. ఆపార్థుఁ డేమితలఁచెను
రూపభుజాయుగళ బలభ ♦ రుం డభిమన్యుం
డేపున ధర్మజుపాదస
మీపంబున నిడఁడె తన్ను ♦ మేనెఱుఁగండే?

చ. అనిమిషదైత్య కింపురుషు ♦ లాదిగ నాతనిఁగావవచ్చినన్
పనిగ నతండు ధర్మజుని ♦ పాదములంబడి వేఁడకుండెనే
నని మొనఁబట్టి కట్టి రవి ♦ యంతముఁ జెందకమున్న ధర్మనం
దనునకుఁ గాన్కయిచ్చెద ను ♦ దారత దంభుని గుంభసంభవుః

ఏమీ! ఆ ముదుసలిబాపఁడంతపనిఁజేసినాఁడా? కురుగజంబులకుగర్భభేదకుండగు పాండవసింహంబు నాతండ్రిరణముఁ దొలగినంతనే పాండవసైన్యంబు నెంతతేజోవిహీనముగఁ దలంచినాఁడు మందబుద్ధి? పార్థుఁడు లేకున్న పార్థనందనుఁడు లేఁడే! తండ్రులు భీమ నకుల సహదేవులు లేరే! యుధిష్ఠిరునిఁబట్టుటెంత తేలికగాఁ దలంచి కొఱమాలిన ప్రగల్భఁబులం బలికెను. పద్మవ్యూహంబు ఛద్మంబుఁ గావించెను. కౌగిన యోధులనేకులుఁ గాచినఁగాతురుగాక! కనకలసంభవుండు తల్లకిందులు మార్చినమార్చుఁగాక! ఫాలాక్షుఁడు సాక్షాత్ప్రమథగణపరిసేవ్యమానుండై వచ్చిరక్షించుఁగాక! ద్రోణుఁడైననసరే, ద్రోణుని తలపైవాఁడైననసరే! పెదతండ్రిగారిని తాను గట్టుకపోవుట గాదు. తమరాజగు దుర్యోధనుని గట్టితెచ్చి పెదతండ్రిగారి పాదంబులపై చెద. పద్మవ్యూహంబు పటాపంచలుగావించెద. ఎదురైనపగతుర వక్షంబులు జించెద. జయముఁ గాంచెద.

(అనుబంధము. 30)

సుభ : జయమస్తు జయమస్తు. నాయనా! విజయశాలివై రమ్మి ఇదిగోఖడ్గము. ఇదిగో కవచము. వీనిం గొమ్ము.

అభి : (తీసి కన్నులకద్దుకొనును.)

సుభ : ఈకార్యమునకునిన్నుఁ బంప దలంచియుంటిన్న వాఁడవగునీతో నేమనుటకును నోరురాక మీపెదతండ్రిగారు రాకుండిరి ప్రయాణమై నీవేవారిని సందర్శించి రణభిక్ష వేడు ము మున్నొకసారి నీవు నాగర్భముననుండ మీజనకులు పద్మ వ్యూహ భేదనంబును నాకెఱిగించిరి. నాఁడు గర్భస్థుఁడవగు నీవు వింటివనియు నది నీకలవడినదనియు మీయయ్యనాతో నొకమాఱు వచించిరి. తద్భేదనమును నీవెఱుంగ వైనను పద్మవ్యూహంబును జించినవెంటనే భీమాదులు నీవెను వెంటనేవచ్చి మిగతపనిచేయుదురు. నీకు శుభమగుగాక. నేను పోయివచ్చెదను. అమ్మాయీ! ఉత్తరా! బాబునింక విశేష కాలము నీకడనిలుపక పంపివేయుము! నాయనా! ఇందఱు తల్లులలో నీతల్లియే పుత్రవతియని లోకులు తలంచునట్లు యుద్ధము చేయుము. వీరమాత ననిపించుకొని గర్వించెదను.

అభి : తల్లీ! పిఱికికండ లేక కన్నకొడుకును, పద్మవ్యూహ తంత్రమును పూర్ణముగా నెఱుంగనివానిని కేవల యశఃకాముడై పుత్ర వాత్సల్యంబు నొకమూలఁదోసి రణమున కంపుచున్నధైర్య శాలి కడుపునఁ బుట్టిననాకుమాత్రము పిఱికితనమెక్కడిది!

ఉ. మామయుతండ్రియున్ భళిరె♦మాయభిమన్యుఁడటంచుమెచ్చనా
నామహినాథు లావహము♦నన్నునుఁగాంచి పురారియంచు జిం
తామగ్నులై కలంగ కురు ♦ ధారుణినేత కిరీటియే నయం
బేమెయినైననంచు భ్రమి ♦ యింపఁగఁద్రుంపనె వైరిశీర్షముల్

మహాభారతయుద్ధమున సుభద్రాదేవియే వీరమాత. కాని తల్లీ! సంగ్రామగతులయినవారు తిరిగి యింటికి వత్తురను నమ్మకమేమి? కావున నన్నొకమాఱు కౌఁగలించుకొమ్ము. నిన్ను నేను చూతునో చూడనో!

సుభ : నాయనా! నీకులదేవతలు నిన్నురక్షింతురు. ధర్మజుని సత్య సంధత నిన్నుఁ గాపాడును. నా యాశీర్వాక్కులు నీకు

శ్రీరామ రక్షలగును. ఈ యుత్తర పాతివ్రత్యము నీకు సదా మంగళమగును. (అనుబంధము ౩౨)

(విశ్రాంతి సంకేతమగు యవనిక మెల్లగా జారును)

ఇది తృతీయాంకము.

చతుర్థాంకము

దృశ్యము—౧. ప్రదేశము:—సేనానివేశము.

(ప్రవేశము:—రథస్థులై సుధర్మాభిమన్యులు చనినపిదప సుభద్ర)

(అనుబంధము 33.)

సుభ : అమ్మయ్య ! ఇప్పటికిఁగదా నా హృదయము చల్లఁబడినది. కౌరకులంబునఁబుట్టిన భారతమహిళకు నీవుఁగాక తగ్గిన వీర మాతంజేయఁదగిన కుమారుని కీర్తిని వినుటకన్న నానంద మేమిఁగలదు ? తండ్రి రణంబున లేని కొఱఁతను పూరించిన వాఁడే పుత్త్రుఁడు. అభిమన్యునిఁ గన్నతల్లియని పేరునచ్చిన నాకంతేచాలును. నేనింక శిబిరంబున కరిగి అక్కగారగు ద్రౌపదీదేవి కీవార్త నెఱింగింతును. (పోఁబోవుచుండ)

(ద్రౌపది వీరవేషముతోఁ బ్రవేశించును.)

ద్రౌప: అమ్మాయీ ! సుభద్రా ! నీవింతలో నెక్కడకుఁ బోయితివి ?

సుభ : అక్కా ! నేనిప్పుడు నీకడకు రావలెనని యుంటిని. ఇంతలో

మీరు వచ్చితిరి. సరిగాని. ఇంతలో నెక్కడకుఁ బోయితివంటి వెంతలో.

ద్రౌప: ధనురాచార్యుఁడు ధర్మజునిఁ బట్టెదనని ప్రతినఁబూని పద్మ వ్యూహంబు నిర్మించుటయు, నందులకు మనవారందఱు ఖిన్నులగుటయు వింటివిగదా!

సుభ: అవును. తరువాత?

ద్రౌప: తరువాత నేనురథమును సిద్ధపఱచుకొనఁబోయితిని. ఇంతలో నీవిట్టె యదృశ్యమై పోయితివి.

సుభ: (నవ్వి) ఇంతేకదా! అక్కా! నీయుద్దేశ మేమి?

ద్రౌప: ఆ! నా యుద్దేశ మేమని నన్వేద వేమి?

సుభ: రథ మెందులకు?

ద్రౌప: అవునే! నీకు పద్మవ్యూహభేదనము తెలియునుగదా! నాకు సారథ్యము తెలియును. ఈ వీరవేషమును జూచితివా! ఇదిగో ధనుర్బాణములను చూడు మివి నీకొఱకు ఈ మునికోలఁ జూడు. ఇది నా కొఱకు. మనము యుద్ధమున కరిగి దిగ్విజయులమై వచ్చెదము రమ్మ.

సుభ: ఓస్, ఇదటవమ్మా నీ సంకల్పము?

ద్రౌప: ఆ! ఆ! నీ యుదాసీనత కర్థమేమి? కానిమ్మ. నీ వెంతేగి యుంటివి?

సుభ: బాబునకుఁ బోయియుంటిని.

ద్రౌప: ఔను. అన్నట్టు బాబు చెయ్యి యెట్లున్నది.

సుభ: పద్మవ్యూహమును ఛద్మము చేయఁదగినట్లున్నది.

ద్రౌప: (కోపించుచు) ఆ! అట్లయిన సంగతియంతయు లేవకున్న బాబునకుఁ జెప్పితివన్నమాట.

సుభ: చెప్పితివన్నమాటయేమి! పద్మవ్యూహ భేదనమునకై పంపితి నన్నమాట.

ద్రౌప: అయ్యయ్యో! తెలివిమాలినదానా! ఎంతపనిఁ జేసితివమ్మా!

తండ్రియును, నామము ను దాఁపునతేను. చేతియందు మహా
పాయకరమగు ద్రవ్యము. గురువునుపన్నిన పన్నములు సహాయ
యసాధ్యము. వయసుఁజూడ పదునారేండ్లు, మున్నెన్నడైనను
నవే ! సహాయమూ లేదు. ఇట్టివానిని బంపుటేమి ?

(అనుబంధము 31.)

సుభ : అక్కా ! ఇట్టి సమయంబునఁగాక కుమారుని శౌర్యమగు
పడు చెప్పుదు ? మనము వీరమాతలమగు టెప్పుడు ? తండ్రియు
మామయు రణమున నున్నచో బాలుని సహాయునిగా నెవ్వారే
వ్వరు ? శూరుఁడగు కుమారుఁగన్న తల్లికోరిక యిటులుండునో
నీవెఱుంగవా ! నేను దాసిఁగోరితి యిందు సహాయమేమి ?

(అనుబంధము 35.)

ద్రౌప: చెల్లెలా ! యెంత కఠినాత్మురాలవమ్మా !

సుభ : సోదరీ ! మనరాజ్యము నపహరించినవారిని యుద్ధమున సంహ
రించి రాజ్యలక్ష్మినో, యుద్ధంబునఁజచ్చి స్వర్గలక్ష్మినో,
గైకొనుటయేకదా ధర్మము. దానికి విచారమేల ? నాకును
నిట్టివిషమసందర్భమున మగజన్మయెత్తిన నేనును రణంబున
కరిగి జంపఁ. జానసిద్ధమగుచుండఁగా సుభద్ర తన కుమారునిఁ
బంపుట కెంతలోభించెనని లోకులనరా !

ద్రౌప: ఆడిన నాఁడుఁగాక ! చేతిబిడ్డను నూరకే లోకముఁజూచెదవా ?

సుభ : ఈతవచ్చిన బిడ్డయైనచోఁజూడ నేవచ్చును.

ద్రౌప: చాలుఁ జాలు. పిల్లతీరుఁగని గొడ్డు రాలివలె మాటలాడి
తివి. అయినను నీబిడ్డను ఏమిచేసికొనిన నాకెందులకు ?
నేను వెళ్లెదను. అబ్బా ! ఎంతపనిఁ జేసితివి ! (ప్రస్థానము.)

సుభ : ఈద్రౌపదీదేవి మహావీరవనితయయ్యుఁ బుత్రవాత్సల్యమిటు
లీమెకు సంతాపముఁగూర్చినది. మగవాఁడై పుట్టిన దెందు

లకు ? వ్రణములని వంకఁబెట్టుకొని యింటఁగూర్చుండుటకా.
రణమునఁ జచ్చినఁజచ్చుగాక ! ఇంటఁ గూర్చుండనిత్తునా ?

ద్రౌప: (ప్ర) ఓ కఠినాత్ముల్లారా ! అనుగమఱచితిని ! బాబు చేయి
వాపింకనుతగ్గలేదుగదా ! ధనస్సుపట్టఁగలిగినాఁడా ?

సుభ : అక్కా ! కోపగింపకుము. అన్నియుఁజూచియే పంపితిని. నేఁడు
కొంచెము వాపుతగ్గినది. వ్రేళ్ళువంగినవి. ధనస్సు పట్టఁ
గలిగినాఁడు. నాపై గోపింపక పటకుటీరమునకు రమ్మ.

ద్రౌప: సరే, రమ్మ. అంతకన్నఁ జేయవలసినదేమి ?

సుభ— (అనుబంధము 36) (ఇరువురు ప్రస్థానము)

దృశ్యము.—౨ పద్మవ్యూహముఖము.

(ప్రవేశము:—ద్రోణ, దుర్యోధన, దుశ్శాసన, కర్ణ, సైంధవ; శకునులు)

అందఱు— (అనుబంధము 37)

ద్రోణ: మహారాజా ! దుర్యోధనా ! నేనురచించునదెల్ల నిక్కమువము
అల్లదె దూరంబునఁజూడుము. ఆరథము దానిపై శోభిల్లు
టెక్కెము వారువములు—తప్ప పార్థనందనుఁడగు నభిమన్యునివి
వాఁడేరణమునకు వచ్చుచున్నవాఁడు. ఈ రహస్యంబు నే నెఱుఁ
గుదును. పద్మవ్యూహంబు శత్రుదుర్భేద్యంబని యెఱింగి
వెడలుటయే కాని, మఱలుటెఱుంగని యీపసివానిని బంపు
చున్నారు.

కర్ణ : భారద్వాజా ! అట్లయిన మఱియు మేలయె. మఱలుటెఱుఁగని
వాఁడు మొగ్గరంబునఁ జిక్కుపడుటతప్ప జేయునదేమున్నది ?
అర్జునునంతటివాఁ డీయస్త్రజ్ఞ కుమారుఁడు. నేఁడు సులభము
గా నేలఁగూలును.

శకుని: నీయుక్తిచాలదోయి. అంగరాజా ! ఆవెనుక భీమాదులు
తోడుగా వచ్చుచున్నటులున్నారు. వ్యూహభేదనంబు
నభిమన్యుఁ డొనర్ప మిగతపని వీరుగావించి కృతార్థులయ్యెది

దుర్యో: ఆచార్యా ! అవును. ఆ వెనుకనున్నవారు భీమాదులేకదా ?

ద్రోణు: అట్లయున్నారు. వారి నాపుట కొక్కటే మార్గమున్నది.

దుర్యో: ఏదది ?

ద్రోణు: మన సింధురాజు.

సైంధ: సుయోధనా ! నేనీభీమాదుల నరికట్టఁగలను. నీవుదిని భీతి నందవలదు. తొల్లి నేనందిన శంకరవరం బీనాఁడు నా కుపక రింపఁగలదు. నేఁడుభీముఁడేకాఁడు-ఫాలాక్షుండువచ్చిన పరా భవించి పంపఁగలను

ద్రోణు: అట్లయిన జయద్రథా ! నీవు వ్యూహాముఖంబున నిలిచి యభిమన్యుని లోపలఁ జొరనిచ్చి భీమాదుల కడ్డుపడుము. దుర్యోధన దుశ్శాసనకర్ణశకునులారా ! మీరు వ్యూహానల దిక్కుల జాగరూకులై యుండుడు. నేను మధ్యంబున నుందును. ఇంక నామధ్యమపాండవ శూరుండు వంటయింట కుందేలుగతి నెందుకు జనఁలేడు. మనమింక పోదమురండు. జయద్రథా ! జాగ్రత. (సైంధవుడు తప్ప అందఱు ప్రస్థానము)

అనుబంధము 36

భళిభళీ ! నేఁటికిఁగదా ! నా పరాక్రమప్రదర్శనంబునకు సమ యం బబ్బె ! నేటికిఁగదా ! భారతరణంబున నావలన నిలుప నయ్యె ! ఔరా ! పాండవుల కెంతకండకావరము ? ఆనాఁడు వనవాసంబున నేను ద్రౌపదిం బరిభవింపఁబోవ నన్నే పరాభ వించి వదరిరిగదా ! ఆ యవమానదుఃఖంబుననేకదా శంకరుఁ గూర్చి తపంబు సలుప కరుణాంతరంగితుఁడై పార్థునిదక్క తక్కంగలపాండవులను ముందు భారతరణంబున నొక్క నాఁడెదుర్కొని గెల్తువనివరంబొసంగెను. ఆ వరదినంబు నేఁడు గాఁదోఁచుచున్నది. స్వస్తి..కౌరవేశ్వరా! అదిగో ! అభిమన్యుని

రథము వ్యూహముఖమునకు వచ్చినది. అతని వ్యూహంబునఁ జొరనిచ్చి మిగతవారి నొకచేయిచూతును.

(అనుబంధము 39.) (ప్రస్థానము)

(అంతట రథస్థులై అభిమన్యుఁడు, సారథి ప్రవేశము)

అభి : సుధర్మా! ఇదియే పద్మవ్యూహ ముఖమని తోఁచుచున్నది. సైనికులను దుర్భేద్యముగా నేర్పఱిచి చొరశక్యముగాకుంచి నారు. ఇచ్చటమాత్ర మొకింతమార్గముఁ గలదు. అదేమి? నీవు రథము నేల మందముగా నడిపెదవు? ఒకవేళ రథాశ్వము లలసటఁ జెందలేదుగదా? పాపము! అట్లయినచో వానికి శ్రమ నీయక వెనుకకు రథముఁ దోలుకొనిపొమ్ము. నేను బాదచారినై మొగ్గరమును భేదింతును.

సుధ : బాబూ! క్షమింపుము. రథాశ్వము లలసటఁజెంది కాదు వ్యూహముఖంబునకు వచ్చితిమి పెదనాయనగారు వృకోదరులుచూ దేశములతో వెనుకఁజిక్కియున్నారు. అందులకై యశ్వంబుల పగ్గంబుల నించుక బిగించితిని.

అభి : ఓయి వెఱ్ఱివాఁడా! నా చిరమిత్రుండవైన నీకు సయితమిట్టి విభ్రాంతియేనా! రణమునం దసహాయుండనగుదునే కాలుపెట్టిన తరువాత వీరుండగు నాడింకొక సహాయమునకుఁ బ్రతీక్షింపదగునా? నీకు శాత్రవభీతి కలిగినచో భీమాదులు వచ్చుదనుక నిలిచి పొమ్ము. నే నీకోదండద్వితీయుఁడనై రణమునఁ బ్రవేశింతు.

(40 అనుబంధము.)

మ॥ తుల లేనట్టి స్వరాజ్యరక్షణ సము ♦ ద్యోగంబునం బ్రాణవా
యుల నుగ్రాహవభూమి వీడుట యశం ♦ బో? దేశవిద్రోహులై
కలకాలంబును గాకిపోలె బ్రదుకం ♦ గా నొప్పటే కీర్తియో?
దలపన్ రాదె సుధర్మ! మానుమిఁక వ్య ♦ ర్థంబైన సంతాపముల్

సుధ : బాబూ ! నా తెలివిలేమికి మన్నింపుము, లోకైకధనుర్ధరుని మహాభారతబాలవీరుఁడవగు నీక సంగడికాడనై సారథినై నీచే రక్షింపఁబడు నాకు భయమేల ?

అభి : అట్లయిన వెఱ్ఱిసంశయములను వదలుము. ఎవ్వరి సహాయము నక్కఱలేదు. మారాడకుండ నిమ్ము రథమును రెండడుగులు నడపుము. వ్యూహముఖంబును భేదింతును.

సుధ : భాగ్యము. (రథము నడుపును)

[అభిమన్యుడు వ్యూహముఖమును భేదించి సుధగుమ్మని లోనికి నిష్క్రమించును]

సైంధ: (ప్రవేశించి) సెభాస్ ! సుభద్రాకుమారా ! కనుమూసి తెఱచినంతలో తళుకనిపించి తమ్మిమొగ్గరంబు భేదించిన నీసాహసము మెచ్చఁదగియున్నది. పదునాలుగేండ్ల ప్రాయమున భారతిసంగ్రామము నుఱ్ఱూతలూగించిన నీవంటి కుమారులకు తల్లియగు భరతమాత వేనవేలుగాఁ గనును గాక !!! ఓహో ! ఈవంక నప్పుడే భీమాదులు వచ్చి పడుచున్నారు.

భీము : (ప్రవేశించి బిగ్గరగా) ఓహో ! నకులసహదేవ సాత్యకిశల్యప్రముఖ వరాగ్రులారా ! త్వరపడవలయును. త్వరపడవలయును. బాలు డప్పుడే వ్యూహమును జించుకొని యిమిడినవాడు. అతిదూరము మరిగె. శీఘ్రముగా వెంబడింపకున్న నపాయము సంభవించును.

సైంధ: ఓహో ! బావగారా ! ఎక్కడికీ ప్రయాణము ? తల విరియ బోసికొని, గదను భుజమున వైచుకొని యొడలెఱుఁగకుండ పరువెత్తుచున్నారే !

భీము : ఓరీ ! సైంధవపాంతకా! నీవఁటరా ? ఉదయమున నేమార్జాలము వలె నెదుర్రైతివేమి ?

సైంధ: ఆఁ! అవును మార్జాలమే. పాండవ మూషికములకు తెలిసినదా ! బావా ! ఎంత తెలికగా మాటలాడితివి ! పాపము.

పద్మవ్యూహముం జొరఁబోవుచుంటివా ! ఆ బాలమూషికము పద్మవ్యూహమను బోనులోఁ బడినది. పాపము. మీకా దుష్ప్రాప్తియేలనని పరామర్శింప వచ్చితిని. రండు. ఏయుద్ధము మీకు ప్రియము ? గదాయుద్ధమా ? ముష్టి యుద్ధమా ?

భీము : ఔరా ! ఏమిరా నీ కావరము ? ద్రౌపదిని బరాభవింప వచ్చి నప్పుడా మాదుస్సల విధవముండ యగునని కనికరించి చంపక వదలివేయ జుట్టు జాడించుకొని పరువెత్తుట నీ వెంతలో మఱచితివి ? మందను జూచి కుక్క మొరిగినట్లు కౌరవ చండాలురక్షణము నమ్మి తలకుమీఱిన మాటలాడెదవా ?

సైం : ఛీ ! ప్రేలకు ఆ ద్రౌపది పరాభవమునాఁటిమీదు రాగతమే నేఁ డభిమన్యు సహితముగ నందఱి నాశనంబునకుఁ గారణంబని నమ్ముము ఇంక నీవృథావాగ్వ్యయమువలన లాభము లేదు. బలముఁగలవాఁడవేని రమ్ము పోరాటమునకు.

భీము : ఛీ! ఛీ! తులువా! అట్లయిన నిన్నింక క్షమింపను రమ్మురమ్ము.

సైంధ: (41 అనుబంధము ఇరువురు; ప్రస్థానము)

దృశ్యము - 3

ప్రదేశము:—పద్మవ్యూహాంతరభాగము.

(ప్రవేశము:—అభిమన్యు, దుశ్శాసనులు)

అభి : (42 అనుబంధము)

ఓరీ! పౌరుషలజ్జాహీనుఁడా ! దుశ్శాసనా ! మాయమ్మను, బరమపావనిని, ద్రౌపదీదేవిని కేశవపాశములం బట్టుకొని నిండు సభలో మానుషమును విసర్జించి, కుధర్మ మవలంబించి గట్టు పుట్టంబులను నిడువ సంకల్పించిన నీ వెంత కాలమునకు నాకంటఁబడితివిరా! మహాఘోరపాతకా! ఎన్నినాళ్లనుండి యో నిన్నెదురుకొని నా బాణముల వేడిమి నీకుఁ జూపవలయు నని యుంటిని. నేఁటికది సఫలీకృత మయ్యెను. ఓరివెడగా ! తల్లితో

సమానురాలైన వదినెగారిని పాప మనక పరాభవింపఁదలఁ
చిన నీ గొంతుఁగోయుదును.

మ॥ ఖలుఁడా! పూజ్యసతీమతల్లిని ననుం ♦ గన్నట్టి పాంచాలి నా
కులఁగావించి, శిరోజముల్ బెటికి సం ♦ కోచింపకే యంబరాం
చలముం బట్టిన నీదురక్తమును నా ♦ స్వాదింపఁగాఁజేసి నీ
తలఁద్రుంతున్ ద్రుపదాత్మజాపరిభవో ♦ ద్యద్వహ్నిచల్లారఁగన్

దుశ్శా: ఓరీ బాలకా! పసుచుఁదనమున సంగ్రామమన్న నేమో
యెఱుంగక ప్రేలుచుంటివి. ఒక్క ప్రేటుతోడ రెండుతునక
లగుదువు సుమ్మా! నీకీరణమేల? నీ కేమికావలయునో కోరుము
వాని నిచ్చెదను. మారాడక యింటికిబొమ్ము.

అభి : ఛీ! ఛీ! నీచుఁడా? నీచపుమాటలాడకుము. బాలుఁడని నన్ను
బ్లెమ్ముల నణచేత నిడి నాచేతిచావుఁతప్పించుకొనఁ జూచు
చుంటివటరా! వెకలీ! నీపాలిఁటగాలుఁడనుగాని బాలుండను
గానని నమ్ముము. నాకు నీతోడ వినోదసంభాషణంబు లొన
రింపఁదగిన సమయము లేదు. నీవంటివాఁడిన నేపులను నేఁడీరణ
భూమికి బలి నీయవలసియున్నది. రమ్ము. నేను శాంతింపఁవలఁచి
నను నా శరకాండములు శాంతించునట్లులేదు రమ్ము.
(ఇరువురును యుద్ధము చేయుదురు. అభిమన్యుండు దుశ్శాస
నుని గొంతుఁగోయఁబోవును.)

(తెరలో) బాబూ! వలదు. దుశ్శాసనుని గొంతుఁ గోయవలదు.
వృకోదరుఁడు వానిరొమ్ముచీల్చిరక్తముఁద్రాగెదనని ప్రతిజ్ఞఁదాల్చి
యున్నాఁడు.

అభి : (గుండెలపైనుండి లేచి వెనుకకుఁదిరిగి) ఆహా! క్షణములోఁ
ప్రాణముఁబాయనున్న వీనిమృతికిఁబెదతండ్రిగారి ప్రతినయొక
టడ్డము వచ్చెనా? (దుశ్శాసనుఁడు పాఱిపోవును)

అభి : ఎవరువారు?

సుధ : బాబూ ! నేను దేవరవారి సారథిని. సుధర్ముఁడను. మిమ్ములను రథమునుండి నేలకు దిగనీయవలదని అమ్మగారు మఱిమఱి చెప్పినారు. నేను వారించుటకైన లేకుండ నేలకు లంఘించి యీ దుశ్శాసనుని వెంటవచ్చితిరి. ఇఁక రథము నెక్కుఁడు.

అభి : (నవ్వి) ఓహో! ఈకుక్కలు కాలు కఱచునని తల్లిగారిభయము కాఁబోలును ! సుధర్ముఁడా ! సరి ! రథము నెక్కెదను కాని చూడు. రక్తము విశేషముగాఁగారుచున్నది, కట్టుబిగింపుము.

సుధ : అమ్మయ్యో ! బాబూ ! ఇదేమి ? చేతిపై పెద్దగాయమైనది ?

అభి : (నవ్వి) వెఱ్ఱివాఁడా ! రణమున గాయములు కాక మఱేమగు ననుకొంటివి ! భయము లేదు లే ! కట్టుబిగింపుము.

సుధ : బాబూ ! గాయములు బాగా రేగినవి. కట్టినగుడ్డ యంతయు రక్తమునఁదడిసినది. కట్టుఁగట్టెదను. రథముదగ్గరకు రండు.

అభి : మంచిది. (ఇద్దరు నడతురు)

(తెరలో)

ఒరే ? బాలకా ! పార్థనందనా ! ఇంతమాత్రముననే త్రుళ్ళిపడకు. నీ మదమణంప నేనే వచ్చితిని. నిలు నిలు.

అభి : ఆ ! ఏమి నాసుకృతము ? దుర్యోధన మహారాజుగారి కంఠస్వరమాయది ! సుధర్మా ! రారాజుగారు దయాంతర గితులై బాలుఁడవగు నన్ను వెదకికొనుచు సమయుద్ధ మపేక్షించివచ్చుచున్నారు. నేనిప్పుడు వెనుఁదిరిగిపోఁగూడదు. నీవు రథమునే యిచ్చుటకుఁ దెమ్ము.

సుధ : బాబూ ! చేయవలను దప్పినది. అనేక వేలమందిని నీ చేతితోఁ జంపితివి, అలసియుందువు. కట్టుఁగట్టుకొనునంతవఱకైన విశ్రమింపుము.

అభి : ఛీ ! ఛీ ! పిఱికిపందా ! వెఱ్ఱిపోతువంటి నిన్నేల నాకు సారథిగా బంపెనురా మాపెదతండ్రీ ! పో. ఇఁకనాతో మాఁదాడితివా సుయోధను నబద్ధము, నిన్నుఁజంపెదను. మహాయుద్ధమున దల

తెగినను విచారింపఁదగదే! చేయి తెక్కఁటయేమి? సుయోధనుని కంఠస్వరము వినినప్పటినుండియు నాకేదో మహావేదనముఁగ నున్నది. వేగముగ లేచిపొమ్ము.

సుధ : బాబూ! మంచిది మీయిష్టము. (నిష్క్రమణము)

దుర్యో: (ప్రవేశించి) (48 అనుబంధము)
ఓరీ! యింక నీ మిడిసిపాటునాఁగఁ గలదు. నిలువుము.

అభి : రారాజా! సైతమ్మని పరాభవమును జూచితివా! ఇంక నీకుఁ గూడ నా ప్రాయశ్చిత్తమయినది కావలసియున్నది ... లేదు లెమ్ము. అయ్యో! కౌరవచక్రవర్తిగారూ! మీ దుష్ట కార్యములను చెప్పుచుచిల్లులుపడుచున్నను, సహించియుంటిని నను శాంతించుటయేగాని యింతవఱకేమియుఁ జేయకుంటిని. ఇప్పుడే భగవంతుఁడీ సమయము గల్పించినాఁడు. మీరే నన్ను వెదకికొనుచువచ్చితిరి. కాని యొకటి జ్ఞప్తి యుంచుకొనుఁడు అయ్యా! ఆలకించుచుంటిరా! ఇది లోకైకధనుర్ధరుఁడగు నభిమన్యునితో యుద్ధము. ద్రౌపదితోఁ జూదమాడుటగాదు. నీచమని వెనుదీయక, పాపమునకు వెఱవక, సాధ్వులను సభకీడ్చుటగాదు. వారిశిరోజములను, కట్టువస్త్రముల నూడ్చుటకాదు. తెలిసినదా? (44 అనుబంధము.)

సీ. మాయజూదంబున ♦ మాయింపఁబడుటకు
గడుసరిగాని ధ ♦ ర్మజుఁడు గాడు
హీనబుద్ధిని వేణి ♦ నీడ్చి భంగముసేయ
సాహసింపంగ బాం ♦ చాలి కాదు
దారుణంబుగఁ జిచ్చుఁ ♦ దగిలించి కాల్ప నా
యితవకాట కిది లక్క ♦ యిల్లు కాదు
హితమాడవచ్చిన ♦ మతిమాలి బంధింపఁ
గుత్సితం బెఱుఁగని ♦ గొల్లగాదు

గీ. చెనఁటి యివి బాణచయమె పా ♦ చికలుగావు
బాలుఁడనుకొంటివేమొ నీ ♦ కాలుఁడితఁడు
ఎందుఁబోయెదవింక ని ♦ క్రమ్మఁదఁజేతుఁ
గౌరవ సాజ్యసామ్రాజ్య ♦ కాంత వేడ్క.

దుర్యో: ఓరీ క్షీరకుంతుఁడా! గ్రుడ్డువచ్చి పిల్లను వెక్కిరించునట్లు నీవఁటరా నన్నాక్షేపించునది?

అభి : అవును. నేను క్షీరకుంతుఁడను నీవు విషకుంతుఁడవు. నీచరిత్ర మెవరెఱుఁగరు?

దుర్యో: విషకుంతుఁడన నర్థము తెలియునా! ఫాలాక్షుఁడన్నమాట

అభి : ఫాలాక్షుఁడన్న నర్థము తెలియునా! నా తండ్రితో గెలువలేక పాశుపతమును లంచమిచ్చుకొన్న వాఁడన్నమాట. ఆ విషకంఠుఁడు నా తండ్రిపాలు, ఈ విషకంఠుఁడు నాపాలు. తెల్లఁబోయి చూచెదవేమి? చెప్పరేదా ఇవి పాచికలుకావు బాణములు! ద్యూతసభగాదు సంగ్రామరంగము! బాణములు తీయుము వింట సంధింపుము!

దుర్యో: ఏమి! నీ పలుకులు చులుకగా నున్నవే.

అభి : పలుకుల చులుకఁదనమేమిచూచితివి! ఇదిగో! నాములుకుల చులుకఁదనము— (బాణములు వదలును)

దుర్యో: స గే. రా. రణమునకు రమ్ము.
(ఇరువురును రణమాచరింప నభిమన్యుఁడు దుర్యోధనుని గొంతు కోయఁబోవును) (తెరలో)
బాబూ! దుర్యోధనుని గొంతుకకోయకు. అతనితొడలు గదచే విఱుగఁగొట్టెదనని వృకోదరుఁడు ప్రతినఁజేసియున్నాఁడు.

అభి : ఛీ-ఛీ-ఎంత యుత్సాహభంగము? ఇందులకును పెదతండ్రిగారి ప్రతినయే యడ్డమువచ్చినదా! ఏమిచేయుదును? విధి ప్రతికూలుఁడుగా నున్నాఁడు. చేఁజిక్కిన దుర్యోధన దుశ్శాసనుల నిద్దఱను వదలవలసి వచ్చినదిగదా! ఓహోరి రాజా! రారాజా!

మా యుధిష్ఠిర భూపాలుని ప్రాణములతోఁ దెచ్చి నీ పాదముల
కడ నుంచెదనన్న మీ సేనానాయకుఁడగు భారద్వాజుని శప
థమును వితథమును గావించి రక్తసంఛిన్నమగు భవచ్ఛిరంబుఁ
గొనిపోయి మా పెదతండ్రిగారి పాదంబులకుఁ గానుకఁ గానీయఁ
దలంచితిని గాని-తండ్రిగారగు వృకోదరుని శపథ మడ్డువచ్చి
నిన్ను రక్షించెను. "పాపీచిరాయువు, సుకృతీగతాయు" వనుట
నిక్కముగదా! పొమ్ము. ఒడలు దులుపుకొని నీవాగుచూడ
కుండ శిబిరంబునకు బాఱిపోయి యభిమన్యుఁడు ప్రాణములతో
నుండుఁదనుక బయటకు రాకుము. పొమ్ము; (త్రోయును.)

దుర్యో:(ఒడలు దులుపుకొని పరుగిడును.)

అభి : ఇప్పటి కిద్దఱి వలన నిరాశమైనది. అయినను నా కోరికను గర్ణాశ్వత్థామలైనఁ దీర్ప లేకుందురా? ఆహా! ఎక్కడి రక్త మంతయును? గాయములు తగిలియుండును- కానిమ్ము భయము లేదు. వీరుఁడగువాని రక్తమే యీ వీరభూమియగు భరత మాత కమృతాభిషేకము. జీవములు కంఠమును వదలు నంత వఱకు, స్వారాజ్య సంరక్షణము కొఱకు స్వశరీర రక్త మాంసములను సమర్పించినవాని భాగ్యమే భాగ్యము, తుచ్ఛ మగు నీ శరీరము, అతిహేయమగు నీ రక్తము, తల్లియగు భరత మాతకై వినియోగింపఁ బడుటచేత నే యింత ధన్యుఁడనైతిని. పోయినఁబోవుఁగాక! ఈ ప్రాణమేమి శాశ్వతమా! చోరులై మా రాజ్యము నపహరించి దౌర్జన్యపరిపాలన మాచరించు శాత్రవులను, ప్రేటునకు వేవురుగాఁబరిమార్చుటకు ముందే నా జీవితములుపోవుఁగాక! జయ్! వీరభరతమాతకు జయ్!

"మహీమండలమే సుందర తరయహభారత వర్షహమారా హై
హాయకోకిలే ఇసి ఉపవనకీ । యః ఉద్యాన హమారా హై
అగణితనదియా ఇస్ పర్వతకీ । రమ్యతటీకో కరేకలోల్
జనకే కారణనందన వనసమ । భారతవర్ష హమారా హై"

సుధ : (ప్రవేశించి) బాబూ ! రథముఁ దెచ్చితిని. రథమెక్కి కట్టు గట్టించుకొనుఁడు. కడవలకొలఁదిగా రక్తము కారుచున్నది.

అభి : సుధర్మా ! వచ్చితివా ? నిన్నింతకు ముందు తూలనాడి పంపితిని. రమ్మ, కట్టుఁగట్టుము. రథాశ్వములకును నీకును గాయములు తగులలేదుగదా !

సుధ : (కన్నీటితో) బాబూ ! రథాశ్వములకు—నాకేమి ? మీ శరీరమంతయు గాయములతో నిండిపోయి శరీరము నెత్తురుముద్దయైనది – మీ ప్రాణములయందే నాకు సంశయముఁ గల్గుచున్నది. అమ్మయ్యో ! వక్షస్థలమున నీ గాయమేమి !

అభి : సూతుఁడా ! నీవు వట్టి యమాయకుఁడవు. దీపము వెలిఁగినకొలఁదియు చమురు నశింపదా ! దీనికేమి విధానము ? అదిగాక నా కోర్కెటే సంకల్పము. నీవు వినలేదా !

సూతు: బాబూ ! అదేమి ?

అభి : ప్రాణములతో నింటికిఁ బోవనని. నా ప్రాణములైనఁ బోవలయుఁ గౌరవవంశనాశమైనఁ గావలయు——

సూతు: హరిహరీ ! (తెరలో)

ఆ ! ఏమిరా నీ కావరము ! ఈ కర్ణుఁడు జీవించియుండఁగా కౌరవ వంశ నాశమా ? నిలునిలు.

అభి : (విని) ఆ ! ఏమిది ! నా తండ్రినిఁ జంపుదునని కౌరవేశ్వరుని తేరతిండిఁ దినుచు దున్నపోతువలె బలసిన యంగరాజుగారా ! సుధర్మా ! కట్టుఁగట్టుట చాలును. నిలుపుము. ఈతఁడును పాదచారియై వచ్చుచున్నాఁడు. నాకును రథ మక్కఱలేదు. దూరముగా నుంచుము.

సుధ . హా ! విధీ ! గాయమునకుఁ గట్టయినఁ బూర్తి గానీయవైతివా! ఏమి కీడుమూడనున్నదో కదా !

కర్ణు : (అనుబంధము 45) (ప్రస్థానము.)

ఓరీ బాలకాధమా ! నీటఁబడిన చేఁపవలె మిడిసిపడఁబోకు.

భూమిం బడినఁగాని నీపస తెలియఁబడదు. సుయోధనాదు లతోఁ బోరుటగాదు, నాపై నీ భుజాసారముఁ జూపుమున యిదివఱకు నీతండ్రియొక్కఁడే నావంతనుకొంటి. నిప్పుడు. రెండుతరములకు మోక్షమీయ నేను గతినైతిని. రమ్మి, యిప్పుడే నీమృతి నాలకించి నీ బంధువు లేడ్వఁగలరు.

అభి : అయ్యా! ఎవరుమీరు? అంగరాజుగారా! ఓహో! మీరు రెండు తరముల మోక్షమునకు గతినైతి మనుకొనుచుంటిరా! నే నేమనుకొనుచుంటినో వింటివా? రెండవతరమువాఁడు మీ మోక్షమునకు గతియయ్యె ననుకొనుచుంటిని. దాని కేమిగాని—ఓ పౌరుషలజ్జాభిమానహీనుఁడా! నా తండ్రిని చంపు దువని యాశపడి మీ రారాజు నిన్ను గంగిరెద్దునువలె పోషించుచుండెనే! ఇందాకటి యుద్ధమున నన్నుఁ జూచియే పారిపోయితివి. సిగ్గు లేకపోయెనా!

కర్ణు : ఛీ! డింభకా! అతిక్రాంతమర్యాదుఁడవై వాగఁజొచ్చితివిగాదె! తల్లిదండ్రు లడవులఁబట్టఁగా మేనమామయింటఁ దిన్నతిండి నిన్నెంత చేసినదిరా?

అభి : ఓహో హో! ఏమిది! నన్నుఁజెప్పునది సూతపుత్రుఁడగు కర్ణుఁడా! ఛీ! ఛీ! అధమకులీనపుత్రకా! గురివెందగింజ తన నలుపెఱుఁగ దన్నట్లు నీవఁటరా నన్ననఁదగినవాఁడవు. నేను మేనమామయింటఁ దినుచుంటినిగాని నీకు కురురా జేనాఁటి చుట్టము? దొరికినదే చాలునని వానిమోచేతిగంజి మెదు లంటనాకఁ జొచ్చితివి?

(అనుబంధము 43)

ఉ. పున్నెపుకూటి కాసపడ ♦ పోరొనరింతు కిరీటిఁ ద్రుంతు నం చెన్నియొ డంబులన్నలికి ♦ యీ కురునాధుని నాశ్రయించి నీ వున్నతి పొట్టఁబోసికొను ♦ చుంటివిగా కులహీన! యిప్పుడే నిన్నలికాలరాచి కడు ♦ నీచపు మృత్యువుఁ గల్గఁజేసెదన్.

కర్ణ : ఛీ ! వాచాటా ! మర్యాద నెఱుంగని నీతో వాగ్వ్యయమేల? రమ్ము రణమునకు.

అభి : ఇదిగో ! ఇద్దఱిని జంపదలంచి పైకెత్తిన కత్తి. ఇంక నిన్ను విడువను. రమ్ము. నిన్ను నమ్ముకొని యీ రణమునకు దిగిన రారాజున కెట్టి ప్రాయశ్చిత్తమగునో తెలియును.

(కర్ణాభిమన్యులు యుద్ధము చేయుదురు.)

(అభిమన్యుడు కర్ణునినరుకబోవంగా)

[తెరలో]

బాబూ ! వలదువలదు. కర్ణుని నఱుకవలదు. పాంచాలినింజూచి నవ్విన వీనిని చంపుదునని నీ తండ్రి ప్రతిన దాల్చినాడు.

(కర్ణుడు ప్రస్థానము.)

అభి : (ఆయుధముల వదలి) ఉస్ ఏమిచేయుదును ? పేరు గలవారి నందఱను తండ్రులే పంచుకున్నచో నేనెవరినిం జంపుదును ?

సుధ : (ప్రవేశించి) బాబూ ! బాబూ !! మహోపాయము వచ్చినది. శల్యునితోం బోరు యుధిష్ఠిరునిపై బృహద్బలుండు గవసినాడు. మన ఘటోత్కచుండును జనుచున్నవాడు. మనము సయితమా వంక కరుగకున్న పెదనాయనగారి కపాయము రావచ్చును. వారికింగీడుం గల్గినతరువాత నేమనుకొన్న నేమి లాభము ?

అభి : ఆ ఏమి ? శలభప్రాయుండగు బృహద్బలుండే యుధిష్ఠిర క్రోధా! నలంబునంబడ సాహసించెనుగా ?—రే! బృహద్బలచండాలా! నేను లేననియే యింతటిపనికి సాహసించితివా ? సుధర్మా రథము ! రథము !

సుధ : దేవా ! ఇదే సిద్ధపఱచితిని.

అభి : రమ్ము. వేగమున నా వంకకుంబోనిమ్ము.

సుధ : తమ యానతి.

శా. ఓరీ! సోదర సర్వరాజ్యహరణో ♦ ద్యోగంబునన్ మున్నునే
ప్రారంభం బొనరించు మిమ్ముఁ నధియిం ♦ ప న్వచ్చె సౌభద్రుఁడే
పారావారము దూరిన ట్లేమనఁ డీ ♦ పాపంపుసంగ్రామ నే
పాలంబోనడఁగింప, భారతికి నం ♦ భత్తిక్రందేసూచ్చెనే

(ఇద్దఱు ప్రస్థానము)

(దుర్యో-దుశ్శా-కర్ణ-సై-ద్రోణ-శకు ప్రవేశింతురు)

అందఱు ... (అనుబంధము 47)

ద్రోణు: రారాజా! ఈ బాలుఁడు మనకు నేఁడు కాలుఁడైనాఁడు. ఉపే క్షించినకొలదియు మితిమీఱుచు, మితిమీఱిన సేనలఁ గూల్చు చున్నవాఁడు. మన మందఱము మేకమ్మై పైఁబడి విల్లు విఱిచి, విర థుంజేసి చంపినఁగాని జయింపలేము. సర్వప్రయత్నము మాట భగవంతుఁడెఱుంగు, ధర్మమామాట దయ్యమె ఱుంగు.

ఉ. మారుని లీలఁ బార్థుని కు ♦ మారుఁడు వేగమె తెమ్మెగ్గరం
బారసి ద్రుంచి, వీరసుభ ♦ టావళి ద్రుంచి త్రుళ్లి తిరుగఁ
బోరవధించు తానదుదు ♦ ద్రోయి జయించెదనాఁడు లేఁడు మీ
రారసి మోసమార్గమున ♦ సైన వధింపఁగఁబోలు నీతనిన్.

(ప్రస్థానము)

అందఱు— (అనుబంధము 47.)

(సంజయుఁడు ప్రవేశము)

సంజ : (విచారముతో) ఆహాహా! ఎంత ఘోరమునకు సమకట్టిరీ కౌరవులు! అసహాయశూరాగ్రేసరుఁడై యా అక్షౌహిణుల సైన్యమును హతమార్చి మహాబాలవీరశిఖామణిని- భరత ఖండమున కఖండయశంబుఁ గూర్చిన వీరజ్యోతిని, అధర్మ ముగాఁ బదుగురు చేరి విల్లు విఱిచి రథంబుఁ బడగొట్టి, సార థినిఁగూల్చి చంపుచుండిరే! -ఛీ-ఛీ-ముఖాముఖిఁ బోరాడుటకు సాహసములేక చాటుననుండి పదునాఱేండ్ల బాలునిపైని

బల్లెములను విసరి చంపుచుండిరే! కటకటా! సమస్తము నెఱింగిన ధనురాచార్యుఁడు నయిత మెంత యధర్మమునకు పాలుబడుచున్నాఁడు. ఓరోరి కౌరవపశువులారా! భరతవర్ష మునకెల్ల తలవంపుగా నీ యధర్మయుద్ధమొనరింప మీకేల సిగ్గు లేకపోయెను? ఒక బాలునిఁ బదుగు రధర్మముగాఁ జంపుట మానుషమని తోఁచెనా? ఈవార్త పార్థుఁడువిన్న మీ తలలు చితుకఁగొట్టకపోవునను కొంటిరా? పౌరుషమే యలంకార మగు భారతజాతికెల్ల తలవంపు ఘటించితిరిగాదా! మీ తల్లులను వీరమాతలనుగాఁ జేయక వలవల నేడ్పించుచుంటిరా? వీరున కొక్కటియే చావనియెఱుంగరా? పిఱికిపందలై యెన్నిమారులు చావనెంచితిరి? హా! ఘోరము! ఘోరము! అభిమన్యుని విల్లు ఖడ్గమును విఱిగినవి. మేలు—విజయనందనా! మేలు. సగము తెగి వ్రేలాడుచేత గదఁబూని వ్రేటున కొకనిఁజంపుచున్న నీ శౌర్యము మెచ్చఁదగియున్నది. హా! హా! అభిమన్యుని స్థితి యెంత ఘోరముగానున్నది? శరీర మంతయు నొక్క—టేరక్తపుముద్దయై ముక్తికాంతాస్వయంవర మాచరించినసంతములాడిన పెండ్లికొడుకువలెనున్న వాఁడు. ధన్యవాదములు. వీరాభిమన్యా! నీకు ధన్యవాదములు. సకల భారతవర్షమునకుఁ బ్రళయకాలపర్యంతము నీ వొక్క—డవే వీరుఁడవు. నీకన్న వీరుఁడు భూతభవిష్యద్వర్తమానకాలం బుల జనింపకుండును గాక! జయ్— వీరాభిమన్యుకీ జయ్.

ఉ. భారతమాత! నీ కడుపు ♦ భారము పెంపఁగ బుట్టినార లీ
క్రూరు లధర్మవృత్తిని ♦ ఘూర్ణిల నేడ్వఁగఁజేసి వీరులా
వారల కెల్ల నేఁడు తల ♦ వంపు ఘటించిరి వీరినింతతో
మారణముం బొనర్చి యభి ♦ మన్యుని మాన్యుని నుద్ధరింపవే.

(ప్రస్థానము)

(రక్తసిక్తాంగుఁడై ఆయాసమునఁ దూలుచు)

(అభిమన్యుఁడు ప్రవేశము)

అభి : ఓరోరీ కౌరవ పశువులారా! ద్విపాదపశువులారా! ఛీ! పాఱు బోతులారా! పిఱికిపందలారా! కౌరవులనన్న నేనూ యెంచు కొంటిని. మీరింతటి పిఱికివారలా? మిమ్ముల నను జంపుటకేనా పితరు లంతంత ప్రతిజ్ఞలు పట్టిరి? నేఁడు వారి ప్రతిజ్ఞలే మిమ్ము రక్షించెను. కానిచో మిమ్ములను ప్రేతములను నేఁడు తునకలు గావింపకుందునా? (దూరమునఁ బరికించి) ఆ! ఇంకను వెనుదిరిగి చూడక పరుగెత్తుచుంటిరా! ఛీ! ఛీ! సింహగర్భమున కెంతటికళంకముఁ దెచ్చితిరి? భరతమాతా! యిట్టి పాఱు బోతుల వలననేగదా నీకళంకము గలుగుట—స్వాతంత్ర్యమం దను రాగము, మాతృభూమిపైఁ బ్రేమ, పరాభవమునందు లజ్జ విసర్జించిన నీచులను—దైవమా! మా భరతమాత కడుపునఁ బుట్టింపకుము—

(సుధర్ముఁడు ప్రవేశము)

సుధ : బాబూ! బాబూ!

అభి : ఏమిరా అది సుధర్మా?

సుధ : బాబూ! మీరింతవఱకు క్షేమముగా నుంటిరిగదా! పోనిండు బాబూ! నా కిదియే చాలును. ఈ పాపపుఁగన్నులతో మీ దురవస్థఁ జూడకుండ నా ప్రాణములు వెళ్ళిపోయిన చాలును. పాపాత్ములు పదుగు రేకమై మన రథమును విఱుగఁగొట్టి యశ్వములను జంపి, నన్ను నేలఁగూల్చి చచ్చితినని తలంచి వెడలిపోయిరి. నేనంత మూర్ఛదేరి నా ప్రాణములు పోకముందు మీతో మాటలాడవలయునని యతికష్టప్రయాసమున దేకుచు వచ్చితిని, బాబూ! ఇంక నా శాయువు తీరినది. నా యపరాధము లున్నచో క్షమింపుము.

అభి : సుధర్మా! సుధర్మా! ఇటుచూడుము. నీచేతికిఁ గట్టుకట్టెదనుండుము. నీకు భయములేదు.

సుధ : బాబూ! యింకెక్కడి కట్టు! ఇం కెక్కడి బ్రతుకు కడవలతోఁ గుమ్మరించునట్లు రక్తము గారిపోయినది. మిమ్ములఁ జూచు నాశచే నింతవఱకు—అబ్బా! అబ్బా! బాబూ! జాగ్రత్త! తిరిగి కుక్కలు కఱచినగలవు. రణమంతయు నెత్తురు టేరైనది. మీరు జాతి పెదలేమో! పాండు కుమారులకు— బాబూ! తగిన పుత్రుఁడని — సుభద్రాదేవి మాట — బాబూ ఏదియో చెప్పుచుంటిని. నా తల తిరుగుచున్నది. నీకిదే నమస్కారము—బాబూ! శిశుత్వము నుండియు నీకు సేవకుఁడనైన విశ్వాసమునకు... హా! హా! అయోమయముగా నున్నది. బాబూ! సెలవు. కౌగిలులు ... జాగ్రత్త ... తుంటరులు ... బాబూ!... నారాయణ ... నారాయణ (మరణించును)

అభి : సుధర్మా! సుధర్మా! అయ్యో! పోయినాడు, అయినది. ఆ రవంత గాలియు పోయినది. అన్యాయముగా మా రాజ్య మాక్రమించిన దురాత్ముల నాశనమునకై — తన రక్త ప్రాణములను సంపూర్ణముగా రణస్థలంబునకు ధారవోసిన సుధర్మునంటి దేశభక్తులనో తల్లీ! భరతమాతా! వేనవేలుగాఁ గనుము. అహా! నా కొఱకై పోరి ప్రాణములుఁ బోవునప్పుడు సైతము నా కొఱకై ప్రాకులాడి నా పాదములకడ ప్రాణములను విడచిన యీ స్వామిభక్తునకు రవంతయైన సంస్కారమైన చేయలేకుంటిఁగదా?

మ. పరమానందమునన్ స్వరాజ్యమునకై ♦ ప్రాణంబు లర్పింప భీ
కర రక్తాంబుధి నోలలాడి తనుచేన్ ♦ గాయాలుగా నాడు పా
దరజస్సుంబొరలాడి స్వర్గపురముం ♦ దార్కొన్న యీ వ్యక్తికై
న రుణంబైననుఁ దీర్పలేనయితి న ♦ న్యాయంబుఁ గావించితిన్,

హా! హా! నా చేతిపట్టు జారిపోవుచున్నది. ఈ రక్త మెక్కడిదోకదా ఇది శత్రువులదో నాదో? ఎవ్వరిదైనను సంతోషమే కాని—

నాదైనచో మహాదృష్టవంతుండనై యుందునుగదా! ఏమ
నిన—స్వర్గరాజ్య రక్షణమునకై యెన్నోకు తెసరక్తబిందు
వుల నెన్నింటిని ఈభూమిపై వదలితినో నాఁడసన్నసత్త్వరసము లీ
భూమిపై కీర్తి శరీరము ధరించి బ్రతికియుండును. నా శరీ
రము నయితము బలహీనమగు చున్నట్లున్నది. ప్రాణములు
పోకమున్నే కొంచెపులను రణమునకు బలియిచ్చుట మంచిది
కదా! అన్నట్లు వానిచేఁజిక్కకుండ నా పంచెలగా పాఱిపోయిరే
రే! కురుకులావమాన కారణభూతులారా! మీరింతవఱకు దేని
నాశించి పాఱిపోవుచుంటిరి? శరీరమునా? అది మట్టిముద్ద!
ప్రాణమునా? అది పట్టిగాలి. ఇవే శాశ్వతము లని మీరు
తలంచితిరా?— శాశ్వతమైనది కీర్తి—మీ పాపములు గుణ
ములో—నా కీర్తి నశించుచునే యున్నది. కాదా—ఏమి! నా
మాటలే మీ చెవి కెక్కుటలేదా! సరి కానిండు. నా శరం
బులనుండి మీ రింకెప్పుడు దప్పించుకొని పాఱిపోఁగలరు?
నేఁడు భారతయుద్ధము పరిసమాప్తిగా నున్నదని యెఱుఁగరా!
(పడిలేచి) ఆ ఏమిది? ఈ శవములు నా కాళ్ళకేఁ దగులు
చున్నవిఁ అయినను పాఱిపోవుచున్న యీ శవములకన్న మర
ణించిన నీ శవములే యుత్తమజీవములు. ఆహా! నాకేమియుఁ
గనబడుట లేదు. ఈ రక్తపు మడుఁగులలోఁ గాలినడకనే
పోవలయునా? నా రథ మేది? సారథి యేఁడీ! ఆ—అవునుగదా!
ఆ తులువలు నా రథము విఱుగఁగొట్టి సారథినిఁ జంపిరి
గాదా—పోనిమ్ము... రథములేకున్న నేమి? దీనివలనఁ
గౌరవులకు కళంకమని భారతచరిత్రము శాశ్వతముగా లిఖింపఁ
బడును. ఈగద చేతిలో నున్నంతవరకును భయము లేదు.
ఎడమచేయి యేమియు పనిచేయుటలేదు. ఆ వచ్చునదెవ్వరు?
ఓహో! వీఁడు దుశ్శాసనునికొడుకు. రానిమ్ము. నాకు పోరా

మాట కీసుజోధు గా నుండును— కాని—వీని కిదేమి వెఱ్ఱి! పెద్దవారు
పరుగెత్తుచుండ వీఁడా జయించువాఁడు ?

(దుశ్శాసనుని ప్రవేశము) (అనుబంధము 44)

అభి : ఓరీ దుశ్శాసనా ! నీవా ? రమ్ము రమ్ము. నీ తండ్రులు పారు
బోతులైనను నీవైనను వంశగౌరవమును నిలిపితివి.

దౌశ్శా: ఓరీ ! నేనునీతో వృథా వాదమునకై రాలేదు. సమరణం
బిమ్ము,

అభి : సరేరమ్ము. నీకు సమరణంబు నిచ్చుటకే సిద్ధముగా నుంటిని.
(అద్దఱును గొంతసేపు గదలతోఁ బోరి తుదకు ముష్టి యుద్ధ
మొనర్చి ఇద్దరును నేలఁ గూలుచున్నారు)

(ఆకాశమున)

బృందారక బృందముసారా ! అవధారు ! వీరజ్యోతి యగు నభిమన్యు
కుమారుని కెదురుకో లాసంగవలయును, అసంఖ్యాకము
లగు పుష్పమాలికలతో సిద్ధముగా నుండుఁడు. గరుడగంధ
ర్వాంగనలు కాహళంబులు ప్రయోగింపుఁడు.

సైంధ: (ప్ర) ఛీ—ఏమి యీ పాడు దేవతల యానందము. ఇంద్రుని
మనుమఁడని వీరికి యభిమానము. కానిమ్ము. దౌశ్శాసనాభి
మన్యులిద్దరు పోరి కూలినారు. అభిమన్యుని కింకను
గొన ప్రాణము లున్నటులున్నని దేవిమొదుటఁ జేసినప్రతినఁ
జెల్లించుకొందును. దగ్గర కేగిన నేమిచేయునో — దూరమున
నుండియే యీ బల్లెముతోఁ బొడిచెదను. (అట్లు చేయును)

అభి : రే! సైంధవ చండాలా ! ఎంతపనిఁ జేసితివిరా ! చచ్చితివి
నిలువుము.

(అని లేచి పోడఁబోఁగఁ గౌరవులు నలువంకలనుండి
ప్రవేశించి అభిమన్యుని నణచిపెట్టి చంపుచున్నారు)

తెరబద్దలయి భరతమాత ప్రత్యక్షము.

(సంజయుఁడు భరతమాత పాదములకడ నిలచి)

సంజ : తల్లీ ! భరతమాతా ! ఏమిది ? ఎంతఘోరము ! ఎంత దారుణము ! దేశద్రోహు లగు కౌరవుల యభ్యుదయమును, మహా వీరశిఖామణి యగు నభిమన్యు మరణమును—నీ కన్నులకానందముగా నున్నవా తల్లీ !

భర : సంజయా ! విచారింపకుము ఈ దేశద్రోహులు శీఘ్రకాలములో నశింతురు. హిందూదేశమునకు ధన్యకృపాంగులనురాగలదు -- అభిమన్యు మరణమునకు నీవు చింతింపవలదు. ఈతఁడెన్ని రక్తబిందువులను నేలరాల్చెనో యందరభిమన్యులుముందు జన్మించి నన్నుద్ధరింప నున్నారు.

కీర్తన.

(మానసాహాయ కారీమురారీ వలె)

ధన్య వీరాభిమన్య కుమారా – జగ
మాన్య భారతవర్ష కుమారా! ॥ధ॥
వీర రక్తంబె ప్రేమాస్పదంబో దిగ్విజయము
ము భారతంబునం దిడక ॥ధ॥

(విశ్రాంత సంకేతమగు యవనిక మెల్లగా జారును.)

ఇది చతుర్థాంకము

పంచమాంకము

పాండవ శిబిరము:—దుఃఖితులగు ధర్మ, భీమ, అర్జు,
కృష్ణ, ఘటో, సుభ, ద్రౌప, ఉత్తర, (ప్ర)

అందఱు— (అనుబంధము 43)

అర్జు : బావా ! సర్వజ్ఞుఁడవు– నీ వెఱుంగనిది గలదా ? "యుద్ధమున నేదియో యలజడి కలిగినదయ్యా" యని పలుక నేదియో కారణముఁ జెప్పి నిలిపితివి; కాని నా కొకింత చెప్పియుండిన నా కుమారుని నేను జంపుకొందునఁటయ్యా ?

కృష్ణ : బావా ! ఎంత వెఱ్ఱివాఁడవు అభిమన్యుఁడు నీకొకటియు నా కొకటియునా ? నీకుఁ గుమారుఁడైన నాకల్లుఁడు గాఁడే ! తెలిసి యుండిన నిన్ను నిలుపునంతటి క్రూరుఁడనా ?

అర్జు : సరి– దానిని పోనిమ్ము. ఘటోత్కచా ! బాబు విక్రమ కథనమును తరువాయి వినఁగోరు చున్నాను.

ఘటో: ఔను. కొంతవరకు విని తరువాత విచారమున మునింగితిరి.

అర్జు ! అవు నవును. తరువాత నేమైనది.

ఘటో: తరువాత నేమున్నది ? అనేకాక్షౌహిణీ సంకులమగు సైన్యము నొక్కచేతితోఁ జంపి, తమ్ముఁడు తుదకుదౌశ్శాసనునితోఁగలసి మెలసి పోరాడి వీరస్వర్గముం జేరెను.

అందఱు:హా ! లోకైకధనుర్ధరా ! హా ! జగదేకవీర ! (ఆక్రందింతురు.)

అర్జు : హా ! కుమారా ! నిజప్రతాపవిజిత శివకుమారా ! పెద్దవాఁడవై నీవేమో నన్నుద్ధరింతు వనుకొంటిఁ గాని నా కింతలోఁ గడుపునఁ జిచ్చుఁ బెట్టి పోయెదవని తలంపనైతినిరా! తనయా!

ఆ॥ శిరము తెగసినపుడు ♦ సింహనాదములు వి
న్పడినయపు డిదేమి ♦ ప్రళయమన్న

మదినెటింగినీదు ♦ మరణంబుఁదెలుపక
గొంటెకృష్ణుఁడింత ♦ కొంపఁదీసె

ధర్మ : హా ! భరతకులాధారా ! వీరాభిమన్యుకుమారా !

సీ. శిశుపాల కంసాది ♦ పిశితాశనులఁద్రుంచి
రాణఁజెందిన వాఁడు ♦ మేనమామ
బకజరాసంధులఁ ♦ బరిమార్చినట్టిగం
భీర విగ్రహుఁడు నీ ♦ పెద్దతండ్రి
కాలకంధరుని సం ♦ గ్రామంబున నదల్చి
గణుతిఁగాంచిన వాఁడు ♦ కన్నతండ్రి
వదేకిరీట సం ♦ దీప్త పాదతలంబు
దారమా నసుఁడు నీ ♦ తాతయుండు

ద్రోణముఖవీరకోటిని ♦ దురమునను బ్ర
కంపితులఁ జేసినట్టి భీ ♦ కరుఁడ నీవు
పాపులకుఁజిక్కితేతండ్రి ! ♦ భయదసింహ
శాబ మురులఁ దగుల్కొనిఁ ♦ జమునినట్లు

ఇందఱి ప్రాణములలోని ప్రాణమవై, స్వచ్ఛంద ప్రతాప శాలివై, దురంత రణంబున ద్రోణాదుల నన్నుఁ జూచిన శూరుండవై, నాతండ్రీ! దిక్కులేక సంగ్రామమునఁ గూలితి వా?

కృష్ణు : పెద్దబావగారు ! మీరు ప్రాజ్ఞులు. దుఃఖింపఁగూడదు.

ధర్మ : అయ్యయ్యో ! నా ప్రాజ్ఞత యంతయు ధర్మలోభమున విని రొంగపడి యింత ముప్పునకుఁ గారణమయ్యె. చేఁ జిక్కిన దుర్యోధనాదులను బాబు చంపుచుండఁ బ్రతిజ్ఞల జ్ఞప్తికిఁ దెప్పించి చావనున్న శత్రువుల కాయువుఁ బోయించితిని.

అర్జు : హా ! మా ప్రతిజ్ఞలు శత్రుజీవములకు మారు పుత్రజీవము లను హరించెనా ! హా ! హా !

ద్రౌప: అమ్మాయీ ! సుభద్రా ! చూడు. ఉత్తర మతిలఁ గన్నులు విచ్చుచున్నది. తిరిగి శోష వొడముసేమో !

ఉత్త- (అనుబంధము 50) (దుఃఖించుచుండును)

చ. అరిగితిరే! మము న్విడచి ♦ హా! జగదేక పవిత్రశీల! మీ
సురుచిరమంగళాంగమును ♦ జూడగఁ గన్నులు మండి దైవమా!
సురపురిఁజేర్చెనే మిము వ ♦ సుంధరనాగతి నేమి సెప్పి మీ
రరిగితి రింకది క్కెదర ♦ మందలి పిండమ ప్రాణనాయకా!

ద్రౌప: చెల్లెలా! సుభద్రా! ఉత్తరనూరార్పుము. అతిమాత్రముగ నాబాలికగుండె బగిలిన గర్భస్థమగు పిండమున కేమి కీడు వాటిల్లునో? .

ఉత్త: అత్తా! నాకింకెక్కడ యూరట? ఇంకెక్కడి బ్రతుకు? ఎవరి కొఱకు బ్రతుకవలయు? మాంగల్యము మాసిపోయిన తరువాత నేను బ్రతికినను. చచ్చినను నొక్కటే!

అందరు:హరి హరీ- హరి హరీ !!

సుభ: అమ్మా! దుఃఖింపకుము. మనకందఱకును నీ కడుపులోనున్న చిరాయుపిండమే దిక్కు.

అర్జు: హా! ఎక్కడియాశ? చేయియెత్తుకుమారుఁ డింతయక్కఱకు వచ్చెను! ఇంక నీ చిరాయు పిండము దిక్కగునఁట.

ద్రౌప: ఎంతమూఢతయో యీ సుభద్రకు? వలదు వలదనుచుండ కుమారు నంపి యింత తెచ్చినది. ఎంత వీరమాతయయిన గాయముచేఁ గదలలేని వానిని, బూర్ణముగా పద్మవ్యూహమును ఛేదించు టెఱుఁగని వానిని, రణరంగమున కంపుదురా?

ధర్మ: దేవీ! ఒక్క సుభద్రయే కాదు. ఇందు నేనును సమానముగ నే ద్రోహ మొడిఁగట్టికొంటిని, హా! అభిమన్యు! అభిమన్యు!

కృష్ణు: బావగారూ! అసని కాయుర్దాయము లేనప్పుడెవ్వరు రక్షించినమాత్రము బ్రతుకునా? ఒకని మృతికి మనము కారణమనుకొనుటకన్న వెఱ్ఱిలేదు.

అర్జు: అయినను సర్వధర్మవేత్తలయిన యుధిష్ఠిర మహారాజుగారి కీమాత్రము-తెలియకపోయెనా? వ్యూహభేదనమును పూర్ణ

ముగా నెఱింగని వానిని పంపుదురా ? హా ! వీరాభిమన్యు
కుమారా !!

భీము : అందులకుఁ బాపాత్ముండనగు నేనుసిద్ధపడితినో గదా యయినా ! "కుమారుఁడు భేదించిన మాత్రముచాలును, మేము వెనుక నుండి రక్షింతుము" అని పలికితిమిగాని, వ్యూహముఖంబుననే సైంధవుఁడడ్డుపడుటచే నింతదుస్థితికి పాలుపడవలసెను.

అర్జు : హా ! హా ! నా కుమారుని చావునకుఁ గౌరవులేకారకులుగావలసి వచ్చెనే ? పదునారేండ్లబాలుఁడే ? ఒకరికిఁ బోరునకుఁ జాలఁడే ? ఆహా ! కాలమహిమ ! ఊరకుక్క యుగ్రశార్దూలముకాలు గఱచినట్లు పిరికిపందయగు సైంధవునకెక్కడిది విక్రమము ? హాహా ! కుమారవీరా ? వీరాభిమన్యుకుమార ! సంగ్రామమున దిక్కులేక పడియుండి నన్నును, మామను దలంచితివో ? (ఆలోచించి) ఛీ ! ఛీ ! ఏమని పలికితిని ? అర్జునకుమారుఁడు, వీరాభిమన్యు కుమారుఁడు సంగ్రామమునఁ బ్రవేశించి యొకరి సహాయముఁ గోరునంతటి నీచతకుఁ బాల్పడునే ! కృష్ణ ! కృష్ణ ! గీతలుపదేశించి నన్ను యుద్ధమునలంపి, నా కుమారుని జంపితి వటయ్యా ! బావవైయుండి నీవు నాకు చేసెడియుపకార మిదియేనా ?

సుభ : చిన్నన్నయ్యా ! చిన్ననాఁటినుండియు భుజములు గాయలు గాయ నెత్తుకొని తిరిగితివే ? ఆ నీ మేనల్లుఁడేఁడయ్యా ?

కృష్ణు: సోదరీ ! నీవు దుఃఖింపఁగూడదు. ఇట్టికుమారునకుఁ దల్లివైనందులకు గర్వింపవలెను.

గీ. ఒంటి నక్షోహిణులంగూల్చి ♦ నుక్కమీఱి
ధీరమతులడలిన జగ ♦ దేకవీరుఁ
గన్నతల్లివి, వానికై ♦ గర్వమందఁ
బోలునేకాని దుఃఖింప ♦ బోలదమ్మ

ఉత్త : హా ! ప్రాణేశ్వరా ! హా ప్రాణేశ్వరా !!

సీ॥ కరములు గంపింపఁ ♦ జెఱుత చెమ్మటబొట్లుఁ
గలఫాలమునఁ దిల ♦ కంబుఁదీర్చి
కవచంబు నెమ్మేన ♦ సవరించి, శిడము నం
బులను చాపంబును ♦ బొందుపఱచి
సెలవా యటంచు సూ ♦ చించు జాలినినించు
ప్రణయేక్షణంబులఁ ♦ గాఁజూచి
విడలేక కన్నుల ♦ వెంటనీరునునించి
కౌగిలింతల నల్ప ♦ కాలమణఁగి
మగల నెపుడో యంచు ♦ మనసార నీపాద
రజము తలనుదాల్చి ♦ ప్రక్కనిలువఁ
గలత దీర్చినన్ను ♦ నిలువెల్లఁ జూచితి
వదియె దుదివిలాస ♦ మయ్యె మనకు.

ద్రౌప: సుభద్రా ! నీవే యేడ్చి పసిదానిని గుండె పగిలింపకుము. ఉత్తరా ! ఊరకుండుము. పోయినవారికొఱ కేడ్చినచో వారి కుత్తమగతులు కలుగవు.

ఉత్త: ఆయుఁకు మాత్రమే యుత్తమగతి కలిగి నాకీ దుర్గతియేల ? అత్తా ! నేనును ఆయనతోడనే యేగి సద్గతి నందుదును. చితిఁబేర్పింపుడు.

అందఱు: నారాయణా—నారాయణా—

అర్జు: అకటకటా ! ఎంత సౌందర్యశాలి, ఎంత పరాక్రమశాలి, ఎంత సద్గుణశాలి, ఎంత పితృవాక్యపరిపాలనవినయధురీణుఁడు, నేలపాలై పోయెనయ్యా ! భీభత్సమైన సంగ్రామమున నాల్గు వంకల రాకాసులుమూగ దిక్కులేక కరఁమఁగట్టి నెత్తుటితో నా కుమారుఁ డెట్లుపడి యుండెనో గదా ! హా ! వీరాభిమన్యు !

(తెరలో)

దేవా ! యుధిష్ఠిరమహారాజా ! వీరాభిమన్యు కుమారుని కగ్ని సంస్కార పదార్థములను సేకరించి నకుల సహదేవులింక మీరు రావచ్చునని తెలుపుచున్నారు.

ధర్మ : దేవీ ! ఉత్తరా సుభద్రలను లోనికిఁ గొనిపొమ్ము. మేమింక బాబు స్మశానమున కరిగెదము.

అందఱు: హరి! హరీ! హరి! హరీ!

ద్రౌప: అమ్మా ! ఉత్తరా లెమ్ము పోవుదము లెమ్ము.

ఉత్త : అయ్యయ్యో ! నేనింక నెక్కడకు రావలయును ? ఉత్తమ పతివ్రతకు నాథునితోడిదే లోకము కాదా ! నన్ను నా నాథుని నుండి వేరుపరచి మీరెక్కడకు లాగుకొని పోయెదరు ? అత్తా ! నీవైనను జెప్పవమ్మా ! హా ప్రాణేశ్వరా! ప్రాణేశ్వరా!
(మూర్ఛిల్లును)

ద్రౌప: సుభద్రా ! ఉత్తర మూర్ఛిల్లినది రావే ! పట్టుకొమ్ము. లోపలకుఁ దీసికొని పోవుదము (ఇద్దఱును తీసికొనిపోవుదురు)

అర్జు : హా ! ఏనాఁడో చేసిన పాపఫలముఁ గాక యింకేమి ? కన్న తండ్రి, పెద్దవాఁడు, మొరడువలె బ్రతికియుండ, నెదిగిన కుమారుఁడు సర్వలక్షణ లక్షితాకారుఁడు, గర్భిణియగు భార్య వెనుకఁ గలవాఁడు చచ్చుటేమి ? ఇక ధర్మమేది ? అధర్మమేమి ? భగవంతుఁడేఁడీ హా ! హా ! పంచాగ్నుల మధ్యమున వ్రేగవచ్చును. సప్తసముద్రముల నడుమ నౌక సహాయమైనను లేకుండ, తలముక్కలగుచున్నను చలింపకుండవచ్చును. దైవమా ? ఈ దుర్భర గర్భశోకమును శత్రువునకైనఁ గల్పింపవలదు. (అనుబంధము 51)

గీ. కమలయుగళము మిాఱిన ♦ కన్నుదోయి
నెలను గేరెడు ముద్దారు ♦ నెమ్మొగంబు
పద్మములు చంద్రుఁడున్నంత ♦ వఱకు మాకు
మఱపువచ్చునె వీరాభి ♦ మన్యు పుత్ర !

ధర్మ : తమ్ముఁడా ! అతిమాత్రంబుగ విషాదంబున మునుంగవలదు. ఘటోత్కచా ! తమ్మునికళేబరము దగ్గరకు దారిఁజూపుము నాయనా !

ఘటో: పితృగులారా ! ఇటు—ఇటు

కృష్ణు: అర్జునా ! దారిఁజూచుకొని నడువుము. మార్గమెల్ల పీనుగల మయముగా నున్నది.

గీ. కదనమందు స్వరాజ్య ర ♦ క్షణముకొరకు
రక్తపుంబొట్లు, బొటబొట ♦ రాల్చినట్టి
దేశభక్తుల క్షేత్రోవ ♦ వాసిఁగాంచు
నదియె మన యభిమన్యున ♦ కయ్యెదారి

(అందఱును నడతురు— తెర లేవఁగా శవములు కనఁబడును)

ఘటో: మీరంగఱును యీ వంకనుండి తొలఁగిరావలెను. ఈ ప్రక్కనున్న శవము లింకను బాణములతోఁ గొట్టుకొనుచున్నవి. అదిగాక యీ వంకఁదమ్మునిచేఁ జంపఁ బడిన వారి నెత్తురు చేత పెద్దమడుగు లేర్పడినవి.

అర్జు: హా ! హా ! ఎంత ప్రతాపముఁ జూపి పోయితివి నాయనా ? హరిసారథ్యముగా లేదు. దేవదత్తములగు దివ్యాస్త్రములా ! లేవు. వయస్సా ! పదునాఱేండ్లు వెనుక దక్షతయైన లేక— ఒంటరిగాడవై—శత్రువులు విల్లువిఱచి, విరథుం జేసినను వారికి సింహస్వప్నమై పోయితివి. నీవంటికుమారుఁడు మంద భాగ్యుండనైన నాకేలఁదక్కును ?

కృష్ణు: బావా ! ధైర్యముఁ దెచ్చుకొమ్ము.

అర్జు: బావా ! ధైర్యముగాక—నాకింక దుఃఖమేమున్నది ?

ఘటో: అదిగో తమ్ముని కళేబరము.

(తెర లేవఁగా అభిమన్యుని శరీరము కనఁబడును)

అర్జు: (ఆత్రముతోఁ గౌఁగలించుకొని) హా ! కుమారా !

(అనుబంధము 52)

నాయనా ! పరిపూర్ణచంద్రశోభాయమాన మగు నీ సుందరవదనారవిందము పిశాచరాక్షస జంబూక సంతతుల కాహారమైపోవ లసి వచ్చెనా ? తండ్రీ ! నాయంతవాడవై నాకుల ముద్ధరింతు

వనుకొంటినిగాని తనయా ! నన్ను దిక్కుమాలిన పక్షిని జేసి వీరస్వర్గమునకుం బోయితివా? భరతవంశము నింతటితో మూల విచ్ఛేదముం జేసిపోం దగునా తండ్రీ ! హంసతూలికాతల్పాంతరమును- నుత్తరాంకపాలిని శయనించునీకు - నా తండ్రీ ! ఈ రక్త భీకర ప్రదేశమే పూలపానుపయ్యెనా ? వందిమాగధులు ప్రాతఃసంధ్యల నీ నామములం గీర్తింప మేలుకొనవలసిన వాఁడవు. నీ కీజంబూకార్భాటములే మేలుకొలుపులయ్యెనా ? ఉత్తరను బెండ్లాడి శరీరమున నిండువసంతముం బూసికొని యొక సంవత్సరమైనం గాలేదే ? నీకిప్పుడే యీ వీరవసంతముపై భ్రాంతి వొడమెనా తండ్రీ ! కృష్ణా ! చూచితివా ! నీ మేనల్లుని ? హా ! హా ! దుర్భరము దుర్భరము. ఇంక నాకీ యుద్ధముతోం బనియేమి ? ఈ రాజ్యముతోం బనియేమి ? ఈ విరోధముతోం బనియేమి ? నాకన్న నధికప్రతాపశాలియగు కుమారుండే ? అట్టి కుమారునిం జంపుకొని మొండినై బ్రతికియుంటి? హా. కుమారా !-హా ! కుమారా !

సీ॥ అగరు సంపెగనూనె ♦ లెగరాచి దువ్విన
ముంగురులా యివ్వి ♦ ముద్దుపట్టి !
నిండు పున్నమనాటి ♦ నెలగేరు మాద్దుమో
మా ! యిది మారిస ♦ మాన రూప !
చుఱుకున రిపులపై ♦ శరము లేసిన మృదు
లాంగుళులా యివి ♦ నుంగశాంగ !
హాయిగా నాశ్రమ ♦ వాయముద్దుల నిచ్చు
చెక్కిళులా యివి ♦ చిన్నతండ్రి !

అకట యిచ్చట నీదు ♦ సుకుమార దేహంబు
భూరిరక్తమునను ♦ బొల్పరాక-
వారలుచుండఁగనియు ♦ దునియలుగా జెట్టి
కఠిన మానసంబా ♦ కన్నతండ్రి !

అందఱు: హా! అభిమన్యుకుమార! రూపజితకుమారా!

ఘటో: ఉండండి—ఉండండి. బాబూ పెదవులు కదలుచున్నవి.

అర్జు: ఆ! ఆ! యేమినా చినతండ్రి శరీరమునఁ బ్రాణములున్నవా! నా కంతటిభాగ్యమా!

ధర్మ: ఓ దేవతలారా! మీ రెవరైనఁజల్లగాజూడరా!

ఘటో: మీ రల్లరిఁజేయవలదు తమ్ముఁడు మాటలాడుచున్నాఁడు.

అభి: (కన్నులు దెఱచి క్రొనయూపిరితో) సైంధవుఁడు సైంధవుఁడు (ప్రాణములు వదలును)

అర్జు: ఆ! ఆ! నాయనా! నాయనా! ప్రాణములను వదలుచుంటివా! ఇటుఁ జూడుము! తండ్రీ! నీ ప్రాణములను గాపాడ లేని వ్యర్థుఁడను. నీ తండ్రిని అర్జునుఁడను. హా—హా—ఇంకెక్కడి కుమారుఁడు ఇంకెక్కడి యాశ. యేదియో విషయమును గడుపులో నుంచుకొని నా చిన్నబాబు నా చెవినివేయుటకై క్రొన ప్రాణముతో నుండెను హా! వీరాభిమన్యా!

ఘటో: (స్మృతి నభినయించి) ఆ! చెప్పుట మఱచితిని. రే! దురాత్మా! ఎంత యపచార మొనరించితివిరా! బాబు ప్రాణములు నీ పట్లనెంత తల్లడిల్లుచున్నవిరా సైంధవహతకా!—

ధర్మ: నాయనా! అది యేమి?

ఘటో: విల్లు విఱిగి విరథుఁడై— ద్రోణ్యాసనునితోఁ బోరి నేలబడిన బాబును సైంధవ చండాలుఁడు చాటునుండి బల్లెముతో బొడిచెను.

అందఱు: హా! ఘోరము ఘోరము!

భీము: ఛీ! ఛీ! దైవమా! నీకుఁ గన్నులుకాలిపోయెనా? బ్రతికియుంటివా? చచ్చితివా? దారిదప్పిన హర్యక్షకిశోరము వేటగాండ్ర వలలంజిక్క— దాని నూరకుక్కచేఁ గఱపించి చంపితివా? హా! హా!

అర్జు : (ముందుకువచ్చి) ఘటోత్కచా! ఘటోత్కచా! నాగాండీవము-నాగాండీవము-ఎక్కడ?

ధర్మ : కృష్ణా! తమ్మునకు మతి స్థిరము లేకున్నది. పట్టుకోవయ్యా!

కృష్ణ : బావా! బావా! కుమారునకు దహన సంస్కారముఁ జేయవలసిన యీ సమయమున గాండీవమెందులకు? ఒంటిరిగా నీ ప్రయాణ మెక్కడికి?

అర్జు : (ఆవేశముతో విడిపించుకొని) నన్ను వదలుము.

కృష్ణ: బావా! బావా! నామాట వినుము. ఎక్కడికి?

అర్జు : ఎక్కడికా? కౌరవసైన్య మధ్యమునకు-

కృష్ణ: ఎందులకు?

అర్జు : ఏమీ! ఎందులకా! మహాయుద్ధమున ననేకవేల సైనికులఁ జంపి, చేయి తెగి, రక్తమున మునింగి, నిస్సహాయుఁడై శౌర్యమే ప్రధానముగాఁ గొట్టుకొను పసివానిని, గుక్కనలేఁ జాటునుండి కుంతమునఁ బొడచిన యా సైంధవ చండాలుని వేయి ముక్కలుగాఁ దెగ నఱుకుటకు—

కృష్ణ: ఆ! ఆ! వలదుసుమా! ఇప్పుడు వలదు. నామాట వినుము.

అర్జు : కృష్ణా! నీమాటలింక వినను! విన్నందువలననే చెట్టంత కొడుకుం జంపుకొని యేడ్చుచుంటిని.

కృష్ణ: హరిహరీ! నేనేమిచేసితిని?

అర్జు : ఇంకయేమి చేయవలయును? యుద్ధమునుండి యనేక నేలసిరంబు తెగిరివచ్చి పాదములకడఁ బడుచుండ నింతఘోరయుద్ధ మొనరిదనీ ప్రశ్నింప ద్రోణునిదని యొంకితివి గాని ఎఱిఁగి యుండియు నా కుమారుఁడు పద్మవ్యూహముం జొచ్చెనని తెలుపవైతివి గదా?

ధర్మ : అయ్యయ్యో! ఇదేమిపాపము? పూజ్యుఁడగుకృష్ణుఁ డంత కపటము వహించువాఁడా?

అర్జు : ఘటోత్కచా ! గాండీవ మెక్కడ ? పోనిమ్ము నీకు శ్రమయేల నేనే తెచ్చుకొందును. (పోఁబోవును)

కృష్ణు: బావగారు ! బావగారు ! నీ తమ్ముఁడు నామాట వినుటలేదు. మీరే రావలెను.

ధర్మ : (అడ్డముపోయి) నాయనా ! నాయనా ! ఇదేమి పాపమోయి తండ్రీ నా మాటవినవా ? ఎన్నఁడును మీఱినవాఁడవు గావే ? ఇంచుక శాంతింపవోయి నాయనా

అర్జు : అబ్బా ! అన్నగారూ ! ఆ చండాలులకు మీరు బుద్ధిపూర్వకముగా నాయువు పోయుచున్నారుగదా ! సరే తొందర లేదు. (తెరవంకఁజూచి) ఓహో ! కౌరవసేనా నాయకులారా, అభిమన్యు కుమారవధామరణ బాలిశులారా ! ఈ వార్తను మీ దుర్యోధన మహారాజునకుఁ జెప్పుకొనుఁడు. సమస్త సురాసుర కాండములు రక్షింపవచ్చినసరే హరిహరి పద్మగర్భు లడ్డము వచ్చినసరే, ద్రోణుఁడు సహస్రముఖముల రక్షించినసరే. రేపు ప్రొద్దుగ్రుంకులోపల నా కుమారుని జంపిన సైంధవాపసదు కంఠంబు నీ గాండీవలక్ష్య ప్రహారంబుల నుత్తరించెద. ఇందులకు. దప్పితినేని మాతృ పితృ భ్రాతృగురుద్రోహి యెట్టిదుర్గతులనందునో నే నట్టి దుర్గతుల పాలగుదును. నా కుమారుని నే వధించునంతటి పాపంబునకు లోనై ఘోరనరకబాధల ననుభవించెదను. మఱియు నట్లుసైంధవునిఁ జంపలేనైతి నేని యీ గాండీవముతోడ మహాగ్నికీలలలోఁ బడి భస్మమై పోవుదునఁ

అందఱు:వీరధనుంజయ చంద్రకీ జయ్

అర్జు— గీ॥ ఎవ్వరడ్డుపడినఁ ద్రుంతు ♦ నెల్లిసైంధ
వాపసదు తల చీకటి ♦ పడకమున్న
నందులకుఁ దప్పితేని మ ♦ హాగ్ని శిఖల
దగ్ధమయ్యెద గాండీవో ♦ త్తమముతోడ

ఉ. అంబుధు లింకుఁగాక! విల ♦ యాంతము వచ్చినవచ్చుఁగాక! నా
యంబుజగర్భశర్వులు స ♦ హాయమునత్తురు గాక! ఘోర యు
ద్ధంబున సింధురాజును ♦ వధం బొనరింతు శిలీముఖాళి నో
యంబుజనాభ! నా ప్రతిన ♦ నందఱుమీరు వినుండు పాండవుల్

(అనుబంధము 53) (తెర వ్రాలును)

దృశ్యము—౨

(సైంధవుఁడు, దుస్సల ప్రవేశము)

దుస్స: నా కుమారునిఁ జంపి నీభర్త నాకుఁబుత్రశోకము గూర్చినాఁడు నీ కుమారుఁడు నా భర్తచేఁజంపించి పుత్రశోకముఁగూర్చెద ననినాఁడు నేను సుభద్రతో నంటిని. చిరకాలాభీష్టము నేఁటికి నెఱవేఱినందున మిమ్మింతగా మెచ్చుకొనుచుంటిని.

సైంధ: ఇదిగో! నీవు మెచ్చుకొనుచుంటివా? భళిభళీ! ప్రాణేశ్వరీ! నీకు నేఁడు నేఁటికి నా శౌర్యము తెలియవచ్చినది. సరిగాని నాకు బాకీయున్న ముద్దులో!

దుస్స: ఒకటికాదు. పది యిచ్చెదను. మీరభిమన్యు నెట్లుచంపితిరో చెప్పుఁడు.

సైంధ: హే, హే, హే, హే—ఇందఱు మగపురుషు లున్నారుగాని—ఎందులకు? వాండ్రను చిత్తుగాఁగితములనువలె తగులఁబెట్ట వలెను. నీవు—ఇదిగో! దుస్సలా! వింటివా! నీవు హే హే ఆడ స్త్రీవయినా, నా పౌరుషము, ఊరగకుక్కలవలె పసికట్టితివి.

దుస్స: ఛీ! ఛీ! నీవునేఁడు నా పగతీర్చితివన్న యానందమున నూరకుంటినిగాని, లేనిచో, నీవు త్రాగిన పాడునీళ్ళను గ్రక్కించి నోట మానవపంచితముఁ బోయింపకుందునా? అభిమన్యు నెట్లుచంపితి వని యడుగ నవకతవక ప్రస్తావనము చేసెదవా?

సైంధ: ఓహో! అట్లనా? ప్రాణేశ్వరీ! నా పరాక్రమమును నీకు వినిపింపవలెనని, వచ్చుచుండఁగానే మా బావమఱఁదులు కొంచెము గొంతుతడిచేసినారు. హహ్హహ్హా! ఇదిగో చూడు

మగపురుషునితోఁబాటు ఆడస్త్రీలకుఁ గూడా, యీ గొంతుతడి యభ్యాస మైనచో; ఎంతమజా ? హ హ్హాహ్హా !

దుస్స : ఛీ!ఛీ! కట్టిపెట్టు. క్రమముగా ముదురుచున్నది.

సైంధ: కోపపడకు. కోపపడకు. ఇప్పుడిప్పుడే కైపు కనులలో నుండి, తలప్పై కెక్కి— జుట్టుపట్టుకున్నది. రవంతనిదానముగా చెప్పుమందువా ?

దుస్స : ఊఁ ? చెప్పుము.

సైంధ: అబ్బ ? అంత విసుగెందుకు— త్రాగితిననియేనా ? దుస్సలా ? యిదిగో చూడు త్రాగుడు మనకు జన్మముతోనచ్చిన అసహాయ కరమైన సద్గుణము గాని—

దుస్స : తిరిగి త్రాగుడుమాటయేనా? ఓ కలిపురుష ప్రథమతనూభవా? ఏమియీలాజ్జాహీనత ? (అనుబంధము 64)

సైంధ: ఆ ? ఉండుండు ? నన్ను తిట్టుట కింత కవిత్వము కావలెనా ? ఇంత నియమబద్ధముగాఁ దిట్టవలెనా ?

దుస్స : సరి. చెప్పెదవా ? నిన్నీమంచమునకుఁ గట్టిపెట్టి వెడలి పొమ్మందువా ?

సైంధ: చెప్పెదను— చెప్పెదను. ఉండుండు— దుస్సలా ఉండు. అప్పుడభిమన్యుఁడు రథముపై నెక్కి— పద్మవ్యూహములోఁ జొరఁ గానే దారికి నే నడ్డుపడితిని. అప్పుడు బయట భీమాదులు, లోపల అభిమన్యుఁడు కిచకిచ లాడిపోయిరి. హే, హే, హే,

దుస్స : మేలు మేలు. ఇది శత్రువులకుఁ గొంత పరాజయ హేతువు కావచ్చును.

సైంధ: కొంత యని పలికెదవేమి? అంతయుఁ బరాజయ హేతువే ? తరువాత భీమాదులేమో బింకముఁ జూపఁబోయినట్లు జ్ఞాప కము— కాని నన్ను గెలువఁగలిగిరా? నేనే గెలిచి వారిని కం గారుఁజేసి కాందిశీకులంజేసితిని, అభిమన్యుని ఖాకకు నీయన్న లందఱును పారిపోయిరి. కర్ణుడు గాబారుపడెను, అశ్వత్థామ

పొడలిపోయెను. ద్రోణుఁడు శోకమునుచుకొనెను.

దుస్స : తుదకు మీ రా బాలవీరు నెట్లు చంపగలిగితిరి?

సైంధ: ఏమున్నది ? మన వారందఱును పారిపోయిరి. ఆ బాలుఁడే జయించునట్లు కనఁబడెను. వాఁడు భేదించిన పద్మవ్యూహ మంతయుఁ జికాకయిపోయినది అప్పుడు సంగ్రామసింహుఁడను నేను బయలుదేరి యొక బల్లెముఁదీసికొని—అహోహో. ఇప్పుడు నా చేతిలో నొక బల్లెమున్నచో నప్పు డెట్లు త్రిప్పితినో యట్లిప్పుడు త్రిప్పి చూపియుందునుగదా ?

దుస్స : అక్కఱలేదు. అక్కఱలేదు. ఇప్పుడు కుండలలో గుఱ్ఱములు తోలనక్కఱలేదు. ఇది యెంతనిజమో !

సైంధ: ఆఁ, ఆఁ, నిజమా ? ఇందొక్కమాటయయిన నబద్ధమున్న నేను చచ్చినంతయొట్టు.

దుస్స : బాగు. శుభసూచకముగానున్నది. తరువాతి కథ కానిమ్ము.

సైంధ; ఇంక కథయేమున్నది ? వాఁడు కథావశేషుఁడే అయిపోయి నాడు. ఇదిగో! దుస్సలా! ఆ బల్లెము తీసికొని అభిమన్యు నెన్ని పోటులఁ బొడిచి చంపితినో లెక్క లేదు.

దుస్స : ఆహా ! కర్ణానందమయ్యెను. ఇప్పుడు వాఁడు వ్యగ్రముగఁ జచ్చినట్లే గదా ?

సైంధ: ఓ చావ కేమి ? ఈ సైంధవ వరప్రసాద వీరశిఖామణిగారి బల్లెపు పోటున కా పిల్లవాఁడింకను బ్రదికియుండునా ? చచ్చి పోయినాఁడు. కర్రయిపోయినాఁడు మన్నయి పోయినాఁడు. హే, హే, హే, హే, హే.

దుస్స : కౌరవశ్యాలకుండవగుట కిప్పు డర్హుఁడనైతివి.

(అనుబంధము 5గ)

సైంధ: హే, హే, హే. నాముద్దులో మఱి.

దుస్స : ఉండండి ఎవరోవచ్చుచున్నారు.

సైంధ: ఎవరును లేరు సమయాసమయ విచారము లేకుండ వచ్చు పానకములోని పుడకలను వెడలఁగొట్టు. రానీయకు.

(తెరలో)

అమ్మా! గూఢవార్తాహారిని. అత్యవసర వార్త యొకటి గలిగి వచ్చితి. మన్నింపవలయును.

సైంధ: అత్యవసరము లేదు—అల్పావసరము లేదు. పో - పో.

దుస్స: తప్పుతప్పు. గూఢచారుల నట్లు నిరాకరింపఁగూడదు. ఓరీ! ఇటురమ్ము.

సేవ : (ప్రవేశించి) దేవా! దేవీ! నమస్కారములు.

సైంధ: నీమాట యేదో రెండక్షరములలోఁ జెప్పిపోకపోతివా బుర్ర బ్రద్దలుకొట్టెదను.

దుస్స: (సైంధవునిజూచి) ఏటికీ వదరుఁబోతుతలము? (సేవకునిఁజూచి) ఓరీ! నీవువచ్చిన పనియేమి? సావకాశముగాఁ జెప్పు.

సేవ : దేవా! కురుయోధులు చంపఁగాఁ గొనప్రాణముతో నున్న యభిమన్యుని తమరు—

సైంధ: చాలు. చాలు. నీవు చెప్పవచ్చినది నాకుఁ దెలియును. పోపో.

దుస్స: ఏమీ! అభిమన్యుని నెవ్వరు చంపిరి?

సైంధ: ఒరీ! తులువా! నీ విచ్చటనుండి కదలమన్న కదలవేమిరా? ఇక్కడనుండి లేచిపో. ఊఁ లేవవేమి?

దుస్స: ఓరి! అభిమన్యుని నెవ్వరు చంపిరి?

సైంధ: ఓరీ! అవిధేయుఁడా! రణభేరీ మ్రోగినది. వినబడలేదా? వెడలి పొమ్ము, మాకిప్పుడు గూఢవార్త లెఱింగింప నక్కఱలేదు. పొమ్ము. పోవేని గొంతుకఁ గోసెదను.

దుస్స: ఓ సైంధవ వీరశిఖామణీ! తొందర పడకు. అల్పసేవకునిపై నధికార మేమి చూపెదవు? నీ దంతములు బయలు పడు చున్నవి! నోరు కట్టుకొనుము. గూఢచారీ! చెప్పవచ్చినది పూర్తికానిమ్ము,

సేవ : అమ్మా! ప్రభువుగారు—

దుస్స : ఛీ! ఛీ! ఇంకనీపిటికి పందను ప్రభువుగా రనుచున్నావా? అభిమన్యు నెవ్వరు చంపిరో చెప్పు.

సేవ : దేవీ! విల్లువిరిచి విరథుంజేసి మన యతిరథు లాతనిఁ జంపి వేసిరి కొనప్రాణములతో నుండఁగనో ప్రాణముపోయినతరు వాతనో జయద్రథరాజుగారు బల్లెముతో నాబాలుని పొడచి రని పార్థుఁడువిని శోకక్రోధాక్రాన్త చిత్తుఁడై ముండిపడి ప్రొద్దు గ్రుంకకుండ ప్రభువుగారిని చంపెదననియుఁ జంప లేకున్న గాండీవముతో నగ్నిలోఁ బడెదననియుఁ బ్రతినఁబూనెను నాఁడఁట

సైంధ: హెహేహే..పట్టెది పట్టెది. ప్రాణేశ్వరీ? నీవు త్రాగివచ్చి యబద్ధములు చెప్పుచున్నాఁడు.

దుస్స : ఛీ!ఛీ! ప్రేలకుము. త్రాగినది నీవా -వాఁడా? కూళాచారీ! ఈ వార్తను మా పెద్దన్నయ్య కెరిగించి యింటఁగొనిరమ్ము.

సేవ : భాగ్యము. (ప్రస్థానము.)

దుస్స— (అనుబంధము 56)

ఛీ!-ఛీ! లజ్జాదేవి నిన్నింత స్వేచ్ఛగా విడిచినది. ఓ త్రాగుబోతా? సంగ్రామసింహుఁడనని డాబులు ప్రేలితివి. ఇప్పుడు గ్రామ సింహుఁడవయితివేమి? విల్లువిరిగి పరిధ్వస్తుఁడైన శూరుని ప్రాణావశిష్టుని చాటుననుండి బల్లెముతోఁ బొడిచితివా? ఆహాహా! నీ ప్రతాపము. ఆ పార్థుఁడు నిన్ను నిత్యము నోరు ముక్కుగాఁ గోసి యుప్పులో నూరవైచి యొకసంవత్సరమునకు ప్రాణముఁ దీసినను పాపమున్నదా?

సైంధ: దేవీ? ఆగ్రహింపకుము. చావు బ్రతుకులపై నున్నవాని నింక సాధించుటేమి? జరిగినదేమో జరిగినది. నేను నీతో నన్నృతములు చెప్పలేను. త్రాగినను తెలివిగనే మాటలాడితిని. నేను జంపుట నిజము వాడు జచ్చుట నిజము. ఇఁక నన్ను

పోనిమ్ము. ఆలస్యమైన నాపాడు పార్థుండు అడవిపందివెంటఁ బడ్డ కిరాతకునివలె నావెంటఁ బడకపోఁడు.

దుస్స : ఇప్పుడు నీవుపోవుటెక్కడికి ?

సైం : అయ్యో! ఎక్కడికని యింకను నన్నాలసింపఁ జేయుచున్నావు. నన్ను నిరోధింపకుము. ప్రొద్దుగ్రుంకులోపల నర్జునుఁడునన్ను జంపకపోఁడు. ఈ పాడుగుడ్డలు విడచి నారకములో గడ్డము, కాషాయవస్త్రములఁ దగిలించుకొని జై పరమేశ్వరా ! యని యే యడవులకో పోయి తల దాచుకొందును.

దుస్స : ఛీ! ఛీ! ఛీ! ఛీ!

సైం : ఆ!ఆ. అప్పుడే చింకిచేటలు కట్టకు. తుదవఱకు విను. ప్రొద్దు గ్రుంకులోపల నేను కనఁబడనిచో పార్థుఁ డగ్నిలోఁ బ్రవేశించును. అదివిని పాండవులందరు చత్తురు. నీ యన్నకు హే హే హే హే-ప్రాణేశ్వరీ ! నీ యన్నకు నా మూలమున విజయము సులభముగాఁ గలుగును- వింటివా ! ఇది మంచియుపాయము.

దుస్స : ఛీ! పిఱికిపందా ! ఇప్పుడు నీభార్య ననిపించుకొనుట నాకెంత హీనముగా నున్నది. వీరరసప్రధానమైన భరతకులంబును జెరుపఁబుట్టి వీరలోకమున కప్రతిష్ఠగా విజయునకు భయపడి యడవులకుఁ బాఱిపోయెద మనుకొంటివా ! ఇట్టి పిఱికిపందవు నీ వడవులలోనైన బ్రతుకఁగూడదు. రమ్ము గొంతుకఁగోయుమని ప్రార్థించి నేనే నిన్ను- పార్థునికడఁబడవైచెదను. శూరుఁడైనవాఁడు సంగ్రామమున వెన్నీయక శత్రువులఁజంపవలయుఁగానిచో చావవలయు. ఓ నిర్భాగ్యుఁడా ! నీయట్టి సన్యాసులు పదుగురు జన్మించిన భరతమాత సౌభాగ్య మడుగనా ! ఛీఛీ !

ఉ. భారతమాతృ గర్భమున ♦ పందలు నీవలె నుద్భవించి దు
ర్వార భుజాబలాఢ్యుల ♦ పర్మాకమముంగని భీతినంది యే
తీరుననైన మోసమున ♦ ధీరులప్రాణముఁ దీయుచుండునీ
కీరితియెల్ల భారతికిఁ ♦ గేవల మింకఁ గళంకమేగదా ?

సైం : ప్రేయసీ! నీ పాదములతోడు నీతోడు నన్ను తిట్టకు—నీ కాళ్ళు వదలను— (పాదములు పట్టుకొనును.)

దుర్యో:(ప్రవేశించి) (అనుబంధము 57)
ఓహో! బావగారా! ఏమిది మా చెల్లెలుకాళ్ళు పట్టుకొనుచున్నారు?

దుస్స: అన్నయ్యా! ఇంక పిఱికిపందను బావగారని యేల పిలచెదవు? విల్లువిఱిగి యసహాయుండై చావసిద్ధమైన ముక్కుపచ్చలారని బాలుని చాటునుండి పొడిచిన శూరుండు—ఇప్పుడు పార్థునిచే నీతనికిం బ్రాణభయమని యడవులకుం బారిపోవ నెంచిన శూరుండు—నీకు బావయనుట యప్రతిష్ఠ.

సైం : అనమను—ఆమాట బావననమను— హేం హేం హేం హేం హేం

దుర్యో:ఛీ! ఛీ! ఎందుల కీనవ్వు! ఏడ్వలేకపోయితివా! పార్థునకు భయపడి పాఱిపోనం దలంచితివా? మేమందఱ మేమైతిమను కొంటివి? ఇంక నీ విషయము నన్నేల యడుగవలయు?

సైం : బావా? అందులకుంగాదు. నీవుండగ నాకేమిభయము? గాది క్రింది పందికొక్కువలె బ్రతుకలేక పోవుదునా? అదిగాదు. నే నడవులలో దాగినచోం బొద్దు గ్రుంకినతరువాత నెను ప్రతిజ్ఞ వ్యర్థమైపార్థుండునుపార్థునితోం బాండవులునుచచ్చుగదని చెప్పితిని—

దుర్యో:చేయందగిన మంత్రాలోచనమంతయు ద్రోణాచార్యులవారిదివఱకే చేసియున్నారు. ఇప్పుడు నీ సహాయ మక్కఱలేదు. నా వెంటరమ్ము. అమ్మాయీ! నీ నంగళపుగమున కగుగుము—

దుస్స: అన్నా నా మాంగల్యము నెట్లు కాపాడెదవో?

దుర్యో:భీతిల్లవలదు. జయద్రథుని ప్రాణముల కేభయము లేదు - బావా! రమ్ము— (అనుబంధము 58)

(తెరవాలును) (అందరు ప్రస్థానము)

(పాండవ శిబిరమున—విచారముతో సుభద్ర ప్రవేశము)

సుభ : ఎంతదురవస్థ గలిగినది? పోయినకుమారునికై విచారింపనా? భర్తగారి సాహసమునకే యేడ్వనా? ప్రొద్దుగ్రుంకు లోపల

సైంధవుని జంపలేకున్న సగాండీవముగా నగ్నిప్రవేశమగుదునని భర్తగారు ప్రతినఁ దాల్చిరి. అదివిని కౌరవులు సైంధవు నెచ్చటనో దాచిరని తెలియవచ్చినది. ప్రొద్దు గ్రుంకవచ్చినది దుస్సలా! నీ ప్రతినయే నిండుచున్నదిగదా? దైవమా! నేను భర్తృపాదములనే నిరతము నమ్మినదాననేని నా మాంగల్యమును నిలిపి నాకుఁ బతిభిక్షనిమ్ము.

ద్రౌప: (ప్రవేశించి) చెల్లెలా! సుభద్రా! నీవింక దుఃఖముమాని ధైర్యము దెచ్చుకొనవలయును. మనకు నేఁడు గొప్పపని గలిగినది—

సుభ: అక్కా! అన్నిపనులునై చేతులు కడుగుకొనియే కూర్చుంటినిగదా, నాకింకను బనులున్నవా?

ద్రౌప: వెఱ్ఱిదానా! పోయిన కొమారుని కొఱకెన్ని నాళ్ళేడ్చెదవు? రణమం దెందఱు చచ్చుటలేదు? అందు నీ కొమారుని యాధిక్యమేమి?

సుభ: నన్నిపుడేమి చేయుమందువు?

ద్రౌప: ఇవిగో! ఇవి సైనికులు ధరించు దుస్తులు— ఇవి కృత్రిమ వేషముల కుపయోగించు మీసములు. మనమిద్దరమును చెరియొక వేషమును ధరించి కౌరవ స్కంధాగారమున కరుగవలయును.

సుభ: ఎందుల కక్కా?

ద్రౌప: ఎందులకా? భర్తగారి ప్రతిజ్ఞయు, సైంధవుఁడు దాగియుంటయు వింటివిగదా!

సుభ: అవును. అందులకు మనమేమి చేయఁదగినది?

ద్రౌప: ఏమైనను చేయఁదగినదే! మన కంతకన్న పతిసేవ చేయఁదగు సమయ మెప్పుడు? మన దేశమున నాఁడువారు కత్తిదాల్చి కచ్చబిగించి రణమునకు వచ్చినప్పుడు కదా దేశమాత ధన్యురాలు?

సుభ: చేయఁదగినది చెప్పకున్న నెట్లు?

ద్రౌప: పాములవాఁడు కలుగులోనుండి పామును బయట కీడ్చునట్లు యేదో యుపాయమున సైంధవుని కౌరవసేననుండి ప్రొద్దు గ్రుంకకముందు బయటకీడ్చి భర్తగారిముందుఁబెట్టి చంపించి యాయన ప్రతిజ్ఞను మనము కాపాడవలెను.

సుభ : అక్కా ! జగదేక ధనుర్ధరులైన భర్తగారిని మనమా రక్షించు నది ! ఇది యాయన పౌరుషము నవమానించి నట్లగునేమో సుమా !

ద్రౌప: ఇంక నాలస్యమేల చేసెదవు ? ప్రాణావసానమున పంచాంగముఁ జూచియామందువేయుట ? ఇంకనిట్టికుశ్శంకలుసేయక రమ్ముక- పోవుదము.

సుభ : అదేమో కోలాహలముగా నున్నది. విననిమ్ము.

(తెరలో)

జయతు– కౌరవేశ్వరునకు జయతు. ప్రొద్దు గ్రుంకినందుసపార్థుని ప్రతిజ్ఞ భంగమై సైంధవుండు జీవించినాఁడు. ఇఁక పాండవుల కగ్నిప్రవేశమే గతి. కావున సైనికులింక యుద్ధము మాని స్వేచ్ఛగా పండుగలు చేసికొన వచ్చును.

సుభ
ద్రౌప } హా ! పరమేశ్వరా !

(మూర్ఛిల్లుదురు)

(తెరలో)

జయ్–వీరధనంజయ చంద్రకీ జయ్.

ఘటో: (ఆనందముతో ప్ర॥) ఆహాహా ! శ్రీకృష్ణునిమాయ యెంత పొగడదగినది ? కన్నుమూసి కన్ను తెఱచినంతలో పినసంద్రి గారిచే సైంధవుని ప్రొద్దుగ్రుంకకముందు చంపించితిరి. ఈ సంతోషవార్తను దుఃఖాకుల చిత్తలయియున్న మాయమ్మల కెఱింగించెదను (పోఁబోయి) హా ! ఏమిది ? అమ్మలిద్దఱు నిందుమూర్ఛిల్లి వట్టినేలపైఁ బడియున్నారు. ఓహో ! వీరిందాకటి కౌరవసేనల యార్భాటములను విని మూర్ఛిల్లి

యుందురు. అమ్మా! సుభద్రాదేవీ! తల్లీ! ద్రౌపదీదేవి! లెండు లెండు— మన కింక దుఃఖకారణ మావంతయును లేదు. సర్వశాత్రవసంహారమై ఱంద్రులానందముతో వచ్చుచున్నారు ! ఈ మంగళవార్తను చెవులారవిని యానందింపుఁడు.

ద్రౌప: నాయనా ! ఘటోత్కచా ! ఏమియిది ? ప్రతిజ్ఞాభంగమైనను మంగళవార్తయని యాశపోయుచుంటివేమి ?

ఘటో: హా ! హా, ఎక్కడి ప్రతిజ్ఞాభంగము ? మాయపన్నిన మాయాజాలమునంబడి సైంధవుఁడు మరణించినాఁడు. అదిగో ! పడమటిదిక్కున జగదానందకరుఁడగు ప్రభాకరుఁడు తమ్ముని మరణవార్తవిని మైలస్నానము చేయఁబోవుచున్నాఁడు.

సుభ : అక్కా ! యాజ్ఞసేనీ ! ఈ యానందవార్తచే నాశరీరము ప్రకంపమానమగుచున్నది. ఈవార్త నిజమో, లేక మనము కలఁగనుచుంటిమో ! నిజమేయయిన నీవార్తఁదెచ్చిన ఘటోత్కచుఁడు చిరజీవియగుఁగాక.

ద్రౌప: నాయనా ! ఏమిజరిగినది ? మాయన్న కృష్ణుఁ డేమి మాయ పన్నెను ? ఆ సైంధవ చండాలుఁ డెట్లుహతమయ్యెను ?

ఘటో: ప్రొద్దు నోకనంకచూచుచు గడియలు లెక్కించుచు కౌరవులు సైంధవుని దమనడుమ నుంచుకొని దుర్భేద్యమగు సైన్యమును చుట్టునుంచి, రక్షించుచుండిరి. అప్పుడు మామయ్య తన చేత చక్రముందాల్చి సూర్యభగవానుని కడ్డము విసరినంత జగమెల్ల నంధకారమయమై ప్రొద్దుగ్రుంకెనని సైనికులెల్ల కోలాహల మొనర్చుటయు; సైంధవుఁడు తలయెత్తిచూడ పినతండ్రిగారు శ్రీకృష్ణాదేశమున వానితలనఱికి, చక్రము నుపసంహరింపఁ గౌరవసేనల హాహాకారములును పాండవసేనల సింహనాదములును నొక్కసారిగా మిన్నుముట్టినవి.

సుభ : (ఆత్రముతో) హా! హా! ప్రమాదము ! ప్రమాదము ! !

ద్రౌప: చెల్లెలా ! యేమి ?

సుభ : ఆ దురాత్ముఁడగు సైంధవుని శిరంబును భూమిపై గొట్టినవాని తల సహస్ర ఖిన్నంబు లగునట్లు వానితండ్రి శపించెనని భర గారే నాతో వచించియుండిరి.

ఘటో: అమ్మా ! తొందరలేదు, మామయ్య యంత తెలివితక్కువ పనిచేయునా ? ఆ సైంధవుని శిరమును తపస్సుచేసుకొనుచున్న వానితండ్రి హస్తములఁ బడవేయింప వాఁడు స్వశాపంబుననే మరణించెను. విజయమంగళ గీతములతో నందఱును శిబిరము లకు వచ్చుచున్నారు. మన మెదుర్కొ-నఁబోవుదము రండు.

అందఱు— (అనుబంధము. 59) (ప్రస్థానము)

దృశ్యము:—౮

ప్రదేశము:—పటకుటీరము.

ప్రవేశము: ధర్మ, భీము, అర్జు, కృష్ణ, ఘటో, సుభ, ద్రౌప, ఉత్తరలు

ధర్మ : వాసుదేవా ! నీ దయచే నింతవరకు మా మర్యాద నిలిచినది. నిన్నెంతని స్తుతింపగలము ?

అర్జు : బావా ! నీ ఋణము మేము తీర్చుకొనలేము. పుత్రశోకమున నిన్నె మేమో తూలనాడితిని క్షమింపుము.

(అనుబంధము 60)

సీ. పాంచాలికామాన ♦ భంగంబుఁ గానీక
వలువ లిచ్చిన దయా ♦ పరుఁడవీవు,
నియమభంగంబు గా ♦ నీయక సజ్ఞాత
వాసంబుఁ దీర్చిన ♦ యీశుఁడీవు
శమ కోర్చి రాయబా ♦ రము సల్పి మాకయి
దయఁజూచినట్టి బాం ♦ ధవుఁడ వీవు
చక్రంబుచేఁ బ్రతి ♦ జ్ఞను నిల్పి దుష్టసైం
ధవుని జంపించిన ధన్యుఁడీవు

అరులఁ జిక్కినమా స్వరా ♦ జ్యంబు మాక
రంబులను జేర్చుటొకటి కొ ♦ అంతగలదు
దనుజులను ద్రుంచి ధర్మపా ♦ లనముఁగూర్చి
భరతరాజ్యము నుద్ధరిం ♦ పంగదయ్య !!

కృష్ణు: బావా ! నీవింత యడుగుకొన నక్కఱలేదు. సర్వకౌరవసంహారముతోపాటు పాండవ పట్టాభిషేకోత్సవమును శీఘ్రకాలములో హస్తినాపురమునం జూడఁగలము. నీ కింకేమి కావలయును ?

అర్జు : బావా ! నా కింకేమియు మనంబునలేదు; కాని కుమారుఁడు దుర్మరణము పాలయ్యెగదా యని——

కృష్ణు: వెఱ్ఱివాఁడా ! మహారణంబున శత్రుల మారణంబుఁగావించి చచ్చినవానిది దుర్మరణమేమి ? అయినను నీకావిచార మేల ? ఆతండు వీరస్వర్గమునఁ దాతయగు దేవేంద్రు నర్ధాసనమున నెటులుండెనో చూడుము—మీ కందఱికిని దివ్యదృష్టినిచ్చెద.

గీ. భావి నభిమన్య శతకంబు ♦ ప్రభవ మంది
శ్రీభరతమాతను సముద్ధ ♦ రింతుగాత !
కాని యటువలె మృత్యువుఁ ♦ గాంచకుండ
చిరముజీవింతుగాత ! శ్రీ ♦ కరము గాఁగ.

(వీరస్వర్గమున నింద్రునర్ధాసనమున నభిమన్యుఁడు కనఁబడును.)

మంగళము.

ప ం చ మా ం క ము.

సర్వమును

స ం పూ ర్ణ ము.

అనుబంధములు

1. అందెలు. సారంగ—ద్రుపద.

కారుణ్యసార । కలుషవిదూర । ఘనసార॥అఅఅఆఆఅ [illegible]

త్రిపురసంహార । ఓదురిత భంజన ఓసనసగంజన [illegible]

ఓసత్యచారిత్ర । ఓభక్తనస్తోత్ర । ఓత్రినేత్రా [illegible]

శ్రీవాసుకి పతిభూషా । పోషిత సర్వేశ [illegible] ॥కా॥

2. సారంగుడు సారంగ—ద్రుపద

యశోదానంద । ఆనందకర । యశోపేత । [illegible] ॥[illegible]॥

పరమపద విలాసవేష । పర్బ్రహ్మపురుషో త్తమ

సురుచిరాంగ శుభాకార । సురాధీశ । [illegible] ॥[illegible]॥

3. అందెలు బిన్ఫలాసి —ఆది

కనుస్తుయూనవసోయగమహరె । సుందరిముగను । సుందరముగను ॥క॥

విరిజాజులు మ । ల్లెలు మొల్లలతో । విలాసయుతస్తు

యుపేంద్రవనంబున, [illegible] । గనంగ । [illegible] । [illegible]

అఅఅ । లఅఅఅ । అఅఅఅ ॥క॥

4. జైలాకు—బ్యాగ —ఆది

(వగఘటుపరహాస్తై ధీపలి)

ఉత్తర ... సరి సరి పరిహాసములా । విూరలిటు [illegible] ॥స॥

చెలులు—వగ । లమారీ । నమ్మ॥కొమ్మా । [illegible]

పరుషముల్ । పలుకలే । దమ్మా ॥స॥

5. జైలాకు—బ్యాగ్—ఆది

మం. వ—చాలుచాలూ । నీ వగలాడితనమూ । చాలుచాలూ

నీగయ్యాళితనమూ । చాల కలహము పెంచితివి యీవేళ

మాతోసంవాదమూ । చూడునీపలుకులు సయిపను ॥చా॥

భ్ర—ఏటికెయిటువమ్మ | మ్మాటికిబలుకా | సాటివారలు పక
పక పక నగరేచాలించూ | చాలించూ | చాలించూ | వాదము॥చా॥
ఉత్తర—మైత్రిని విడనాడి యిటులశాత్రవమును బూనగా
తేగునటె | తగునటె | సుదతుల | కనయము | అఅ | అఅఅఅ॥చా॥

6. మందారిక. వకుళ శంకరాభరణం—ఆది

చాలును మదవతీ | యఘగుణవతీ పలుకగ తగదిక
ఘోరముగను క్రూరముగను | యింతపొగరా యిక పదపద॥
దురంతముగ కటు | వచనములను నిటు | నతితరముగ
హితరముగ | నాడగా | భరంబుగా ॥చా॥

(7. భ్రమర ఫరజ్—ఆది)
(ఎంతగ్రహించితివో రాధావతి)

దురితాత్ముల మోసమునన్ | ఏవేళకునేమా | నోఓఓఓఓ ॥దు॥
సఖియని నమ్మిన వకుళమాలయే శాత్రవమిటు పలుపన్
పహితంబుననీభూ | మిస్థలమునవే వారలుసలుపుదురో ఒఓఓఓఓఓ॥

8. సుభద్ర – బ్యాగ్ –ఆది

చాలు బాలా యీలీలా సం | తసమూరన్
సంచరింపగూడదు రణ సమయములన్ ॥చా॥
కుటిలమతులు చటుల గతుల తటుకున సహితము సలుపన్
బేలలై గోలలై చాల చింతిల్లెదరు ॥చా॥

9. మందారిక వకుళ, బ్యాగ్—ఆది.

అమ్మానీవూరక యుండినకొంపలు మునుగుచు నున్నవమ్మమా॥ య
ముమ్మాటికి నమ్మవమ్మయుత్తర మురిసి మురిసిపడిమొమగనిగనుగొని॥
ఎంత తామసమొ ఎంతరాజసమొ యెంత కోపమా తోత్తుకు గనగా
వినగం జాలనునీపై నాడిన విపరీతపు భాషణముల నిక మా ॥య॥

10. దుస్సల, కాఫీ–ఆది

నీవలననెకా యింతటిఘన కార్పణ్య భావములు జననము గనుటా ॥నీ॥
కోరలూడిన భుజంగముం గనిన మండూకము వెక్కిరించుగాదె

ఘోర కుమారునివధకు ప్రతిక్రియ చేగను సలుపగ [illegible] ॥నీ॥
పాచికల చింతమానవే । నీవు [illegible]
నీచబుద్ధి భ్రమర మాటల్కైన సుయోధనుం [illegible] ॥నీ॥

11. సైంధవుండు. సారంగ 10 [illegible]

శాంతింగన వినుమీ నాశనింపనిని [illegible] ॥శాం॥
పరేత విభుండు భయంకరముగా [illegible]
రణంబు కలతపరుప నేం । చిన స్వామి [illegible] ॥శాం॥
అభిమన్యుని హతమాన్యుని గర్వగతిచే [illegible]
నసువులు విడగా । భువినింబడగా ॥శాం॥

12. అర్జునుఁడు. సారంగ—ద్రుపద్.

మహాఘోర లయకాలము [illegible] ॥మ॥
అహోబంధు వినాశంబు కఠినతర [illegible] ॥మ॥
రుధిరాయిత రణభూతలి విధిగతి [illegible]
మాధవా నెత్తురుకూడిది తినజాలను మనజాలను ॥మ॥

13. కృష్ణుఁడు [illegible]

([illegible])

బావా యిటులాడ తగదు [illegible] ॥బా॥
ఈవేళ భీతిగాంచగ నీ [illegible] నవ్వ్వదు [illegible] ॥బా॥
(సాకీ) ఆయుధంబుల్వీడి నీవి [illegible]
వైరాగ్య భావము జూపగా
సర్వసేనా సాగరంబుల్ సంశయంబు [illegible]॥
(మిశ్ర) పాండుసుతా [illegible]
క్రూర కర్మలు కురువంశజులు ఘోర [illegible] ॥బా॥

14. అర్జునుఁడు—యమున. [illegible]

కురుభూప కులతాప మతిపాప మనురూప ॥కు॥
నరరూపధర ఘోరదను బాధముడవౌట
నారాయణ నాశనము జాల్పగాజాల ॥కు॥

కులతాతలను భ్రాత॥ లను గూల్పనా నాకు
కరమాడ దింక వె॥ న్క-కు దోలుమా రధము ॥కు॥

15. కృష్ణుఁడు, అర్జునుఁడు. పగజ్-ఆది

ఓంకార భవశక్తీ। శ్రీ శాంకరీ యవతార శక్తీ ॥ఓంకా॥
సకలలోక సంహార హారిణీ। ప్రకటోద్భట లయకాల కారిణీ
బ్రహ్మరుద్ర చిద్రూప ధారిణీ। ప్రపంచ మాయాధేయ చారిణీ ॥ఓం॥
శుభ్రజ్యోత్స్నాంబర సమ్మోదా। శుద్ధ మాయా స్వరూపవినోదా
నభ్రప్రోజ్వల శాత్రవ భయదా। యనుపమానరక్షావన వరదా ॥ఓం॥

16. భీష్ముఁడు. బ్యాగ్ ఆది.

శూరులు మీరను సురేశు నయిన వధింపుడ
ణంపుము శూరత మెరయగ ॥శూ॥
కురుకులేశు నీరాశనములందినుచు। గూడదు రిపుంగొలువం
జటులధృతి న్నలుపగమీ। రజితులగుచు
కరమందుం శరములు దాల్పుడు ॥శూ॥

17. భీష్ముఁడు. శ్రీరాంగ-ఆది

సంగ్రామము న్నల్పెడు మీ వైరులకు ద్రుంపం దగును
రణమున్నలుపఁ జనుడీ మీ బాణాసనంబులు గొనుడిక
మీమహా బాణాసనంబులం గొనుడిక
రిపులను బరిమార్పదగు ఘోరముగ ॥సం॥
పటుతరమగు పాండవ సైన్యములన్భరంబయిన మీపరుషశరంబుల
పరాక్రమంబున ద్రుంచివేయుడీ కడున్
రయంబున కడున్ రయంబున ॥సంగ్రా॥

18. అర్జునుడు. బీజా ఫలాన్-ఆది.

ఈరణమున గనుగొన భరముగ దోచెను
మనమున నెదియును దోపదు హరి ॥ఈ॥
అభిమన్యునిగనుగొనగన్ కాలరుద్రు గణి వెలిగెడు
నేపగిదిని యీాబవరము సేయ దగునో తెలియదు ॥ఈ॥

పది దినములు గతియించెగా! మద మొక యింతయు నణగదుగా
ముదుసలి యాతడనుచు దలచిన నీగతి యసాధ్యుఁడయిగా న్పించెను ॥నీ॥

19. పైలాగు— జ్యాగ్— ఏక,

భీష్మ—ఈరణమునందు మిము మారణము జేసిమా
భూరమణునకు ప్రీతి సలిపెదను గనుడు ॥కను॥
అర్జు, కృష్ణు—బాహుబలశూరులకు వృథావివాదమేల మానుడీ
భీష్మ—వీరసూనులయి మదిని భీతిగొనక నిలువ్రుడీ
అదరు బెదరు లిక నేలా॥
అర్జు, కృష్ణు—అటులయిన శరముగొన వేలా
భీష్మ—శస్త్రమున గూల్తురా బాలా ఛీ బాలా ఛీ బాలా ॥కను॥

20. కృష్ణుఁడు, జ్యాగ్ — ఆది

అక్రమమో సక్రమమో చక్రంబున ద్రుంపక విడువను గను ॥మ॥
పది దినములనుండియు నొక విధమున పరాక్రమము
సలిపెను బ్రహ్మచారి పదను శరంబుల బడలె శరీరము
వదలకన్ భీష్ముని వధించి వేసెద ॥అ॥

(గోవింద దామోదర గతె)

21. అర్జునుఁడు యమునాకల్యాణి—ఆది

శ్రీమద్రమా నాయక । శ్రీ నాయక ॥శ్రీ॥
శరమునందు చక్రమునీవెగొన । పార్థునిబల మేలా శ్రీనాయక॥
సకలలోకము నాశనము ఘటింపదె శాంతింపంగదవే శ్రీనాయక॥
రథికునిసల్పి సారథి వగుచురుగవె రౌద్రము నహించకు గే శ్రీనాయక॥
చక్రాహతి నుపసంహరింపదగు నరిపెద నంజలులు । శ్రీనాయక॥
శ్రీమిత్రమా॥

22. భీష్ముఁడు. సోహిని—చ్ఛపద.

పాహిపాహిమాంపాహి దయానిధిబహుళ భవహరణ పావనచరణా॥
అమలసురతవితచరితవిగతదురితవిమలనిరిత
సలిలభవనపాదాంబుజాతిసకల భువనస్యాయం భూత
సోమసూర్య విలోచనా సుమనోవిధాన సూరిసన్మోద ॥పా॥

23. బ్యాగ్—ఏక
అందము—(సదానంద కందళిత హృదయాన వలె)
మహారాజ రాజాధిరాజా! మహనీయ కవికల్పభుజా!
అహో నీ ప్రతాపంబు నాశాంతరము లంటె యరులం ద్రబతారించు
భూవరా! సహస్రరిపుభయంకరా! పరాకు శ్రీశంకరా! ॥మహా॥

24. అశ్వత్థామ బ్యాగ్—ఆది
ఖండించెదరా! ఖలమతి గనరా! కాచుకొమ్మ గర్వంబునువిడరా॥ఖం॥
మొంటితనమునన్ మూఢబలుకన్ దండివాడవౌదువె? తులువా॥ఖం॥
బ్రాహ్మణవైరము రా! పలువా! నీ ప్రతాపదీపము వెలుగదురా!—
నిన్నంతకుజేర్చెద బలముగలిగినన్ ॥హా॥ కురుకుల ఖలవిద్రోహి॥ఖ

25. సురట—ఆది
ఆర్య—(తెలియవె నాశక్తిని వలె)
పొగరణగించెదరా! కను తెగువనా పయినికం బలుకదగదు ॥పొ॥
ఖలమతీ! యధమకులపతీ! హతగతీ!
నృపతి మొగము కనుగొని సయిచితి ॥పొ॥

26. అందము. బ్యాగ్—ఆట
విజయీ! జయీ! సేనాధిపా! రణ దినమణీ! ద్రోణాగ్రణీ! ॥విజ
ప్రచండ శూరా ప్రకటిత ధీరా! పరబలహారా! విజయకరా!
పరబలహారా! విజయకరా! జయ్ పరబలహారా! విజయకరా!

27. ఉత్తర. బ్యాగ్—ఆట
ప్రాణనాయక! కుశలమే! వ్రణముల ఘన కారణము తొలగెనే ॥ప్రా॥
కరమందున గలగాయము మానెనే?
గురుతరమగు శ్రమకోలది యయ్యెనే!
కనులకు నిద్దుర గాంచుచున్నదియె?
సంతతంబు హృదయము సంతసమందెనే? ॥ప్రాణ॥

28. ఉత్తర, పూరి,-ఆది.
ప్రాణేశా! యమంగళ వచనములను బలుకంగా దగునా? ॥ప్రా॥
ఆహవ సమయము నందు సతంబూ:
హానిం దలచుటది యతిభయదంబూ ॥ప్రా॥

కౌరవేశ్వరుడౌ కాదుహరుండౌ రణంబునను మిముజయించునే?
పాండవమధ్యమ ననసుతుండవే? భాషణముల నతిదీనత నాడగ ॥ప్రా॥
ద్రోణుండాహవోద్యోగము సలిపినదానికి ప్రతిసలుపగ లేరే?
లోకైక వీరుడవు కార్ముకధరుడవు ॥ప్రా॥

29. ఉత్తర బ్యాగ్—ఆది

ఇటుల సలుపగ దగునే? ప్రాణనాయకా! ॥ఇటు॥
తటుకున సమయము నెఱుగక సరసములాడగ ॥ఇ॥
పరు లెవరయినను కనుం గొనపరిహాసాస్పదమౌంగుస
సరస గుణాకర! యింతటి జాలిం గొనంగం దగునే?
కరుణామయ హృదయా! ప్రాకట ప్రితజన సమయా!
ఉదయమునుండియు నిటులేవగింకెన రిది చిత్రము ॥ఇ॥

30. అభిమన్యుడు. మోహన త్రిశగతి.

దుష్ట కౌరవాధములను దునాతుస్కులు గానింతు
కష్టంబులు హరియింపంగ హాహాహహా ॥దు॥
జగములు గడగడ వడకన్ చలియింపని కడకస్
జగద్గేయ కోదండాస్త్రములన్ పితలన్ జేరగ ॥దు॥

31. సుభద్ర. మాయామాళవగౌళ—ఆది

ఇదే! కోదండమూ! మదరిపు సీరాల కిసిగెముమది ప్రచండమూ ॥ఇ॥
(త్రిశ) కదనమందు కురు కుమారా కాండములను
సంహరింప ఎదురులేని శూరుండని యీధరణిం బ్రతిధ్వనింప ॥ఇ॥

32. సుభద్ర సారంగ–14 అక్షరములు

మహాభారత సంగ్రామజయ మహా! నీకుగల్గు నభిమన్యు ॥మ॥
సహస్రాశీర్వచనంబులను జయప్రదముగను జనని యొసగు ॥మ॥
బహుళ కౌరవేశ్వర సైన్యముపయిం బడుంగాక
యొంటరినయి సహాయ హీనతగలుగు గాక
సమాన, రహితుడవయినిలతువు ॥మ॥

33. సుభద్ర కల్యాణి–ఆది.

గర్భవాసమున తనయుడు గలిగిన గర్వమిపుడు గలిగె ॥గ॥
దుర్భర రణమైనను సరియే సుతు దర్భకుండైన సరియే

వీరసతీమణికి తగును ప్రియ తనయుని రణముఁజేర్ప శౌర్యముగా
దృఢతర ధైర్యముగా ఘన కార్యంబుగా భరతభూమి
వడతుల కిక పిరికితనము తగదుగా ॥గ॥

34. ద్రౌపది కన్నడ-అట

పసిబాలు నంపితివేమే? ఘన రణాంగణమునకు మన ॥ప॥
అసదృశాకారుం డతఁడు పదునారు వర్షములైన నిండవు
కఠిన మానసమును వహించి యకార్యమిటు సలిపితివిగా ॥ప॥
రణముననుఘన వ్రణము గని చెయి వలను దప్పిన దయిన
నెరుగక క్రూరతరముగ ఘోరతరముగ వ్యూహములుభేదింపుమని ॥ప॥

35. ద్రౌపది. కాఫీ-ఆది.

ఎంతకఠినాత్మనమ్మా! కమపుత్రిపి సుంతదయుంగనవు ॥ఎం॥
చేతి బిడ్డనెటుగాతురే! కాక నూత వేసుకొని చూతురే
క్రూరమె! చటులఘోరమే! విపులభారమే! యభిమన్యునెడల ॥నె॥

36. సుభద్ర-ఆది.

మదినికోపమీా వందగ దగదమ్మా! సంతతము సంతతమునె ॥మ॥
అధార్మికులైన యరాతిగణంబు
వణపగ తనయుని రణమున కనిపెద ॥మ॥
కురుకులమును వధియించునుగా మనకది ముదమును గూర్చునుగా
భరంబయిన యలపద్మవ్యూహము జయించుగను మానసతంబువినుమా

37. అందఱు-బ్యాగ్ డ్ ఏక.

అంభోజ సంభూత శంభుప్రధానాది
గంభీర కాలాంతకుల్ మీారహో!
స్తంభింప నంబు ల్విడంబింపగా
నొంపగా ద్రుంపగా జూడరే ॥అం॥

38. సైంధవుడు-బ్యాగ్-ఆది.

నా సాటి వారెవ్వరూ? జగంబున ॥నా॥
రోసంబు దీపింప రుద్రుండ భద్రుండ ॥నా॥
దోషుల న్వధింతుగా । మదోన్మత్తుల హారింతుగా
త్రుంచెదన్ వంచెదన్ కుమతి వినుత బలము నిలను ॥నా॥

39. సైంధవుడు—బ్యాగ్—త్రిశ్ర

భీకరముగ నాతో బోర భీముండైనను గాదు సుయోధనా ॥భీ॥
లోకంబుల నడగింతుం జీకు పడగ నయినను
నాకాధిపుడైన స్మరి లోకాధిపుల నయినను
పాకారి ప్రముఖులయిన పరువడి బరుసిడ గాదు యిక ॥భీ॥

40. అభిమన్యుడు—సురటి—ఆది.

పిరికితనంబున సంతతమూ పలుమగు నీమాటలు దగునా
సుధర్మా! హా! పలుమగు నీమాటలు తగునే! సుధర్మా
సంగరరంగము నందలిసినను అన్యులబలమున [illegible] నేలా ॥పి॥
శౌర్యము నిల్పగ జాలిన [illegible] చాలను
యొకడిక నూరుగు [illegible] ॥పి॥

41. సైంధవుడు—బ్యాగ్—ఆది.

వరప్రసాదుడ గానా! దుర్గ్వ్యయుల ద్రుంపగ [illegible]
కరంబుడంబున విరోధి పుంజము గడగడ గడగడ [illegible] ॥వ॥
సురాసురులు నే [illegible] [illegible] ॥వ॥
స్వరంబుగా నీభారత సంగర భాగంబున [illegible] ॥వ॥

42. అభిమన్యుడు. బ్యాగ్—ఆది.

ఖలమతీ! వధింతురా! పలుకగం దగదు [illegible] ॥ఖ॥
కులసతులం జెఱగొను నీశిరము [illegible] సిరతము. ॥ఖ॥
పావని యగు పాంచాలి కేశము [illegible]!
ద్రోహీ! యికవిమువను గొంతుకగోసి [illegible] ॥ఖ॥

43. సుయోధనుడు బ్యాగ్—ఆది.

నీ తల్లిన్ హతపుత్రున్ గావించెద భీకరముగ గనరా ॥నీ॥
ముక్కుపచ్చలారని నీవేడా? భువన భయద సంగ్రామము దేడా?
చెడెదవురా! బడలెదవురా! కదు నడి నిక్కకు జనరా ॥నీ॥
చటుల భీకరోద్భట వీర కాండ హృదయ పుట భేద
సింహనాదముల కడలు కెంది మ్రో! యను
సమయము దరియించన్ భరియించన్ జాలవు ॥నీ॥

44. అభిమన్యుడు. కళ్యాణి. 14 అక్షరములు.
ఓరోరి ద్రౌపదీ కేశాంబరాకర్షణ మహాపాతకవర్తి
మలినకీర్తి! వాచికలుగావు భండనమిది ॥ఓ॥
సారాచార సదన్వయంబునకు తీరని దుష్కళంక
మాపాదించితిగదరా! ఎటుల్ బ్రతికితివి హాటంబునను ॥ఓ॥

45. కర్ణుడు—ఖరహరప్రియ—ఆది.
బాలకా! నిలునిలు వధింతురా! దుర్మతిశాత్రవ ॥బా॥
మిడిసిపడగబోకురా! కడు నడచి పడగరాకురా!
సరగున శరమున మునిమొన కనుమిదె! బాలా!
పసమాల్చెదరా! ఈవేళా ఇట నిలువుమురా!
ఛీ! కూళా! ఖలమతి చాలా ॥బా॥

46. అభిమన్యుడు ఖరహరప్రియ - 9 అక్షరములు
నీ ముఖమునుగనన్ పాప మదురా
నింద్యచరిత్రా! వృథావాచాట! ప్రొద్దుట ॥నీ॥
విజయుని వేధింతువా! సమరవిజయము
సాధింతువా! నిత్యకర్మ్మదవు ॥నీ॥
ఇంత దౌర్జన్యమా! మరియింత కార్పణ్యమా!
చూడు మిపుడు నిను హతమార్చెద ॥నీ॥

47. అందరు. బ్యా—ఆది.
కడు మోసంబయ్యెనహో—కర్తవ్యం బరయుడికా
జాలంబేలంగావింపన్ పసిబాలుండని చాలా ॥కడు॥
ఖేదమయ్యె ఖేదమైవిరోధమయ్యెగా! క్రూరాచారున్ ఘోరాకారున్
ధీరోదారున్ సారాచారున్ గూల్పగ వలయునుగా! హా!హా!హా!॥కడు॥

48. దౌశ్శాసనుడు—మోహన ఆది.
బాలక! నీమదమణగింతునే! పరాక్రమమునుజూపుమునామొదుటన్ ॥బా॥
ఖలకార్యముల సలుపందగునే! కడుంగడుపొగరుగనంగలిగితివి ॥బా॥
భూతభేతాళ పతులకు నిన్నిదె—బలియిచ్చెదరా!
తులవా! పలువా! ఖ్యాతి గొనందలచిన
తలపదుమిక గర్వంబును గ్రక్కించెదరా ॥బా॥

49. అందఱు—బ్యాన్—త్రిశ్రగతి.

మా! రా! కా! రా! హా! ఘోరా ॥హా॥
మామదిన్ శోకముంగూర్చితే ॥హా॥
షోడశాబ్దములకే శత వత్సరములు నిండెనే?
వీడని దుర్భరశోకము నిడి సురనగరము చేరితే ॥హా॥

50. ఉత్త—నాదనామక్రియ—ఆది.

హా! జగన్మోహనాకార! ధీర! హా! జగద్వందితాసిగ! నరవర ॥హా॥
భాజనమై శోకమునకీగతిని పక్షిన్నై దిక్కు—మాలి మంగళసూత్రము
బసుపు కుంకుమ నేటికి నేలరాలెనయ్యో! నాపాలిసిరి ॥హా॥
మన పెండ్లికి జదివిన మంత్రము లింక మాయలేదు
చెవులలోఁ బ్రతిధ్వని యనయంబును వచ్చుచోదయంబుల
యాతులైన మాయగ లేదింకను ॥హా॥

51. అర్జునుడు. యమున ఆది.

ఈపరితాపంబూ అలఘుతరంబూ నిర్భరశోకము నిడుదుర్భరమూ ॥ఈ॥
ఈశ్వరా! రిపులకైనను యీదుఃఖము కూడదయ్యో
ఏవేళకు నేది గలుగుట నెవరికి దెలియునూ ॥ఈ॥

52. అర్జునుడు మాళ గౌళ—ఆది.

తనయా! మనఋణముదీరె, ధృతి విడదూ
సంతత హితసునయా ॥తన॥
మనమందున సుంతయేని వాత్సల్య । మును గనగ సుగమార్గముఁజేర
జనకుడనునేను గావించినదో । సంబదేమొ వివరింప నేమిరా ॥తన॥
గాండ్రుమనుచు నాల్గువంకలను రాక్షసులుమూగ కఠినమగట్టు రక్తము
తండ్రీ! నీమృతకళేబరము నేత్రముల జూడవలసి వచ్చెనా ప్రియ ॥త॥
నీచేతుల మీదుగ నాతనువును । విడువ జేయు తలచితిని గానియా
మాయదైవ మిటు లమాయకుని నిను
బాయఁజేసి కొనిపోయెను హా! ప్రియా ॥తన॥

53. అర్జునుడు. బ్యాగ్—ఆది

హా! నాతనయుని దునిమిన తులువైనను సైంధవుని
గొడవద నడపెద నింకను శాంతముంగన వినుడీ! హా॥ హా॥

కానీయెంతటి సంగరంబయిన కడువడి కౌరవ గణములు రానీ!
వానింజంపకయుండిన గాండీవముతో భస్మంబయ్యెద రేపట ॥హా॥
హా! లోకైక వీరవరుండు నాదుతనయుండు అభిమన్యుడూ
కేళి సదృశ సంగ్రామకళా నిపుణుండూ—
అట్టి మారసుందరుని నికృష్టుడైన సైంధవుడు
పొట్టబెట్టుకొనియె నంట! నెట్టులోర్తు గర్భశోకమును ॥హా॥

54. జైలాగు. బిలహరి—ఆది.

దుస్స—ఏలా! తెలివిమాలి బల్కుట కూడదు సుమా! ॥ఏ॥
మధురస వశమున మాటికిట్లు మతిచెడి పాతకీ!
వంశము నపకీర్తి పాలు జేసెద ॥వే॥

సైంధ—పిరికి తనము చచ్చున్ పలువిధ సుఖములు హెచ్చున్
వట్టిగాలిలోనె నాటకముల బుడ గనుపించున్
హాయియా పరవశ సుఖ సంధాయియా నోటికి రుచిగల నేయియా
దీనికి సరి నహీనహి యిదిసారాయియా ॥ఏ॥

55. దుస్సల మోహన—ఆది.

ఇపుడైకా! యానందమయ్యె! ॥ఇ॥
కురుపతికి దగినశ్యాలకుఁడ వైతి ॥ని॥
విరోధి వధంబు వినంగ మదికిం బ్రమగము గలిగెను వెతదొలగెను॥
సమాన రహితుని సమానఘుని నీ
కుమారువధింతు నని యనూనముగ సుభద్రతోఁ
బలికిన బ్రతిజ్ఞలకు బ్రమదముగలిగెను వెతదొలగెను ॥ఇ॥

56. దుస్సల. బ్యాగ్—ఆది

ఛీ! యెందులకీ బ్రదుకూ? కడు భీరుత్వమును
కనుపరచితి కడురణభీరుత్వంబును గనుపరచితి బ్రాగుఁబోత! ఛీ! ఛీ!
కటకట యవసానుండగు తనయుని కపటమనుచు నీ
మనమునదలపక తటాలుమని శిరము ద్రుంచివేసితె? కడున్
హాటంబున కడున్ హాటంబున ॥ఛీ॥

57. [illegible] 10 [illegible]

[illegible]

58 [illegible]

[illegible] ||[illegible]||

59– [illegible]

ఆహా! జయగీతములు —మంగళ
ఆహా! జయగీతములు —మంగళ
వాద్యంబులతో [illegible] ||ఆ||
అమరులెల్ల [illegible]
నయ్యంబ [illegible] [illegible]
కమల లోచనుని [illegible]
కపిధ్వజస్యందనమున విజయుని ||ఆహా||

60 అర్జునుడు– (అఘుహొరా? [illegible]–)
మురళీధరా! జగన్మోహన! గోవింద!
సురుచిరాంగ మధుసూధన కృష్ణా ||ము||
కరుణదలచితివి! ఖలుల దునిమితివి!
పరమానందము నిడితివిగా!
[illegible] [illegible]మగునా?—
విమలమతివి సద్గుణ చరితుండవు మురళీ||

సంపూర్ణము.